www.prajasakti.com

ప్రజాశక్తి

ఆదివారం 15 సెప్టెంబరు 2024 5

పశ్చిమ గోదావరి



యండగండి కళాశాలలో ఆకస్మిక తనిఖీ


విద్యార్థులతో ముచ్చటించిన కలెక్టర్

ఉండి : మండలంలోని యండగండి ప్రభుత్వ జూనియర్ కాలేజ్‌ని ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి క్లాస్ రూమ్‌లోకి వెళ్లి విద్యార్థులతో ముచ్చటించారు. బాగా చదువుకుని మంచి భవిష్యత్తుని సాధించాలని సూచించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ రామ ప్రియను కాలేజీలో ఎన్ని గ్రూపులు వున్నాయి, ఎంతమంది చదువుతున్నారు అని కలెక్టర్ ప్రశ్నించారు. ఎంపిసి, సిఇసి, హెచ్ఇసి గ్రూపులు అన్ని కలిపి 105 మంది విద్యార్థులు చదువుతున్నారని కలెక్టర్ నాగరాణికి తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ మరింత ఎక్కువ మంది విద్యార్థులు కాలేజీలో జాయిన్ అయ్యేలా చూడాలన్నారు. క్లాస్ రూములు, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. కాలేజీ సందర్శన సందర్భంలో కాలేజీ ప్రిన్సిపల్ ఎన్.రామప్రియ, అధ్యాపకులు, సిబ్బంది ఉన్నారు.

వరద తగ్గింది.. బురద మిగిలింది..!

కుదుటపడుతున్న లంక గ్రామాలు

దెబ్బతిన్న పంటలు




కోడేరు వద్ద వరద నీరు తొలగినా పేరుకుపోయిన బురద

ప్రజాశక్తి - ఆచంట

గోదావరి వరద ఉధృతి తగ్గడంతో నాలుగు రోజులపాటు జలదిగ్బంధంలో ఉన్న లంక గ్రామాలు ఇప్పుడిప్పుడే కుదుటపడుతున్నాయి. గ్రామాల్లోని లోతట్టు ప్రాంతాల్లో చేరిన వరద నీరు పూర్తిగా తొలగిపోగా బురద మిగిలింది. అయోధ్యలంక, పుచ్చల్లంక, భీమలాపురం శివారు కాపులపాలెంలోని వీధుల్లో వరద నీరు తగ్గింది. గోదావరి తీరం వెంబడి ఉన్న కోడేరు, పెదమల్లం, కరుగోరుమిల్లి, భీమలాపురం పుష్కర ఘాట్లు ముంపు నుంచి బయటపడ్డాయి. పెదమల్లం మాచేనమ్మ ఆలయం, పర్యాటక కేంద్రం చుట్టూ చేరిన వరద నీరు తొలగిపోయింది. గ్రామాల్లో వరద నీరు తొలగిపోవడంతో జనజీవనం గాడిన పడింది. నదిలో వరద ఉధృతి తగ్గడంతో నాటు పడవల రాకపోకలు ప్రారంభమయ్యాయి. సుమారు వారం రోజులపాటు లంక భూముల్లో వరద నీరు నిలిచిపోవడంతో విలువైన పంటలు దెబ్బతిన్నాయి. అయోధ్యలంక, పుచ్చలంక, పెదమల్లం, ఆనగార్లలంక గ్రామాలతోపాటు ఏటిగట్టు దిగువనున్న కోడేరు, భీమలాపురం లంక భూముల్లో పంటలు దెబ్బతిన్నాయి. ఇప్పటికే రెవెన్యూ అధికారులు పంట నష్టం అంచనా సర్వేకు సిద్ధమవుతున్నారు. పంటలు చేతికొచ్చే సమయంలో వరద సర్వనాశనం చేసిందని రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

పీడిత ప్రజల పక్షపాతి ఆర్ఎస్

కుటుంబ సభ్యులకు ఆచంట ఎంఎల్ఎ పితాని పరామర్శ



ఆర్ఎస్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న పితాని సత్యనారాయణ

ప్రజాశక్తి - భీమవరం

పీడిత, శ్రామిక ప్రజల పక్షపాతి, సిపిఎం సీనియర్ నేత, మాజీ ఎంఎల్ఎ ఆర్.సత్యనారాయణరాజు (ఆర్ఎస్) మృతి బాధాకరమని మాజీ మంత్రి, ఆచంట ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ విచారం వ్యక్తం చేశారు. స్థానిక ఎస్ఆం నగర్‌లో ఆర్ఎస్ కుటుంబ సభ్యులను శనివారం ఆయన పరామర్శించారు. ఆర్ఎస్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పితాని మాట్లాడుతూ తాను ప్రజా జీవితంలో ఎదుగుతున్న కాలంలో ఆర్ఎస్ సహచర్యం ఎంతగానో ఉపయోగపడిందన్నారు. తన రాజకీయ జీవితంలో ఆర్ఎస్‌తో గడిపిన క్షణాలను గుర్తు చేసుకుని ఆర్ఎస్ మృతిపట్ల ఆవేదన వ్యక్తం చేశారు. కమ్యూనిస్టు సీనియర్ నేతగా ప్రజా ఉద్యమాల నిర్మాణంలో, జిల్లా అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తూ తన యావత్తు జీవితాన్ని ప్రజా శ్రేయస్సుకే అంకితం చేసిన ఆర్ఎస్ ధన్యజీవి అన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కేతా గోపాలన్, జిల్లా కమిటీ సభ్యులు కానేటి బాలరాజు, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి కె.క్రాంతిబాబు, టిడిపి నాయకులు గణపతినీడి రాంబాబు, వేండ్ర శ్రీనివాస్, చెల్లబోయిన సూర్యప్రకాష్, వేండ్ర చందు, డివైఎఫ్ఐ నేత కేతా ప్రమోద్ ఉన్నారు.

క్రికెట్ స్టేడియం ఏర్పాటుకు స్థల పరిశీలన

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

తాడేపల్లిగూడెంలో నిట్‌కు ఆనుకుని ఉన్న 12 ఎకరాల ఖాళీ స్థలాన్ని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి స్థానిక ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్‌తో కలిసి శనివారం పరిశీలించారు. ఈ భూమికి సంబంధించిన వివరాలను తహశీల్దార్ ఎం.సునీల్‌కుమార్ కలెక్టర్‌కు వివరించారు. భూమిని అప్పగిస్తే దాతల సహకారంతో క్రికెట్ స్టేడియం అభివృద్ధికి చర్యలు తీసుకుంటానని ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ కలెక్టర్‌కు చెప్పారు. అనంతరం 32వ వార్డులోని స్విమ్మింగ్ పూల్‌ను వారు పరిశీలించారు.

రాత్రి విధుల్లో డ్యూటీ డాక్టర్ తప్పక ఉండాలి : కలెక్టర్



వైద్యులతో మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ఆసుపత్రి వైద్యులు సమయపాలన కచ్చితంగా పాటించాలని, రాత్రి విధుల్లో డ్యూటీ డాక్టర్ తప్పకుండ ఉండాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి వైద్యులను ఆదేశించారు. తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రిని ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్‌తో కలిసి శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఇంటిగ్రేటెడ్ పబ్లిక్ ల్యాబ్, ఐపి హెచ్ ల్యాబ్‌లను, అన్ని వార్డులను క్షుణ్ణంగా పరిశీలించి రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ప్రసూతి వార్డులో నవజాత శిశువుల తల్లులను పలకరించి వైద్యసేవలు బాగా ఉన్నాయా, డెలివరీలు, ఆపరేషన్స్ బాగా చేస్తున్నారా, మీకేమైనా ఇబ్బందులు ఉన్నాయా అని ప్రశ్నించారు. వైద్య సహాయం బాగుందని వారు కలెక్టర్‌కు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆసుపత్రిపై వివిధమైన ఫిర్యాదులొచ్చినా చర్యలుంటాయని హెచ్చరించారు. అంకితభావంతో వైద్యం అందించినప్పుడు అందరూ చేరువవుతారని, ఈ స్థానం నుండి మీరు వేరే స్థానానికి వెళ్లినా చిరస్థాయిగా గుర్తుండిపోతారని అన్నారు. పేద, మధ్యతరగతి ప్రజలు ప్రభుత్వాసుపత్రిలోనే వైద్యం పొందుతారని, అటువంటి వారిని ఆప్యాయంగా పలకరిస్తూ వైద్య సహాయం అందిస్తే త్వరగా కోలుకుంటారన్నారు. ఆసుపత్రికి అవసరమైన చిన్న చిన్న పరికరాలను కొనుగోలు చేసి అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. హాస్పటల్ లోపల, బయట ఎల్లప్పుడు పరిశుభ్రంగా ఉండాలన్నారు. ఔషధ భాండాగారాన్ని తనిఖీ సందర్భంలో స్టాక్ రిజిస్టర్‌లను పరిశీలించారు. కాలపరిమితి ముగిసిన మందులను వేరే రిజిస్టర్లో నమోదు చేసి ఆ మందులను విడిగా భద్రపరచాలన్నారు. కార్యక్రమంలో ఏరియా హాస్పిటల్ సూపరింటెండెంట్ పి.సూర్యనారాయణ, ఆర్ఎంఒ తాతారావు, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద పురుగుమందు డబ్బాలతో ఆందోళన



మొగల్తూరు-నరసాపురం రహదారిపై రాస్తారోకో

మా ప్రాంతంలో డంపింగ్ యార్డు పెట్టొద్దు

మండావారిపేట గ్రామస్తుల ఆందోళన

ఆర్‌డిఒతో చర్చలు విఫలం - జాతీయ రహదారిపై రాస్తారోకో

పోలీసుల జోక్యంతో తాత్కాలికంగా ఆందోళన విరమణ

ప్రజాశక్తి - నరసాపురం

మండలంలోని రుస్తుంబాద పంచాయతీ మండావారిపేటలో డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేయవద్దని ఆ గ్రామస్తులు శనివారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద పురుగుమందు డబ్బాలతో ఆందోళన చేపట్టారు. దీంతో ఆర్‌డిఒ అచ్యుత్ అంబరీష్ గ్రామస్తులతో మాట్లాడి వారిని శాంతింపజేసే ప్రయత్నం చేశారు. గ్రామానికి అతి సమీపంలో డంపింగ్ యార్డు ఉండటంతో తామంతా రోగాల బారిన పడతామని, పచ్చని వాతావరణం కలుషితమవుతుందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. పట్టణంలోని చెత్తను తీసుకువచ్చి తమ ప్రాంతంలో నిల్వ చేయడం వల్ల స్థానికంగా ఉన్న 500 కుటుంబాలపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. దీనిపై ఆర్‌డిఒతో గ్రామస్తుల చర్చలు విఫలం కావడంతో వారంతా మండుటెండలో 216 జాతీయ రహదారిపైకి చేరి నరసాపురం-మొగల్తూరు మార్గంలో రాస్తారోకో చేపట్టారు. ఎంఎల్ఎ వచ్చి తమకు న్యాయం చేయాలని నినాదాలు చేశారు. దీంతో పెద్దఎత్తున ట్రాఫిక్ నిలిచిపోయింది. ఈ విషయం తెలుసుకున్న నరసాపురం పట్టణ సిఐ బి.యాదగిరి, రూరల్ సిఐ జి.దుర్గాప్రసాద్, ఎస్ఐలు వెంకట సురేష్, ముత్యాలరావు చేరుకుని ఆందోళనకారులతో మాట్లాడారు. దీంతో గ్రామస్తులు తాత్కాలికంగా ఆందోళన విరమించారు. కార్యక్రమంలో కాసా చిన సత్యనారాయణ, కాసా త్రిమూర్తులు, మండ వెంకటేశ్వర్లు, బాబి, యర్రంశెట్టి సీతామహాలక్ష్మి, మండా భాను, గొన్నాబత్తుల దుర్గ పాల్గొన్నారు.

వ్యవసాయంలో డ్రోన్లకు ప్రాధాన్యత

పురుగుల మందు పిచికారీని పరిశీలించిన కలెక్టర్ నాగరాణి



పరిశీలిస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి - ఉండి

వ్యవసాయ రంగంలో డ్రోన్లకు అధిక ప్రాధాన్యతను ఇవ్వడం ద్వారా డ్రోన్ వినియోగంతో లాభసాటి వ్యవసాయం చేయవచ్చని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. శనివారం మండలంలోని యండగండిలో రైతుల పొలంలో డ్రోన్ ద్వారా పురుగుమందు పిచికారి కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. అనంతరం రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ రైతులకు వ్యవసాయ ఖర్చులు తగ్గించడానికి డ్రోన్ల ద్వారా స్ప్రే చేసే విధానాన్ని అవగాహన కల్పించాలనేది ప్రభుత్వం సంకల్పమని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం జిల్లాలో ఆరు సెల్ఫ్ వెల్ఫేర్ గ్రూపులను ఎంపిక చేసి కోరమండల్, మహేంద్ర కంపెనీల ద్వారా సుమారు రూ.60 లక్షలు విలువైన ఆరు డ్రోన్లను ఆరు గ్రూపులకు ఉచితంగా ఇవ్వటం జరిగిందన్నారు. ఆచార్య ఎన్‌జి రంగా అగ్రికల్చర్ యూనివర్సిటీ ద్వారా ఆరుగురు సభ్యులకు పైలెట్, కోపైలెట్ శిక్షణను గుంటూరు లాం ఫామ్‌లో ఇచ్చారన్నారు. రైతులకు వ్యవసాయ ఖర్చులు తగ్గించడానికి డ్రోన్ ద్వారా స్ప్రే అని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖాధికారి జెడ్.వెంకటేశ్వర్లు, డిఆర్‌డిఎ ప్రాజెక్ట్ అధికారి ఎంఎస్-ఎస్.వేణుగోపాల్, కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ ఎన్.మల్లికార్జునరావు, వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు కె.శ్రీనివాస్, వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

భీమవరంలో 'మన్యం ధీరుడు' ప్రీ రిలీజ్



ఈవెంట్‌లో మాట్లాడుతున్న ఎంఎల్ఎ అంజిబాబు

భీమవరం టౌన్ : తెలుగు వారు గర్వించదగ్గ వ్యక్తి అల్లూరి సీతారామరాజు, అటువంటి మహనీయుల చరిత్రతో సినిమా చేయడం గొప్ప విశేషమని ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) అన్నారు. హీరో, నిర్మాత ఆర్‌వివి.సత్యనారాయణ, నరేష్ డెక్కల దర్శకత్వం వహించిన 'మన్యం దీరుడు' చిత్రం ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను భీమవరం హౌసింగ్ బోర్డు కాలనీ కళ్యాణ మండపంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ అంజిబాబు మాట్లాడుతూ మహనీయుల చరిత్ర తెలుసుకుని సినిమా చేయడం అంటే ఎంతో కష్టతరమని, ఆనాటి మహనీయుల చరిత్ర ఘట్టాలను సినిమా రూపంలో చిత్రీకరించడం అభినందనీయమని అన్నారు. విప్లవకారుల యదార్థ కథ మన్యం దీరుడు చిత్రమని, ఈ చిత్రం గొప్ప విజయం సాధించాలని కోరుకుంటున్నామని తెలిపారు. గతంలో సుపర్ స్టార్ కృష్ణ అల్లూరి సీతారామరాజు చిత్రాన్ని తీసి ఎంతో విజయం సాధించారని, ఈ మన్యం దీరుడు చిత్రం కూడా అంతే విజయం సాధిస్తుందని ఎంఎల్ఎ అంజిబాబు అన్నారు. హీరో, నిర్మాత ఆర్‌వివి.సత్యనారాయణ మాట్లాడుతూ ఈ చిత్రాన్ని ఈనెల 20న విడుదల చేస్తున్నామని, ఒక సాంగ్‌ను హిమాలయాల్లో చిత్రీకరించామని, ఎటువంటి డూప్స్ లేకుండా సీన్స్ చిత్రీకరించామని, అల్లూరి సీతారామరాజు అంటే ఒక శక్తి అని, అటువంటి వ్యక్తి క్యారెక్టర్ చేయడం ఎంతో గర్వంగా ఉందన్నారు. టిడిపి రాష్ట్ర నాయకులు కోళ్ల నాగేశ్వరరావు, కంతేటి వెంకటరాజు, పొత్తూరి బాపిరాజు, వేండ్ర వెంకటస్వామి, బండి శక్తీశ్వర సాంబమూర్తి పాల్గొన్నారు.

విలాపం..!

గోదారి గలగలలు

ఇటీవల చోటు చేసుకున్న వరుస ఘటనలు జిల్లావాసులను తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేశాయి. గోదావరి, కొల్లేరు వరదలు ఆ ప్రాంత ప్రజలను తీవ్ర భయాందోళనకు గురి చేయడంతోపాటు తీవ్ర పంట నష్టాన్ని మిగిల్చాయి. జిల్లాకు చెందిన ప్రజా ఉద్యమాల సారధి, ప్రియతమ నేత ఆర్ఎస్ తుదిశ్వాస విడవడం అందరినీ కలిచివేసింది.

ఎప్పటిలానే గోదావరి వరద మరోసారి ఏలూరు జిల్లాలోని విలీన మండలాలతోపాటు పశ్చిమలోని లంకగ్రామాల ప్రజలను బెంబేలెత్తించింది. శరవేగంగా వరద ఉధృతి పెరగడం ఎటువంటి విపత్తుకు దారి తీస్తుందోనని అంతా ఆందోళన చెందారు. కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లోని నిర్వాసిత ప్రజలు వరద ముంపు నుంచి తమను ఎప్పుడు విముక్తుల్ని చేస్తారా అని ఆశగా ఎదురుచూస్తున్నారు. పరిహారం, పునరావాసం ఇచ్చేస్తే తాము వెళ్లేందుకు సిద్ధమేనని చెబుతున్నా నాటి వైసిపి ప్రభుత్వం, ప్రస్తుత టిడిపి ప్రభుత్వం పట్టించుకుంటున్న దాఖలాల్లేవని, అందరి దృష్టి ప్రాజెక్టు పనులపైనే ఉంటుందని వాపోతున్నారు. కొల్లేరు వరదను పరిశీలించడానికి వచ్చిన సిఎం చంద్రబాబు సైతం బుడమేరు వరద తదితర అంశాలపై మాట్లాడారుగాని తమ ఊసే ఎత్తకపోవడం బాధగా ఉందని చెబుతున్నారు. తమను పరామర్శించేందుకు, తమ కష్టాల పరిశీలనకు రాకపోయినా పర్లేదుగాని తమకు వీలైనంత త్వరగా పరిహారం, పునరావాసం కల్పించాలని, తమ సమస్యకు అదే పరిష్కారమని రెండు మండలాల నిర్వాసిత ప్రజలు ఘంటాపథంగా చెబుతున్నారు.

ఇక కొల్లేరు వరద మరోసారి బెంబేలెత్తించింది. కొల్లేరు పరిధిలోని మండవల్లి, కైకలూరు, ఏలూరు రూరల్, పెదపాడు మండలాల్లో గ్రామాలను, చేపల చెరువులను వరద ముంచెత్తింది. పైగా ఏలూరు-కైకలూరు రహదారితోపాటు పలు ప్రధాన రహదారులు నీట మునగడంతో రాకపోకలు నిలిచిపోయే పరిస్థితి ఏర్పడింది. అయితే వరద ప్రభావం కన్పిస్తున్న తరుణంలోనే అప్రమత్తమైన కలెక్టర్, ఎస్‌పి నేరుగా క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజలను అప్రమత్తం చేయడంతోపాటు కొల్లేరు వరద ప్రవాహానికి ఆటంకంగా ఉప్పుటేరు బ్రిడ్జి వద్ద ఉన్న అడ్డంకులను తొలగించేలా చేయడంతోపాటు పలు చర్యలు చేపట్టడం కొంత వరద తీవ్రతను తగ్గించిందనే చెప్పొచ్చు. అయితే కొల్లేరు సమస్యకు శాశ్వత పరిష్కారంపై ప్రభుత్వాలు దృష్టి సారించడం లేదనేది అందరికీ తెలిసిందే. 2006లో కొల్లేరు ఆపరేషన్ సమయం నుంచి సిపిఎం ప్రధానంగా కొల్లేరు ఛానల్స్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తోంది. దీంతోపాటు రెగ్యులేటర్ల నిర్మాణం డిమాండ్ ఎప్పటి నుంచో ఉంది. కొల్లేరులో తవ్విన భారీ చెరువుల వల్ల నీటిని బయటికి తీసుకెళ్లే ఛానల్స్ అన్నీ పూడిపోయి ముంపు సమస్య పెరుగుతోంది. ప్రస్తుతం దీనికితోడు ఉప్పుటేరులో పూడికతీత చాలాకాలంగా ప్రతిపాదనలు, మాటలకు, తూతూమంత్రపు చర్యలకే పరిమితమవుతోంది. దీంతో ముంపు సమస్య వచ్చినప్పుడల్లా హామీల వర్షం.. ఆపై గాలికొదిలేయడం పాలకులకు పరిపాటిగా మారిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇలానే కొనసాగితే కొల్లేరువాసులకు ముంపు సమస్యతోపాటు భూములు చౌడుబారిపోయే ప్రమాదం ఉందని జనం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మానవ సంబంధాలు @ మార్క్సిస్టులు

పెట్టుబడిదారీ ప్రపంచంలో మనుషుల మధ్య ఉండేవన్నీ ఆర్థిక సంబంధాలేనని మహనీయుడు మార్క్స్ ఏనాడో చెప్పిన విషయాన్ని మనం నేడు ప్రత్యక్షంగా చూస్తున్నాం. అయితే సమసమాజం, దాని కోసం అలుపెరగకుండా పని చేసే మార్క్సిస్టు నేతలు మాత్రం మానవ సంబంధాలకే ప్రాధాన్యతిస్తారనేది అందరికీ తెలిసిందే. అటువంటి మానవ సంబంధాలకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ ప్రజా పోరాటాల సారధిగా పేరొందిన మాజీ ఎంఎల్ఎ, సిపిఎం జిల్లా ఉద్యమ నిర్మాతల్లో ఒకరైన రుద్రరాజు సత్యనారాయణరాజు (ఆర్ఎస్) వయోభారంతో మృతి చెందడం ఉమ్మడి జిల్లావాసులను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. అప్పటికే పాలకొల్లు పరిసర ప్రాంతాల్లో ఉపాధ్యాయ, రైతు ఉద్యమ నేతగా పేరొందిన వలవల శ్రీరామ్మూర్తి తుదిశ్వాస విడవడం, ఆర్ఎస్ మరణించిన నాలుగు రోజులకే నరసాపురంలో కార్మిక నేతగా పేరొందిన పొన్నాడ రాము (బాబాయ్) ఆకస్మిక మృతి సిపిఎం శ్రేణులను కలిచివేసింది. ఆ విషాదాల నుంచి తేరుకోకముందే జిల్లావాసులకు సుపరిచితులు, ఆత్మీయ నేతగా పేరొందిన సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి కన్నుమూత కమ్యూనిస్టు పార్టీ శ్రేణులతోపాటు అభ్యుదయవాదులు, వివిధ పార్టీల నేతలను నివ్వెరపర్చింది. సీతారాం ఏచూరి మృతికి నివాళులర్పిస్తూ పెద్దఎత్తున సంతాప సభలు జరిగాయి.. జరుగుతున్నాయి. ఆ సభల్లో టిడిపి, జనసేన, వైసిపి నేతలతోపాటు వివిధ సంఘాల నేతలు పాల్గొని శ్రద్ధాంజలి ఘటించడం సీతారాం ఏచూరికి ఉన్న ప్రజాభిమానానికి నిదర్శనం. ఆర్ఎస్ మృతి సందర్భంగానూ పలు పార్టీల నేతలు, మాజీ ఎంఎల్ఎలు, ప్రముఖులు ఆయన భౌతికకాయాన్ని సందర్శించడంతోపాటు వివిధ సందర్భాల్లో ఆయన వ్యవహరించిన తీరు, ఆత్మీయ పలుకరింపు, కుటుంబాలతో సంబంధాలు గురించి ప్రధానంగా మాట్లాడారంటే మార్క్సిస్టు నేతలు ప్రజాసంబంధాలకు ఎంత ప్రాధాన్యతిస్తారో అర్థం చేసుకోవచ్చు. అందుకే ప్రజల సమస్యలు పరిష్కారం కావాలంటే ప్రతిపక్షం ఉన్నా లేకపోయినా కమ్యూనిస్టులు మాత్రం ఉండాలని పలువురు కోరుకోవడం వెనుక ఉన్న రహస్యం ఇదే. ఏదేమైనా ఉద్యమాలు, పోరాటాలే కాదు విలువలతో కూడిన మానవ సంబంధాలు నెరపడంలో మార్క్సిస్టులే ముందుంటారనడంలో ఎటువంటి సందేహమూ లేదు.

-విఎస్ఎస్‌వి.ప్రసాద్

పోరాట యోధుడు సీతారాం ఏచూరి

సంస్మరణ సభలో సిపిఎం నాయకులు



ఆకివీడు : మాట్లాడుతున్న జెఎన్‌వి గోపాలన్



తాడేపల్లిగూడెం : నివాళులర్పిస్తున్న నాయకులు



పెనుగొండ : నివాళులర్పిస్తున్న నాయకులు

ప్రజాశక్తి - ఆకివీడు

ఎర్ర సూర్యుడికి లాల్ సలాం అంటూ, ప్రజల మనిషికి కన్నీటి వీడ్కోలు అంటూ పలువురు నివాళి ఘటించారు. సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరికి సంస్మరణ సభ స్థానిక గాంధీ బొమ్మ సెంటర్లో శనివారం సాయంత్రం పార్టీ పట్టణ కార్యదర్శి తవిటి నాయుడు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సభలో వక్తలు సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జెఎన్‌వి గోపాలం, టిడిపి వాణిజ్య విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులు గుంట్ల గణపతి, జనసేన జిల్లా నాయకులు గవర అనిల్, వైసిపి నాయకులు వాడపల్లి జగన్, టిడిపి పట్టణ కార్యదర్శి గంధం ఉమా సత్యనారాయణ, వినియోగదారుల సంఘ రాష్ట్ర సహాధ్యక్షులు బొబ్బిలి బంగారయ్య, ఐద్వా నాయకులు డోకల లక్ష్మి, సందక ఉదయ కుమారి మాట్లాడారు. నేటి సమాజం ఒక గొప్ప పోరాట యోధున్ని కోల్పోయాం అంటూ పలువురు నివాళి ఘట్టించారు. కార్యక్రమంలో ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు గోపాలన్ ఆయన జీవిత విశేషాలు గురించి మాట్లాడుతూ 25 ఏళ్ల వయసులోనే ఇందిరాగాంధీ ఇంటి వద్దకు వెళ్లి ఇందిరాగాంధీ జవహర్‌లాల్ నెహ్రూ సెంట్రల్ యూనివర్సిటీ పదవిని వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారన్నారు. ఆ మరుసటి రోజు ఇందిరాగాంధీ వైస్ ఛాన్సలర్‌కు రాజీనామా చేశారన్నారు. ఏచూరి ఘనతలను, పలు అంశాలను ఆయన వివరించారు. సభలో షేక్ వల్లి డొకల గేయాలాపన చేశారు.

ఆచంట : వామపక్ష పోరాట యోధుడు, సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి, రాజ్యసభ మాజీ ఎంపీ కామ్రేడ్ సీతారాం ఏచూరి మరణం పట్ల ఆచంట నియోజకవర్గ ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శనివారం సీతారాం కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. జాతీయ స్థాయికి ఎదిగిన అతికొద్ది మంది తెలుగువారిలో సీతారాం ఏచూరి ప్రస్థానం ప్రత్యేకమైనదని పితాని సత్యనారాయణ అభిప్రాయపడ్డారు. నాలుగు దశాబ్ధాల ప్రజా జీవితంలో ఏచూరి చేసిన పోరాటాలు ఎప్పటికీ స్ఫూర్తిదాయకమని, ఆయన లేకపోవడం దేశ రాజకీయాలకు, పార్టీకి తీరని లోటని అన్నారు.

తాడేపల్లిగూడెం : సీతారాం ఏచూరి మృతి కమ్యూనిస్టు ఉద్యమానికి, దేశంలోని వామపక్ష ఉద్యమానికి తీరనిలోటని సిఐటియు జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు పేర్కొన్నారు. శనివారం స్థానిక అపరాల మార్కెట్ జట్టు వర్కర్స్ యూనియన్ జనరల్ బాడీ సమావేశం స్థానిక చుక్కా అప్పలస్వామి భవనంలో గొన్నాబత్తుల నాగేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సైద్ధాంతికవేత్త, కమ్యునిస్టు దిగ్గజం సీతారాం ఏచూరి సంతాప సభ నిర్వహించారు. ముందుగా సీతారాం ఏచూరి చిత్రపటానికి సిఐటియు జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు పూలమాలలు వేసి నివాళులర్పించి, నినదించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు మాట్లాడుతూ సీతారాం ఏచూరికి విద్యార్థి దశ నుంచి తాను నడుస్తున్న బాట మీద, నమ్మిన సిద్ధాంతం మీదా విశ్వాసమూ, స్పష్టత సంపూర్ణంగా ఉండేవని ఆయన అన్నారు. సిఐటియు పట్టణ కార్యదర్శి కరెడ్ల రామకృష్ణ, అయినాల సత్యనారాయణ, నర్మాల నారాయణరావు, చిట్టేటి సత్యనారాయణ, దాసరి రాజు, రావి శ్రీను పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం రూరల్ మండల కమిటీ ఆధ్వర్యంలో శనివారం ఇటుకుల గుంట గ్రామంలో సీతారాం ఏచూరి సంతాపసభ నిర్వహించారు. మండల నాయకులు కండెల్లి సోమరాజు, పార్టీ సభ్యులు పాల్వారి సత్యవతి, మల్లిపూడి సీతామహాలక్ష్మి, మాగంటి వెంకటరమణ, పాలకూరి వెంకట నాగమణి పాల్గొన్నారు.

అత్తిలి : అత్తిలి బస్టాండ్ సెంటర్‌లో సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కేతా గోపాలన్ మాట్లాడుతూ విద్యార్థి ఉద్యమం నుంచి సిపిఎం ప్రధాన కార్యదర్శి స్థాయి వరకు సీతారాం ఏచూరి పనిచేసి దేశంలో కార్మికవర్గ, రైతాంగం, వ్యవసాయ కార్మికుల ప్రయోజనాల కోసం తన యావత్ జీవితాన్ని అంకితం చేసిన గొప్ప విప్లవయోధుడని గోపాలన్ అన్నారు. సిపిఎం నాయకులు కె.ధర్మేంద్ర, బి.నాగరాజు, పొనుగు వినయ్, నక్క ధర్మయ్య, పి.వెంకటేశ్వరరావు, దాయం వెంకన్న, వేడంగి సముద్రయ్య, బంగారు గోపి, కవురు వెంకట నరసింహం, బి.రామకృష్ణ పాల్గొన్నారు.

ఆచంట : ప్రజాఉద్యమ నేత సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మృతి పార్టీకి తీరని లోటు అని సిపిఎం జిన్నూరు శాఖా కార్యదర్శి కొప్పర్తి నర్సింహామూర్తి అన్నారు. సిపిఎం ఆధ్వర్యంలో సీతారాం ఏచూరి చిత్రపటానికి సీనియర్ నాయకులు తాళబత్తుల గాంధీ, కొప్పర్తి నరసింహామూర్తి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి పిల్లి ప్రసాద్, సత్యనారాయణ పాల్గొన్నారు.

ఉండి: నిబద్ధత కలిగిన నాయకుడు సీతారాం ఏచూరి అని సిపిఎం మండల కార్యదర్శి ధనకొండ శ్రీనివాస్ అన్నారు. శనివారం సాయంత్రం ఉండి సిపిఎం కార్యాలయంలో, చెరుకువాడ శాఖ కార్యాలయంలో సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి చిత్రపటానికి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి వామపక్ష రాజకీయాలకు ఆకర్షితులైన సీతారాం ఏచూరి ఐఎఎస్‌కు వెళ్లకుండా సమ సమాజ స్థాపన కోసం ఎర్రజెండా లక్ష్యం వైపు అడుగులు వేశారని కొనియాడారు. నివాళులర్పించిన వారిలో చీరల శేషు, నిమ్మితి కిషోర్, కొట్టాడ వెంకటేశ్వరరావు, కింతాడ రమేష్, మజ్జి నాగేశ్వరరావు, మోపిదేవి రాము పాల్గొన్నారు.

మొగల్తూరు : ప్రజా సమస్యల పరిష్కారమే జయంగా చివర వరకు పోరాడిన ఉద్యమ నేత సీతారాం ఏచూరి అని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తెలగంశెట్టి సత్యనారాయణ అన్నారు. శనివారం సాయంత్రం మొగల్తూరులోని సిపిఎం కార్యాలయంలో ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. నాయకులు ఆదురి సాంబమూర్తి, యడ్ల చిట్టిబాబు, కొత్తపల్లి నాగరాజు, వీర పాండురంగారావు, బజాజ్ జట్టు కార్మికులు, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

పెనుగొండ : దేశ లౌకిక వ్యవస్థను అణగదొక్కే ప్రతి అంశంలోనూ ప్రజల కోసం తిరుగులేని పోరాటం చేసిన మహాయోధుడు కామ్రేడ్ సీతారాం ఏచూరి అని సిపిఎం సిద్ధాంతం గ్రామ శాఖా కార్యదర్శి కప్పల రత్నరాజు అన్నారు. శనివారం రావిచెట్టు సెంటర్లో ఆయన మాట్లాడారు. సిపిఎం నాయకులు కె.పుల్లారావు, పులిదిండి రామారావు, పెచ్చెట్టి పెద్దిరాజు, జట్టు కార్మికులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంపై అవగాహన

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

మండలంలోని గవరపేట గ్రామంలోని ఎంపియుపి పాఠశాలలో గ్రామ సర్పంచి పోలిమేర వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో పోషకాహార మాసోత్సవాలు నిర్వహించారు. ఐసిడిఎస్ సూపర్‌వైజర్ ఎన్ .మంగ పోషకాహారంపై అవగాహన కల్పించారు. పోషకాహారం కిశోర బాలికలకు ఏ విధంగా ఉపయోగపడుతుంది, పోషకాహారం లోపం వస్తే రాగి పిండి, చిక్కీలు, ఆకుకూరలు, కాయగూరలు తీసుకోవడం వల్ల వాటి నుంచి పోషకాలు విడుదల అవుతాయని, రక్త శాతం కూడా అభివృద్ధి అవుతుందని వివరించారు. అలాగే విద్యార్థినులకు గుడ్ టచ్, బాడ్ టచ్‌పై అవగాహన కలిగించారు. బాల్యవివాహాల వల్ల కలిగే నష్టాలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి పోలిమేర వెంకటేశ్వరరావు, హెచ్‌ఎం బి.మంజుల, ఆరోగ్య విస్తరణాధికారి గుడాల హరిబాబు, ఎఎన్‌ఎం కనకదుర్గ పాల్గొన్నారు.

కౌలు రైతులకు నష్టపరిహారం చెల్లించాలి

జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు

భీమవరం : కౌలురైతులు పేరుతో పంటనమోదు చేసి నష్టపరిహారం చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ కౌలురైతుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో ఏదిదాటిన కురిసిన అధిక వర్షాలకు పంటలు దెబ్బతిన్న మండలాల్లోని కౌలురైతులకు పంటనష్ట పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో 16 మండలాల్లో 8 వేల ఎకరాల్లో పంటనష్టం జరిగిందన్నారు. జిల్లావ్యాప్తంగా 6,500 మంది వరకు పంట కోల్పోయారని తెలిపారు. ముఖ్యంగా కాళ్ల, ఆకివీడు, ఉండి, భీమవరం, నరసాపురం, యలమంచిలి, పాలకొల్లు, పోడూరు, ఆచంట మండలాల్లో వరిపంట దెబ్బతిన్నదని తెలిపారు. పలువురు నారుమళ్లు, నాట్లు వేసి ఎకరాకు దాదాపు రూ.25 వేల వరకు నష్టపోయారని ఆవేదన వ్యక్తంచేశారు. జిల్లా కలెక్టర్, ఉన్నతాధికారులు తగుచర్యలు తీసుకుని, గ్రామస్థాయిలో పరిశీలించి వాస్తవ కౌలురైతులకు పంటనష్టం, పంటబీమా అందించి, వడ్డీ లేని పంటరుణాలు అందివ్వాలని కోరారు.

పేదల ఆకలి తీర్చడానికి కృషి చేయాలి

గణపవరం : విద్యార్థులు విద్యతో పాటు పేదవారి ఆకలి తీర్చడానికి కృషి చేయాలని డిగ్రీ కాలేజీ ప్రిన్సిపల్ పి.నిర్మలకుమారి అన్నారు. శనివారం కాలేజీలో 'హ్యాండ్ ఫుల్ ఆఫ్ రైస్' అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్మలకుమారి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి కాలేజీకి వచ్చేటప్పుడు గుప్పెడు బియ్యం తీసుకుని రావాలని కోరారు. ప్రతి శుక్రవారం పోగు చేసిన బియ్యాన్ని పేద వారికి అందజేయడం జరుగుతుందని చెప్పారు. మీరు ఇచ్చిన బియ్యంతో పేదవారి ఆకలిని తీర్చినవారవుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ వై.మధురాజు, చైతన్య, టి.అక్కిరాజు, రాణీదుర్గా, మణికంఠ, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తనిఖీ

ఆకివీడు : సాధారణంగా అధికారులు క్రింది వారికి సూచనలు, సలహాలు ఇవ్వటం, వారి తప్పులు సరిచేయడం, అవసరమైతే నోటీసులు ఇవ్వడం జరుగుతూ ఉంటుంది. విద్యార్థులకు చదువులో సూచనలు ఇస్తుంటారు. అయితే స్థానిక దుంపగడప ఎకెపిఎస్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థికి తన జేబు డబ్బులు నగదు పారితోషికంగా జిల్లా అధికారి అందజేయడం అందరికీ ఆనందం కలిగించింది. ప్రభుత్వ జూనియర్ కళాశాలల జిల్లా విద్యాశాఖ అధికారి ఎ.నాగేశ్వరరావు శనివారం దుంపగడప ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ తనిఖీ పూర్తయిన అనంతరం విద్యార్థులతో మాట్లాడి ఉత్తమ విద్యార్థి ఎ.లక్ష్మణ్‌కు ఆయన సొంత డబ్బు రూపాయలు నగదు పారితోషికంగా అందజేశారు. దీంతో విద్యార్థులకు కొత్త ప్రోత్సాహం ఇచ్చినట్లు అయింది.

లోక్ అదాలత్‌లో కేసుల రాజీ

తణుకు : రాజీయే రాజ మార్గమని లోక్ అదాలత్‌లో కేసుల రాజీ చేసుకొనుట వల్ల కక్షిదారులు తమ విలువైన సమయం, డబ్బు ఆదా అవుతుందని చైర్మన్, నాల్గవ అదనపు జిల్లా జడ్జి డి.సత్యవతి అన్నారు. శనివారం తణుకు కోర్టు ఆవరణలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. జాతీయ లోక్ అదాలత్‌లో మొత్తం 123 కేసులు రాజీ చేశారు. సివిల్ కేసులు 25, క్రిమినల్ కేసులు 60, చెక్‌బౌన్స్ కేసులు 5, ఎంసి కేసులు 4, టెలిఫోన్ బకాయి కేసులు 26, బ్యాంక్ బకాయి కేసులు 3 రాజీ చేశారు. సివిల్ కేసుల్లో రూ.56,45 వేలు ఇరు పార్టీలు ఇచ్చిపుచ్చుకునేలా రాజీ చేశారు. చెక్కుబౌన్స్ కేసుల్లో రూ. 8.62 వేలు ఇచ్చి పుచ్చుకునేలా రాజీ చేశారు. ఈ జాతీయ లోక్ అదాలత్‌లో సీనియర్ సివిల్ జడ్జి కృష్ణసత్యలత, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి పి.సాయిరాం, మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి పివిఎస్ రంజితకుమార్, స్పెషల్ కోర్టు మెజిస్ట్రేట్ చిరంజీవి పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం: జాతీయ లోక్ అదాలత్‌లో 3 బెంచ్‌లుగా నిర్వహించినట్లు 11వ అదనపు జిల్లా జడ్జి షేక్ సికిందర్ బాషా తెలిపారు. ఈ లోక్ అదాలత్‌లో సివిల్ కేసులు 32, క్రిమినల్ కేసులు 62, మోటారు వాహనం ప్రమాద బీమా కేసులు 4, ప్రీ లిటిగేషన్ కేసులు 22, బెంచ్ కోర్టు కేసులు 143 కేసులను సంబంధించిన రూ.2,83,60 వేలు రాజీ కుదుర్చినట్లు తెలిపారు. ఈ లోక్‌అదాలత్ కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కె.సూర్య కిరణ్‌శ్రీ, రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఇ.అన్నపూర్ణ, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

నరసాపురం: లోక్ అదాలత్‌లో సివిల్ కేసులు 28, ఎంవి ఒపి కేసులు 4, కుటుంబ తగాదాలు 3, నరసాపురం టౌన్, రూరల్, మొగల్తూరు, యలమంచిలి పోలీస్ స్టేషన్లకు సంబంధించిన క్రిమినల్ కేసులు 80, ఎక్సైజ్ కేసులు 10, బిఎస్ఎన్ఎల్ 3 కేసులు, బరోడా బ్యాంక్ కేసులు ఆరు మొత్తం 134 కేసులను ఉభయ పార్టీల కోరిక మేరకు రాజీచేసినట్లు 10వ అదనపు జిల్లా న్యాయమూర్తి విజయ దుర్గ తెలిపారు. బెంచ్ అధికారులుగా న్యాయమూర్తులు సివిల్ జడ్జి(సీనియర్ డివిజన్) జి.గంగ రాజు, ప్రిన్సిపల్ సివిల్ జడ్జి(జూనియర్ డివిజన్) ఆర్.వరలక్ష్మి, 1వ అదనపు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) కె.గీరిశ్, సభ్యులుగా కె.దుర్గా భవాని, వి.నాగేశ్వర రావు, ఎ.జాన్ కేనడి, డి.సుభాష్ బాబు వ్యవహరించారు. సీనియర్ న్యాయవాది కె.స్వామి నాయుడు కక్షిదారులకు వెజ్ బిర్యానీ పంపిణీ చేశారు.

దేవమణి ఆకస్మిక మృతి

ఉండి: మండలంలోని కలిసిపూడికి చెందిన విశ్రాంత హెచ్ఎస్.కారాల దేవమణి శనివారం ఆకస్మికంగా మృతిచెందారు. ఆమె స్వగ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు. ఆమె మృతదేహానికి ఉండి మానవత శాఖ కార్యదర్శి డాక్టర్ గాదిరాజు రంగరాజు, కో చైర్మన్ దంగేటి రామలింగేశ్వరరావు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి ఓదార్చారు. ప్రగడ సాంబశివరావు, సంతాపం వారు తెలియజేశారు. ఆమె నియోజకవర్గంలో కలిసిపూడి, పాందువ్వ, ఉండి, అర్థమూరు తదితర ప్రాంతాలలో ఎంఎస్ఏ, హెచ్ఎమ్‌గా పనిచేశారు. ఆమె భర్త ప్రేమ్ ప్రధానోపాధ్యాయులుగా ఉండిలో పనిచేశారు. వీరికి ఇద్దరు మగ పిల్లలు, ఇద్దరు ఆడపిల్లలు, మగ పిల్లలు ఇద్దరు ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు.

పశువుల మేత పంపిణీ

ఆకివీడు : వరద ప్రభావం కొల్లేటి తీర గ్రామాలలోని మనుషులతో పాటు పశువులకు కూడా మేత కొరత ఏర్పడింది. ఈ కొరత తీర్చేందుకుగాను ప్రభుత్వం శనివారం కొల్లేటి గ్రామమైన కోళ్లంగ గుడిలో పశువుల యజమానులకు మేత అందజేశారు. పశువుకి 25 కేజీలు చొప్పున గ్రామ మొత్తం 78 పశువులకు ఈ మేత అందజేశారు. కూగా మరో కొల్లేటి గ్రామమైన చిన్నమిల్లిపాడులో 70 పశువులకు మేత అందిస్తున్నట్లు పశు వైద్యులు కిషోర్, మండల పశువైద్య శాఖ అధికారి డాక్టర్ డి.ఖాదరా తెలిపారు. స్థానిక కొల్లేటి నాయకులు పూజారి ప్రసాద్ మాట్లాడుతూ టిడిపి మండల అధ్యక్షులు మోటేపల్లి ప్రసాద్, ఎంఎల్ఎ రఘురామకృష్ణరాజు సహకారంతో ఈ మేత అందించే కార్యక్రమం చేపట్టామని తెలిపారు.

సంపద పునఃపంపిణీతోనే సంక్షేమ రాజ్యం

తణుకు: సంపద పునఃపంపిణీతోనే సంక్షేమ రాజ్యం సాధ్యపడుతుందని, దీని కోసం ప్రగతి శీల శక్తులు, దళిత, బహుజన, మైనారిటీ తరగతుల విశాల వేదిక రూపొందించాలని దీపం సంపాదకులు డివివిఎస్.వర్మ అన్నారు. శనివారం స్థానిక సూర్యా భవనంలో తణుకు స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో చర్చాగోష్ఠి సమన్వయకర్త డివిఎస్ వర్మ అధ్యక్షతన చర్చాగోష్ఠి నిర్వహించారు. తొలుత డాక్టర్ రమేష్‌చంద్రబాబు ఆధ్వర్యంలో జీవీఎల ఫౌండేషన్ సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, జిల్లాలో సీనియర్ కమ్యూనిస్టు నాయకులు ఆర్ఎస్‌ఆర్ నివాళులు అర్పించి, సంతాప సూచికంగా మౌనం పాటించారు. ఈ సందర్భంగా చర్చాగోష్ఠిలో సిపిఐ, సిపిఎం, కాంగ్రెస్, సామాజిక న్యాయపోరాట సమితితో పాటు ఆహ్వానితులుగా ఏలూరు చైతన్య వేదిక, తాడేపల్లిగూడెం ట్రేడ్ యూనియన్ల ప్రతినిధులు, ఒంగోలు సైంటిఫిక్ సోషలిస్ట్ స్టడీ సర్కిల్ కన్వీనర్ ఎం.వెంకయ్య చర్చలో పాల్గొని మాట్లాడుతూ అసమాన భారతంపై చర్చ జరిగిన చర్చలో ఆక్స్‌ఫామ్ నివేదిక ప్రకారం దేశంలో 1 శాతం దగ్గర 46 శాతం దేశ సంపద పోగుపడగా 10 శాతంగా ఉన్న బిలియనీర్లు, కార్పొరేట్లు, కుబేరుల దగ్గర మొత్తం దేశ సంపదలో 77 శాతం సంపద పోగుపడ్డ తీరును ప్రతినిధులు ప్రస్తావించారు. ఈ చర్చాగోష్ఠిలో సిపిఐ నాయకులు కోనాల భీమారావు, బొద్దాని నాగరాజు, టి.అప్పలస్వామి, సిపిఎం నాయకులు పివి.ప్రతాప్ పాల్గొన్నారు.

వరద బాధితుల సహాయార్థం విరాళాలు అందజేత



భీమవరం టౌన్ : సహాయం అందజేస్తున్న నాయకులు

అల్లూరి సీతారామరాజు, భగత్‌సింగ్ సేవా విజ్ఞాన కేంద్రం ట్రస్టు ఆధ్వర్యాన..

ప్రజాశక్తి - భీమవరం టౌన్

అల్లూరి సీతారామరాజు, భగత్‌సింగ్ సేవా విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో విజయవాడ వరద బాధితులకు సహాయార్థం దుస్తులు, దుప్పట్లు, బ్రెడ్స్, వాటర్‌బాటిల్స్ మొదలగువాటిని దాతల సహకారంతో సేకరించి తీసుకువెల్తున్నట్లు ట్రస్టు చైర్మన్ బి.బలరాం తెలిపారు. సహకరించిన దాతలు శ్రీమీనా బిస్కెట్స్ వారు 5 వేల రొట్టెలు, హైదరాబద్ అభయం ఫౌండేషన్ వారు 110 దుప్పట్లు, కుముదవల్లి గ్రామానికి చెందిన భూపతిరాజు రామకృష్ణంరాజు కుమారుడు సురేష్‌వర్మ 250 దుప్పట్లను, పెన్నాడ గ్రామ సర్పంచి గొట్టుముక్కల సివాజి రాజు 1000 వాటర్‌బాటిల్స్, పిప్పర గ్రామానికి చెందిన దాతలు దుస్తులు సహాయంగా ఇచ్చారు. వారందరికీ కృతజ్ఞతలు, ధన్యవాదములు తెలిపారు. వీటిని వరద బాధితులకు అందించేందుకు తీసుకువెల్తున్నట్లు తెలిపారు. మరింత మంది దాతలు ముందుకు రావాలని అల్లూరి సీతారామరాజు భగత్‌సింగ్ సేవా విజ్ఞాన కేంద్రం ట్రస్టు చైర్మన్ బి.బలరాం కోరారు.

వరద బాధితులకు రూ.1.50 వేలు అందజేత

ఆచంట : విజయవాడ వరద బాధితుల సహాయార్థం 75 మంది దాతల నుంచి రూ.2 లక్షల విరాళాలు సేకరించినట్లు పోడూరు తహశీల్దార్ సయ్యద్ మౌలానా ఫాజిల్ తెలిపారు. రూ.50 వేలు ఇప్పటికే జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణికి అందజేసినట్లు ఆయన చెప్పారు. ఈ సందర్భంగా శనివారం రూ.1.50 వేల చెక్కును ఆచంట ఎంఎల్ఎ పితాని సత్యనారాయణకు పోడూరు మండలం కొమ్ముచిక్కాల క్యాంపు కార్యాలయంలో పితాని సత్యనారాయణకు అందజేశారు. ఈ సందర్భంగా పితాని మాట్లాడుతూ ఆపదలో ఉన్నవారికి ఆపన్న హస్తాన్ని అందించేందుకు మరింత మంది దాతలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. దాతల నుంచి విరాళాలు సేకరించిన వారికి పితాని సత్యనారాయణ అభినందించారు. విపత్తులు సంభవించినప్పుడు ప్రభుత్వ సాయంతో పాటు ప్రజలు, దాతలు సాయం చేసి ప్రజలను ఆదుకునే సంస్కృతి సాంప్రదాయాలు మనకు ఉన్నాయని గుర్తు చేశారు. విరాళాలు ఇచ్చే దాతలు పశ్చిమగోదావరి జిల్లాలో అధికంగా ఉన్నారని చెప్పడానికి అతిశయోక్తి కాదని అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్ల ఆర్థిక సాయం..

పాలకోడేరు : వరద బాధితుల సహాయార్థం మండలంలోని రేషన్ డీలర్లు అంతా కలిసి రూ.10 వేల ఆర్థిక సాయం చేశారు. పాలకోడేరు రెవెన్యూ కార్యాలయంలో తహశీల్దార్ భారతీ విజయలక్ష్మికి సాయాన్ని మండల డీలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు దొంగ కృష్ణ అందజేశారు. ఈ సందర్భంగా తహశీల్దార్ విజయలక్ష్మి మాట్లాడుతూ ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడం, ఆదుకోవాలనే ఆలోచన రావడం అభినందనీయమన్నారు. రేషన్ డీలర్ లాగా ప్రతి ఒక్కరూ ముందుకొచ్చి విజయవాడ వరద బాధితులకు సాయం, సహకారాలు అందించాలని కోరారు.


కాళ్ల : నిత్యావసర సరుకుల్ని పంపిణీ చేస్తున్న గ్రామస్తులు

వరద బాధితులకు చేయూత

కాళ్ల : విజయవాడలోని వరద బాధితులకు ప్రాతళ్లమెరక గ్రామస్తులు చేయూత నందించేందుకు ముందుకువచ్చారు. ప్రాతళ్లమెరక గ్రామంలోని చినపేటలో సిబిసిఎన్‌సి భాపిస్ట్ సంఘం, యూత్, గ్రామస్తుల నుంచి రూ.లక్ష విరాళాలు సేకరించారు. శనివారం రెండు ట్రక్కుల్లో నిత్యావసర సరుకులు తీసుకెళ్లారు. విజయవాడలోని బొంబాయి కాలనీ, రాజరాజేశ్వరి కాలనీ ప్రాంత వాసులకు ప్రాతళ్లమెరక గ్రామంలోని చినపేటలో సిబిసిఎన్‌సి భాపిస్ట్ సంఘం ఆధ్వర్యంలో ఒక్కొకరికి రూ.లక్ష విలువైన 5 కేజీల రైస్, పప్పు 1/2 కేజి, ఉల్లిపాయలు కేజీ, బంగాళదుంపలు 1/2 కేజీ, పచ్చిమిర్చి పావు కేజీ, మిల్క్ 2 ప్యాకెట్లు, షుగర్ 1/2 కేజీ, బన్, బిస్కట్, ఆయిల్, తర్మారిక్ పవర్, మిర్చిపౌడర్, వాటర్ బాటిల్స్, సాల్ట్, టమాటోస్, బ్రింజల్స్, పికిల్ ప్యాకెట్, మస్కిటో కాయిల్స్, మ్యాచ్ బాక్స్, క్లాత్స్, సోప్‌లను సుమారు రూ.లక్ష విలువగల నిత్యావసర సరుకుల్ని బాధితులకు అందజేశారు.

ఘనంగా హిందీ భాషా దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి - గణపవరం

గణపవరం డిగ్రీ కాలేజీలో శనివారం హిందీ దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ప్రిన్సిపల్ పి.నిర్మలాకుమారి మాట్లాడుతూ హిందీ భాష మన జాతీయ భాషని అన్నారు. విద్యార్థులందరు ఆన్‌లైన్ ద్వారా, యూట్యూబ్ లెషన్స్ ద్వారా హిందిని నేర్చుకోవాలని తెలిపారు. అనంతరం విద్యార్థులతో నిర్వహించిన సాంస్కృతిక పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ వై.మధురాజు, లెక్చరర్లు సిఎహెచ్ చైతన్య, టి.అక్కి రాజు, జి.వెంకట రమణ, కాలేజీ సిబ్బంది పాల్గొన్నారు.

పాలకొల్లు : స్థానిక బిఆర్ఎంవి పాఠశాలలో హిందీ దినోత్సవ వజ్రోత్సవాలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పాఠశాల ఇన్‌ఛార్జి హెచ్‌ఎం యు.పెద్దిరాజు అధ్యక్షత వహించారు. హిందీ భాష విశేషతను గూర్చి పాఠశాల హిందీ ఉపాధ్యాయిని వి.గీతానంద కుమారి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ భాష మనుషులను కలపడానికి వారిదిగా ఉపయోగపడుతుందన్నారు. మాతృభాష తెలుగుతోపాటు, మిత్రభాష అయిన ఆంగ్లం, జాతీయ భాష అయిన హిందీ కూడా నేర్చుకుని అందరూ ప్రావీణ్యులుగా తయారవ్వాలని అన్నారు. హిందీ భాషలో ప్రతిభ చూపిన విద్యార్థులకు యు.పెద్దిరాజు, వి.ఉదయ్‌కుమార్, జె. దుర్గారావు, ఆర్‌వి.సూర్యనారాయణ రాజులు బహుమతి ప్రధానం చేశారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు చేసి అందరినీ అలరించారు. పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

17న నులిపురుగుల నివారణా దినోత్సవం

పాలకొల్లు రూరల్ : ఎంపిడిఒ కార్యాలయం వద్ద ఎంపిడిఒ సంఘాని వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో జాతీయ నులిపురుగుల నివారణా కార్యక్రమ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ అడ్డాల ప్రతాప్ కుమార్ మాట్లాడుతూ ఈనెల 17వ తేదీన లంకలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని హైస్కూలు, ఎలిమెంటరీ స్కూలు, కళాశాలలో, అంగన్వాడీ సెంటర్లలో ఒకటి నుంచి 19 సంవత్సరాల లోపు వారందరికీ ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయడం జరుగుతుందని డాక్టర్ అడ్డాల ప్రతాప్ కుమార్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ ఆర్ఎన్‌విఎస్.శర్మ, ఇఒపిఆర్‌డి వైభవతి, ఎఒ గోవిందరాజులు నాయుడు, ఆరోగ్య విస్తరణాధికారులు గుడాల హరిబాబు, శ్రీనివాసరెడ్డి, అన్నా మణి, స్వర్ణలత, పంచాయతీ కార్యదర్శులు, ఎఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పిలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇఎన్‌టి శస్త్ర చికిత్సల్లో విప్లవాత్మక మార్పులు

ఎంఎల్ఎ అంజిబాబు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

ప్రపంచ వైద్యరంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా చెవి, ముక్కు, గొంతు శస్త్ర చికిత్సల్లో సైతం విప్లవాత్మకమైన మార్పులు వచ్చాయని ఆంధ్రప్రదేశ్ శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్ రాజు అన్నారు. స్థానిక రాధాకష్ణ కన్వెన్షన్ హాల్లో మూడు రోజులపాటు జరిగే రాష్ట్రస్థాయి చెవి, ముక్కు, గొంతు వైద్యుల 42వ వార్షిక సమావేశంలో మోషేన్ రాజు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కొత్త కొత్త వైద్య విధానాన్ని తీసుకురావడానికి ఇటువంటి సదస్సులు వైద్య రంగానికి ఎంతో ఉపకరిస్తాయని అన్నారు. మానవ శరీరంలో గుండె మాత్రమే ప్రధానమైంది అనుకుంటారు కాని చెవి, ముక్కు, గొంతు కూడా ఎంతో ముఖ్యమని, ఈ మూడు భాగాలే ప్రథమమని అన్నారు.

భీమవరం ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) మాట్లాడుతూ ప్రజలకు వ్యాధుల పట్ల అవగాహన అవసరమని, లోపాలను ముందే గమనిస్తే పరిష్కార మార్గాలు ఎన్నో ఉంటాయని అన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా వైద్యానికి ఎన్నో సరికొత్త మెలుకువలు వచ్చాయని, మెరుగైన వైద్యాన్ని అందించటానికి ఎన్నో పరికరాలు కూడా అందుబాటులోకి వచ్చాయని ఎంఎల్ఎ తెలిపారు.

అవార్డు గ్రహీతలకు సత్కారాలు

ప్రముఖ చెవి, ముక్కు, గొంతు వైద్యులు డాక్టర్ నడింపల్లి రాజన్ రాజుకు జీవిత సాఫల్య పురస్కార అవార్డు, లెజెండ్ ఆఫ్ ఇఎన్‌టి అవార్డులను పద్మశ్రీ డాక్టర్ జెఎమ్ హ్యాన్స్, పద్మశ్రీ డాక్టర్ మిలింద్ వి కీర్ తనే, డాక్టర్ కెకె.రామలింగంలకు అందించి సత్కరించారు. కార్యక్రమంలో ఆశ్రమ వైద్య కళాశాల డైరెక్టర్ రతీదేవి, రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ నడింపల్లి శంకర్ కుమార్ వర్మ, ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ గొట్టుముక్కల బాలకృష్ణంరాజు పాల్గొన్నారు.

శ్రీ సూర్య కళాశాలలో టీచర్స్ డే వేడుకలు

నరసాపురం : నరసాపురం శ్రీసూర్య జూనియర్ కళాశాలలో శనివారం టీచర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నరసాపురం ఆర్‌డిఒ అచ్యుత్ అంబరీష్, తణుకు ప్రగతి కళాశాల కరెస్పాండెంట్ రాజా, ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయం తెలుగు ఆచార్యులు టి.సత్యనారాయణ, కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్, పేరాల మోహన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ అచ్యుత్ అంబరీష్ మాట్లాడుతూ విద్యార్థులు మొబైల్ ఫోన్ వాడకాన్ని తగ్గించాలని, ఆ సమయాన్ని విద్యకు కేటాయించి, ఉన్నత లక్ష్యం చేరాలని విద్యార్థులకు సూచించారు. ప్రగతి కళాశాల కరెస్పాండెంట్ రాజా మాట్లాడుతూ ప్రతి ఉదయం అమ్మ పాదాలకు నమస్కరించడం, తల్లిదండ్రులను గౌరవించడం చేసిన ఏ విద్యార్థి జీవితంలో ఓడిపోయినట్టు తాను చూడలేదని తెలిపారు. అనంతరం అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను ప్రత్యేకంగా సన్మానించారు. కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ ఘంటసాల బ్రహ్మాజీ, డాక్టర్ ఎఆర్ఎస్.కుమార్, డాక్టర్ ఫాజిల్, డాక్టర్ జానకీరామ్, డాక్టర్ ఆర్.సతీష్, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ యు.లక్ష్మీ కాంత్, డిగ్రీ ప్రిన్సిపల్ పి.పుల్లారావు పాల్గొన్నారు.


ఆర్‌డిఒను సత్కరిస్తున్న యాజమాన్యం

అద్దేపల్లి జయంతి నిర్వహణ హర్షణీయం

మాజీ ఎంఎల్ఎ బంగారు ఉషారాణి

పాలకొల్లు : మంత్రులు అంటే ఏసీ కార్యాలయాల్లో ఉండి ఆర్డర్లు వేయడం కాదని, సామాన్యులకు సేవ చేయడం కోసం నిద్రాహారాలు మాని, ముురుగు కాలువ గట్లపై పడుకుని సేవ చేయడమని మంత్రి నిమ్మల రామానాయుడు నిరూపించారని మాజీ ఎంఎల్ఎ బంగారు ఉషారాణి చెప్పారు. పాలకొల్లు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అద్దేపల్లి సత్యనారాయణ మూర్తి 125వ జయంతి ఉత్సవాల్లో ఆమె అతిథిగా పాల్గొన్నారు. 1942లో బ్రిటిష్ ప్రభుత్వంకు వ్యతిరేకంగా మున్సిపల్ చైర్మన్‌గా మున్సిపల్ కౌన్సిల్ తీర్మానం చేయడంతో బ్రిటిష్ ప్రభుత్వం మున్సిపల్ కౌన్సిల్‌ను రద్దు చేసిందని చెప్పారు. అటువంటి సాహసి అద్దేపల్లి సత్యనారాయణమూర్తి అని, అటువంటి గొప్ప వ్యక్తి 125వ జయంతి ఉత్సవాలను ప్రతినెల ఏడాది పొడవునా మంత్రి నిమ్మల చేయడం హర్షిణీయం అన్నారు. ఈ సందర్భంగా రక్తదాన శిబిరాన్ని మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహన్ ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని ధర్మారావు ఫౌండేషన్ చైర్మన్‌గా మంత్రి నిర్వహించారు. పాలకొల్లు పరిసర ప్రాంత విద్యార్థులు ఉన్నత చదువులు చదువుకోవాలని, తన రైస్ మిల్లును అద్దేపల్లి 1966లో రూ.లక్షకు అమ్మి పాలకొల్లులో ఎఎస్ఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ ఏర్పాటు చేశారని మంత్రి నిమ్మల చెప్పారు. ఆ మిల్ విలువ నేడు కొన్ని కోట్ల రూపాయలు ఉందని అన్నారు. కార్యక్రమంలో పలువురు సేవకులను మంత్రి సత్కరించారు. ఇంకా ఆర్యవైశ్య ప్రముఖులతో పాటు వివిధ పార్టీల నేతలు కబర్ది, పెచ్చెట్టి బాబు, జివి, రేపాక ప్రవీణ్ భాను, నాళం బాపిరాజు, ఇంటి శ్రీరాముడు పాల్గొన్నారు.

వేండ్రలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన


శంకుస్థాపన చేస్తున్న ఎంపిపి, సభ్యులు

ప్రజాశక్తి - పాలకోడేరు

వేండ్ర గ్రామంలో పలు అభివృద్ధి పనులకు పాలకోడేరు మండల పరిషత్ అధ్యక్షులు భూపతి రాజు సత్యనారాయణ రాజు(చంటి రాజు) శనివారం శంకుస్థాపన చేశారు. గ్రామంలోని 2వ వార్డులో కల్వర్ట్ నిర్మాణం, 10వ వార్డులో గ్రావెల్ రోడ్ నిర్మాణానికి శంకుస్థాపన చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎంపిపి చంటి రాజు మాట్లాడుతూ నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలన్నారు. నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. గ్రావెల్ రోడ్డు, కల్వర్టు నిర్మాణాలు గ్రామస్తులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి పాలజ్యోతి, మాజీ ఎంపిటిసి భూపతి రాజు, రాంబాబు రాజు, కృష్ణంరాజు, పంచాయతీ పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

డాక్టర్ రేఖకు సత్కారం

భీమవరం టౌన్: కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న వ్యక్తికి కిడ్నీ మార్పు చేయకుండా వైద్య సేవలు అందించడం చరిత్రలోనే అరుదని, అటువంటి ఘనత మన భీమవరం ఆడపడుచు సాధించడం గర్వించదగ్గ విషయమని మార్నింగ్ కాఫీ క్లబ్ కన్వీనర్ బొండ రాంబాబు, కో కన్వీనర్ ఓలేటి శ్రీనివాస్, పిఆర్ఒ భట్టిప్రోలు శ్రీనివాసరావు అన్నారు. ఇటీవల కిడ్నీ మార్పు చేయకుండా ట్రీట్‌మెంట్‌తో నయం చేసి సదరు రోగాన్ని ప్రపంచంలో ప్రసిద్ధి చెందిన 'ఫ్రాంటియర్స్ ఇన్ నెఫ్రోలోజి బుక్'లో మన ఇండియా తరుపున మొట్టమొదటి సారిగా ప్రచురించి కీర్తి పొందిన భీమవరం పట్టణ ప్రముఖులు కార్మూరి పెరుమాళ్ల గుప్తా కుమార్తె డాక్టర్ పి.రేఖ(ఎఐజి-హైదరాబాద్)ను మార్నింగ్ కాఫీ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా శనివారం భీమవరంలో సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటువంటి ఘనత సాధించడం కొంతమందికే సాధ్యమవుతుందని, ఇటువంటి ట్రీట్‌మెంట్స్ చేసి మరెంతో ఉన్నతస్థాయికి చేరుకోవాలని అన్నారు. 'ఫ్రాంటియర్స్ ఇన్ నెఫ్రోలోజి బుక్'లో ప్రచురించబడటం ఎంతో గర్వకారణమని అన్నారు. అనంతరం డాక్టర్ రేఖను మార్నింగ్ కాఫీ క్లబ్ సభ్యులు సత్కరించారు. డాక్టర్ కారుమూరి ఉదయ్ మాధవ్, కార్మూరి సత్యనారాయణ మూర్తి, కార్మూరి పెరుమాళ్ల గుప్తా, కార్మూరి బదిరీనాథ్, కార్మూరి కిరణ్, జూలూరి రాజా, కురిశేటి నాని, కోట్ల నాని, కొత్త శ్రీనివాస్, జూలూరి రాజా, మానేపల్లి వెంకన్నబాబు, బాయ్స్ శ్రీనివాస్, కంచర్ల భాస్కరరావు గుప్తా, కనగర్ల కిషోర్ పాల్గొన్నారు.

మళ్లీ తెరపైకి శ్మశాన దారి వివాదం

మృతదేహాన్ని శ్మశానానికి తీసుకెళ్లకుండా అడ్డగింత

రావిచెట్టు సెంటర్లో మృతదేహంతో రోడ్డుపై ధర్నా

పాలకోడేరు : మండల కేంద్రమైన పాలకోడేరు శ్మశాన వాటిక రహదారి వివాదం శనివారం మళ్లీ తెరపైకి వచ్చింది. మృతదేహాన్ని ఇటువైపు తీసుకువెళ్లడం కుదరదని అడ్డగించడంతో ఒక వర్గం మృతదేహంతో ఆందోళనకు దిగారు. ఈ నేపథ్యంలో పాలకోడేరులో ఉద్రిక్త పరిస్థితులకు దారి తీసింది. గ్రామంలో మురుగు కాలువకు చేర్చి ఎస్‌సి, బిసి, కన్వర్ట్ క్రిస్టియన్స్‌తో పాటు హిందువులకు సంబంధించి శ్మశాన వాటిక ఉంది. ఈ శ్మశాన వాటికకు రెండు దారులు ఉన్నాయి. శివాలయం వీధి నుంచి సిమెంట్ రోడ్డు వెంబడి ఒకదారి, పాలకోడేరు-మోగల్లుకు వెళ్లే రోడ్డు మార్గం మరొక దారి ఉంది. అయితే పూర్వం నుంచి శివాలయం మీదగా సిమెంట్ రోడ్డు వెంబడి శ్మశానానికి మృతదేహాలను తీసుకువెళ్లడం జరుగుతుంది. అయితే ఈ సిమెంట్ రోడ్డుకి ఇరువైపులా గృహాలు నిర్మించుకుని నివాసాలు ఉండడంతో ఇటువైపు మృతదేహాలను తీసుకువెళ్లడానికి కుదరదని అడ్డుకోవడంతో గతంలో వివాదం తలెత్తింది. ఈ నేపథ్యంలో అప్పటి కలెక్టర్, ఆర్‌డిఒలు శ్మశాన వాటికని పరిశీలించారు. రోడ్డుకు చేర్చి ఉన్న వాటిక నుంచి దారి ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ నేపథ్యంలో శ్మశాన వాటిక పైనుంచి దారి ఎలా ఏర్పాటు చేస్తారని ప్రశ్నించడంతో తాత్కాలికంగా పూర్వం నుంచి వస్తున్న దారినే వినియోగించుకోవాలని సూచించారు. అయితే ఇది ఇలా ఉండగా తూర్పుపేటకు చెందిన వృద్ధురాలు శనివారం మృతి చెందింది. వృద్ధురాలు మృతదేహాన్ని సిమెంట్ రోడ్డు వెంబడి శ్మశాన వాటికకు తీసుకెళ్లేందుకు ప్రయత్నం చేయగా కొంతమంది అడ్డుకున్నారు. ఈ నేపథ్యంలో శ్మశాన వాటిక దారి వివాదం మళ్లీ తెరపైకి వచ్చింది. దీంతో మృతురాలు కుటుంబ సభ్యులు మరో కొంతమంది రావిచెట్టు సెంటర్లో మృతదేహాన్ని రోడ్డుపై ఉంచి ధర్నా నిర్వహించారు. శ్మశానానికి వెళ్లేందుకు దారి చూపి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. న్యాయం చేసేంతవరకు మృతదేహాన్ని రోడ్డుపై నుంచి తీసేది లేదంటూ భీష్మించి కూర్చున్నారు. ఈ నేపథ్యంలో గ్రామంలో ఏర్పడిన వివాదం ఉధృత పరిస్థితులకు దారి తీసింది. రహదారిపై వాహనాలు నిలిచిపోయి ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. దీంతో పోలీసులు రంగ ప్రవేశం చేసి, సర్ది చెప్పే ప్రయత్నం చేశారు. అయితే పరిస్థితి అదుపులోకి రాకపోవడంతో భీమవరం రూరల్ సిఐ కాళీ చరణ్ సంఘటన స్థలానికి చేరుకుని బాధితులతో మాట్లాడారు. శ్మశాన వాటిక దారికి ఉన్న అడ్డంకిని తొలగించి మృతదేహాన్ని దగ్గరుండి శ్మశాన వాటికకు తరలించారు. స్థానిక సచివాలయంలో పోలీస్ అధికారులు, గ్రామ పెద్దలు, ప్రజా ప్రతినిధులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. శ్మశాన దారి సమస్యకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా శాశ్వత పరిష్కారానికి ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

ఆచంట : వల్లూరు గ్రామంలో నిరుపేద కుటుంబాలను గుర్తించి నాణ్యమైన నిత్యావసర సరుకులను అందించేందుకు తమ వంతు కృషి చేస్తున్నామని చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ నల్లా రాధాకృష్ణ అన్నారు. అగాపే సంఘకాపరి వల్లూరు పాస్టర్ హోప్ ఆర్థిక సహాయంతో పేద, మధ్యతరగతి కుటుంబాలు, శ్రామికులకు ప్రేమే మార్గం-సేవే లక్ష్యం చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యాన నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఒక్కో కుటుంబానికి 10 కేజీల బియ్యం, కేజీ పంచదార, లీటర్ మంచినూనె, కేజీ కందిపప్పు, కేజీ పంచదార, కేజీ ఉల్లిపాయలు తదితర సరుకులను అందజేశారు. కుసుమే సత్యనారాయణ, చింతపర్తి రాజేష్, బెజవాడ ఉపేంద్ర, అడపా హేమంత్ పాల్గొన్నారు.

ఎక్సైజ్ శాఖ ఉద్యోగులకు శుభపరిణామం

తణుకు : ఎక్సైజ్‌శాఖను ఏకీకరణ చేస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ఎక్సైజ్ ఉద్యోగులకు శుభ పరిణామమని తణుకు ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మద్దాల శ్రీనివాసరావు పేర్కొన్నారు. శనివారం స్థానిక ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ వద్ద ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర చిత్ర పటాలకు పాలాభిషేకం చేశారు. అనంతరం తణుకు ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణను కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్ఐ పాలంకి శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం: ఎక్సైజ్ శాఖను ఏకీకరణ చేస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ఎక్సైజ్ ఉద్యోగులకు శుభ పరిణామమని తాడేపల్లిగూడెం ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మద్దాల శ్రీనివాసరావు పేర్కొన్నారు. ముందుగా తాడేపల్లిగూడెం ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ నివాసంలో ఆయనను కలిసి అభినందనలు తెలియజేశారు. ఎక్సైజ్ ఎస్ఐ లక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి అక్షరం - ప్రజల పక్షం

ప్రజాశక్తి

తెలుగు దినపత్రిక

44వ వార్షికోత్సవ

ప్రత్యేక అనుబంధం

పశ్చిమగోదావరి జిల్లా

సెప్టెంబర్ 2024

20 పేజీలు

5

Advt.feature



ప్రత్యామ్నాయ జర్నలిజానికి ప్రతీక..

ప్రజాశక్తి

తెలుగు నేలపై చైతన్య కిరణం ప్రజాశక్తి. 'ప్రతి అక్షరం - ప్రజల పక్షం'గా సాగుతూ ప్రత్యామ్నాయ ప్రజా జర్నలిజానికి అసలుసిసలైన ప్రతీక.. ప్రజాశక్తి. ఇది అక్షర తూటాలతో అవినీతి, అక్రమాలను చీల్చి చెండాడుతుంది. ప్రజావ్యతిరేక విధానాలను తిప్పికొడుతుంది. ధనస్వామ్యంపై ధ్వజ మెత్తుతుంది. నిస్సహాయుల తరుపున నికరంగా నిలబడుతుంది. సమాజ మార్పునకు విశేష కృషి చేస్తుంది. అందుకే అది ప్రజల పత్రికగాను, కార్మిక, కష్టజీవుల పత్రికగాను గుర్తింపు పొందింది. ఈ పత్రికకు అడుగడుగునా జన సహాయం అందుతూనే ఉంది. ప్రజలే దీనికి అండాదండ. అన్ని రంగాలకు చెందిన వార్తలు ప్రచురిస్తూ ప్రజాశక్తి ప్రజల ఆదరణ పొందుతోంది. వార పత్రిక నుంచి దిన పత్రికగా, ఆ తరువాత టాబ్లాయిడ్, అనంతరం కలర్ పత్రికగా ఆవిర్భవించింది. ప్రత్యేక అంశాలతో ప్రజలను ఆకట్టుకుంటూ దినదినాభివృద్ధి చెందుతోంది. దీనిలో భాగంగానే పత్రిక అంచెలం చెలుగా ఎదుగుతూ నేడు 44వ వార్షికోత్సవం నిర్వహించుకుంటోంది. ఈ నేపథ్యంలో ప్రజాశక్తి ప్రస్థానాన్ని గుర్తు చేసుకుందాం. ..2లో









ప్రత్యామ్నాయ జర్నలిజానికి ప్రతీక ప్రజాశక్తి

(మొదటి పేజీ నుంచి)

1980 సంవత్సరపు ఆఖరి రోజులు. అఖిలపక్ష రైతు ఉద్యమం రాష్ట్ర రాజకీయాలను ఉర్రూతలూపింది. మూడు నెలలపాటు రకరకాల పిలుపులతో రాష్ట్రం వేడెక్కింది. వారపత్రికగా నడుస్తున్న ప్రజాశక్తి ఉద్యమావసరాలకు సరిపోవడం లేదనే ఆవేదన పెరుగుతోంది. మరో వైపున పత్రికల విస్తరణ ఊపందుకుంది. అలాంటి తరుణంలో సిపిఎం పశ్చిమ బెంగాల్ కమిటీ నుంచి అనుకోని ప్రతిపాదన వచ్చింది. అరవయ్యవ దశకంలో ఆంధ్రప్రదేశ్ కమిటీ తన దినపత్రిక అచ్చుయంత్రాన్ని బెంగాల్ కమిటీకి విక్రయించింది. దానిపైనే అప్పటి వరకూ బెంగాల్‌వారు గణశక్తిని సాయంకాలపు పత్రికగా ప్రచురిస్తున్నారు. ఇప్పుడు తాము కొత్త మిషన్ కొంటున్నామని, పాత మిషన్ కావాలంటే అప్పటి ధరకే అందజేస్తామన్నది వారి ప్రతిపాదన. దీనిపై సీనియర్ నాయకులు వెనువెంటనే చర్చించి ఆమోదించారు. ప్రజాశక్తి వారపత్రికను దినపత్రికగా వెలువరించాలని నిర్ణయించారు. రాష్ట్ర కమిటీ ఆ మేరకు ప్రకటన చేసింది. ఆ ప్రకారం 1981 ఆగస్టులో వారపత్రిక ప్రచురణ ఆగింది. 'వారపత్రికగా సెలవు-దినపత్రికగా మీ సేవకు సిద్ధం' అంటూ నాటి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి, ప్రజాశక్తి దినపత్రిక ప్రథమ సంపాదకులు మోటూరు హనుమంతరావు వీడ్కోలు సంపాదకీయం రాశారు. దినపత్రిక సన్నాహాలు మొదలయ్యాయి.


విజయవాడలో ప్రజాశక్తి దినపత్రిక ప్రారంభ సభలో ప్రసంగిస్తున్న పుచ్చలపల్లి సుందరయ్య, వేదికపై ఇఎంఎస్.నంబూద్రిపాద్ (ఫైల్ ఫొటో)

నిజానికి ప్రజాశక్తికి 80 ఏళ్ల చరిత్ర ఉంది. నలభయ్యవ దశకంలో అది ప్రజల పత్రికగా, శ్రమజీవుల వాణిగా పేరొందింది. భాషా సంస్కృతి తదితర అంశాల్లో కూడా ప్రజాప్రయోజనాలకు పట్టం కట్టింది. ఇది సహించలేని వాళ్లు 'పెద్ద బాలశిక్ష ఫెయిల్ – ప్రజాశక్తి పాస్' అంటూ అక్కసు వెలిబుచ్చేవారు. చదువురాని వాళ్లను కూడా చైతన్యపరిచేలా పదునైన భాషలో పత్రిక రావడమే వారి ఆగ్రహానికి కారణం. ప్రభుత్వ నిర్బంధానికి గురైన తర్వాత మళ్లీ సాధారణ పరిస్థితులు ఏర్పడి పత్రికను పునరుద్ధరించినా ఆ పేరుతోగాక విశాలాంధ్ర పేరుతో వచ్చింది. మళ్లీ రాజకీయావసరాలరీత్యా 1968 నుంచి దాదాపు పదమూడేళ్ల పాటు ప్రజాశక్తి వారపత్రికగా నడిచింది. వారపత్రిక తేవడానికి అవసరమైనంత మేరకు కంపోజింగ్, ప్రెస్ ఉన్నాయి. దినపత్రిక ప్రచురించడానికి చాలా సిబ్బంది కావాలి. యంత్రాంగమూ పెరగాలి. దీంతో మూడు నెలల ముందు సన్నాహాలు మొదలయ్యాయి. పుచ్చలపల్లి సుందరయ్య ప్రత్యక్షంగా పర్యవేక్షించారు. మోటూరు హనుమంతరావు పత్రికా నిర్వహణ సంబంధమైన ఏర్పాట్లు చూశారు.

ప్రజాశక్తి దినపత్రికగా రాబోతుందన్న వార్త వామపక్ష ప్రగతిశీలవాదులకు ఎంతో ఉత్సాహాన్నిచ్చింది. నాయకుల ద్వారా దాతలు సహాయ సహకారాలు అందజేశారు. పుచ్చలపల్లి సుందరయ్య అధ్యక్షతన జరిగిన సభలో ఇఎంఎస్.నంబూద్రిపాద్ పత్రిక తొలి ప్రతిని ఆవిష్కరించారు. ఆ సందర్భంగానే సుందరయ్య.. కమ్యూనిస్టులు పత్రికను ఎంత విలువైనవిగా పరిగణిస్తారో వివరించారు. అప్పటివరకూ విశాలాంధ్ర మాత్రమే వామపక్ష దినపత్రికగా వెలువడుతుండేది. కమ్యూనిస్టు పత్రికలంటే అదే నమూనాలో ఊహించేవారు. సాధారణ వార్త ఎంత ముఖ్యమైనదైనా అంతకంటే పార్టీ సంబంధమైన వార్తకే ప్రథమ ప్రాధాన్యతనివ్వడం, ఉద్యమ సంబంధమైన నాయకుల ప్రకటనలు మొదటి పేజీలో ఇవ్వడం ఇందులో ప్రధానాంశం. అయితే ప్రజాశక్తిని కేవలం వ్యూస్ పేపరుగా కాక న్యూస్ పేపర్‌గా తీసుకురావాలని నాయకత్వం భావించింది. అంటే కేవలం పార్టీ సంబంధిత వార్తలు మాత్రమే కాకుండా అన్ని రకాలైనవి ఇవ్వాలని నిర్ణయమైంది. ఇదో కొత్త ఒరవడి. అయితే దాన్ని సంపూర్ణం గావించడానికి చాలా కాలం పట్టింది. ప్రజాశక్తి దినపత్రిక పున:ప్రారంభమైన కొద్ది రోజుల్లోనే కారల్ మార్క్స్ జయంతి ఉత్సవాలు వచ్చాయి. ఆ పైన సిపిఎం జాతీయ మహాసభలు విజయవాడలో అపూర్వంగా జరిగాయి. ఇవన్నీ కూడా పాఠకులకు ఆసక్తికరమైన సందర్భాలు కావడంతో పత్రిక చురుగ్గా నడిచింది. ఆదివారం అనుబంధం విభిన్నంగా ఉందని అభినందనలు వచ్చాయి. పెద్ద యంత్రాంగం లేకున్నా ఉత్సాహవంతులైన యువ పాత్రికేయులే ..4లో







ఆహ్లాదకరంగా మేడపాడు క్రిస్టియన్ హాస్టల్

అనాథలను అక్కున చేర్చుకుని ఉన్నత విద్యార్థులుగా తీర్చిదిద్దుతున్న నిర్వాహకులు


హాస్టల్ లోపల చక్కని సుందరమైన ప్రవేశ మార్గం

ప్రజాశక్తి - యలమంచిలి

అదొక క్రిస్టియన్ మిషనరీ సంస్థకు చెందిన చిల్డ్రన్ హోం. అయితే ఈ హాస్టల్ ఆవరణలోకి ఎవరు ప్రవేశించినా ఇక్కడి ప్రకృతి అందాలను చూసి ఇది నిజంగానే హాస్టలా? లేక పూలవనమా అన్న అనుమానం కలుగక మానదు. ఎందుకంటే లోపలికి వెళ్లే రహదారులకు ఇరువైపులా ఉన్న రకరకాలైన రంగురంగుల పూలమొక్కల సోయగాలను చూస్తే మనసు పులకించక మానదు. ప్రాంగణంలో ఉన్న పచ్చటి వనాలను చూసినా, పిల్లలు బస చేసే భవనాలను చూసినా మనసు ఆనందంతో పరవశిస్తూ వేరే ప్రపంచంలోకి వచ్చామా.. అనే అనుభూతి కలుగుతుందంటే అతిశయోక్తి కాదు. అదే మండలంలోని మేడపాడులోని క్రిస్టియన్ సర్వీస్ చిల్డ్రన్ హోం ప్రత్యేకం..

ఈ హాస్టల్ చూడడానికి ఎంత సుందరంగా ఉంటుందో అదే స్థాయిలో ఈ హాస్టల్ యాజమాన్యం, ఇక్కడ ఉండే విద్యార్థులు కూడా అంతే క్రమశిక్షణతో విద్యార్థులు నేర్పిస్తూ, కన్న తల్లిదండ్రుల కంటే మిన్నగా బాధ్యత వహిస్తూ, వారిని పైస్థాయి చదువులు చదువుకునేందుకు పూర్తి ప్రోత్సాహాన్ని అందిస్తూ, గత 33 ఏళ్లుగా సంస్థ అప్రతిహాతంగా ముందుకు దూసుకు వెళ్తూ పలువురి ప్రశంసలు అందుకుంటుంది.

విద్యార్థులకు మంచి పోషకాలతో కూడిన ఆహారం..

హాస్టల్‌లో బస చేసే విద్యార్థులకు ఆహారంలో వారానికి మూడుసార్లు కోడిగుడ్డు, ఒకసారి చికెన్, రెండుసార్లు చేపలకూర, మిగిలిన రోజులు పప్పు, ఆకుకూరలు, ఉదయం అల్పాహారం. స్కూల్ నుంచి వచ్చిన వెంటనే సాయంత్రం సమయంలో రోజుకు ఒక స్నేక్ చొప్పున ఇవ్వడంతో పాటు వారానికి మూడు రోజులు అరటి పళ్లు, ఖర్జూరం లాంటి ఫలాలను ఇవ్వడంతో పాటు భోజనంలో ప్రతిరోజు బట్టర్ మిల్క్‌ను ఇస్తున్నారు. ఒక సంవత్సరం నుంచి పది సంవత్సరాలలోపు ఉండే విద్యార్థులకు 150 గ్రాముల పాలను అందిస్తారు.

వైద్యపరంగా పిల్లలకు సంరక్షణ..

హాస్టల్‌లో ఉండే విద్యార్థులకు ఏ చిన్న చిన్న అనారోగ్య సమస్యలు వచ్చినా వారికి స్థానికంగా ప్రథమ చికిత్స చేయించి అవసరమైన మందులు ఉచితంగా ఇవ్వడంతో పాటు ఇంకా అత్యవరమైన అనారోగ్య సమస్య వస్తే ..5లో


హాస్టల్లో విద్యార్థులు


ప్రార్థనా మందిరం

ప్రత్యామ్నాయ జర్నలిజానికి ప్రతీక ప్రజాశక్తి

(రెండో పేజీ నుంచి)

శ్రమపడి రాస్తుండేవారు.

కొత్త యంత్రం.. నూతన భవనం

అప్పటికే తెలుగు దినపత్రికల్లో కొత్త పోకడలు ఊపందుకున్నాయి. ఆంధ్రప్రభ స్థానంలో ఈనాడు అగ్రశ్రేణి దినపత్రికగా అవతరించింది. జర్నలిజంలో కొత్త ధోరణులు తీసుకొస్తున్నది. పార్టీ సంబంధమైన వార్తలను కూడా ప్రజాశక్తిని మరపించేలా ఇవ్వాలన్నది దాని వ్యూహం. ఆ విధంగా 1982లో మహాసభ సందర్భంగా నాయకుల ఇంటర్వ్యూలు వగైరాలు ఎంతో విస్తృతంగా ఇచ్చింది. వనరులు, నిపుణులు ఎక్కువ. ఇలాంటి తరుణంలో ప్రజాశక్తి పాఠకుల్లో కూడా మరింత కొత్తదనం కావాలనే ఆకాంక్ష పెరిగింది. ఈలోగా ఎన్‌టిఆర్ రంగప్రవేశం, విజయం ఇవన్నీ రాజకీయాలను, మీడియాను అమితంగా ప్రభావితం చేశాయి. ఈ నేపథ్యంలో బెంగాల్ నుంచి తెచ్చుకున్న పాతమిషన్‌పై పత్రికను ప్రచురించడం ఆచరణ సాధ్యం కాని విషయంగా మారింది. అందుకే ఆఫ్‌సెట్ యంత్రాన్ని తెప్పించాలని నిర్ణయమైంది. అప్పటివరకూ మార్క్సిస్టు కార్యాలయంలో ఒక భాగంగా తీసుకుని నడుస్తున్న ప్రజాశక్తికి నూతన భవనం కూడా అవసరమని భావించారు. అలాంటి సమయంలో ఉద్యమ శ్రేయోభిలాషి కాట్రగడ్డ శ్రీనివాసరావు.. నవరంగ్ టాకీస్ పక్కన ఉన్న విలువైన స్థలాన్ని ప్రజాశక్తికి ఇచ్చేందుకు ముందుకొచ్చారు. 1983 మే 1న, ఆ రోజు మేడే మాత్రమే కాక సుందరయ్య జన్మదినం కూడా. ఆయనకు మహాభిమాని, సన్నిహితుడు అయిన శ్రీనివాసరావు ఆ రోజునే భవనాన్ని అంకితం చేయాలని నిర్ణయించారు. సీనియర్ నాయకులైన బిటి.రణదివే వచ్చి భవన ప్రారంభోత్సవంతో పాటు ప్రధానోపన్యాసం చేశారు.ఆఫ్‌సెట్‌లో అందంగా ముద్రించిన పత్రికను చూసి పాఠకులు ఎంతగానో మెచ్చుకున్నారు. అప్పటినుంచి సాంకేతికంగానూ పత్రికలో నూతన ప్రయోగాలు మొదలయ్యాయి. మిగిలిన వారికున్న హంగులు లేకున్నా పత్రికలోని యువ మిత్రులు ప్రయోగశీలతతో దాన్ని విభిన్నంగా తేవడానికి ఎప్పటికప్పుడు ప్రయత్నించారు. ఇతర ప్రముఖ పత్రికలవారు కూడా హర్షిస్తూ వచ్చారు. పార్టీ పత్రికే అయినా ప్రజాశక్తి భిన్నంగా ఉంటుందనే వాదన బలపడింది.

ప్రజాస్వామ్య పునరుద్ధరణకు ఊపిరి

ఇంతలో నాదెండ్ల భాస్కరరావు వెన్నుపోటుతో ఎన్‌టిఆర్ ప్రభుత్వం కూలిపోయింది. రాష్ట్రంలో ప్రజాస్వామ్య పునరుద్ధరణకు ఉద్యమం మొదలైంది. ప్రజాశక్తి ఆ ఘట్టంలో ఒక ముఖ్య భాగస్వామి అయింది. ప్రజాస్వామ్య ఉద్యమం విజయవాడ నుంచి ప్రారంభమైన రోజునే ప్రత్యేక సంచిక విడుదల చేయడంతో ప్రతివారి చేతిలోనూ అదే కనిపించింది. అప్పటి నుంచి నెలరోజుల పాటు మోటూరు హనుమంతరావు.. ప్రతిరోజూ ఇదే విషయమై సంపాదకీయాలు రాశారు. దానికితోడు కదం తొక్కించే శీర్షికలు, నాదెండ్ల మంత్రివర్గాన్ని విస్తరించినప్పుడు 'కీలుబొమ్మ మంత్రివర్గంలో తోలుబొమ్మలు" అని పెట్టిన హెడ్డింగ్ ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఆ నెల రోజులూ ప్రజాశక్తి.. ప్రజాస్వామ్య ఉద్యమాభిమానుల ఆదరణకు పాత్రమైంది. ఎన్‌టిఆర్‌ను తిరిగి ముఖ్యమంత్రిగా ప్రతిష్టించిన తరుణంలో అన్నిటికన్నా ముందు ప్రజాశక్తి మార్కెట్లో విడుదలై సంచలనం సృష్టించింది. అలాగే ముఖ్యమైన పరీక్షా ఫలితాలు వంటివి కూడా పోటీ పడి విడుదల చేయడానికి కృషి జరగడంతో పత్రికను సీరియస్‌గా తీసుకోవడం పెరిగింది. వివిధ ప్రాంతాల్లో ఉత్సాహవంతులైన కార్యకర్తలు విలేకరులుగా వార్తలు పంపించడంతో కవరేజ్ కూడా మెరుగైంది. ఆ రోజులలో సత్తెనపల్లి సమీపంలోని కోళ్లూరు దగ్గర ఒక పెద్ద పడవ ప్రమాదం జరిగిన వార్తను ప్రజాశక్తి ఒక్కటే ఇవ్వడం పత్రికా రంగంలో సంచలనమైంది.

ప్రత్యేకతలు - ప్రతిబంధకాలు

1984లోనే తొలిసారిగా పరిశ్రమల సంచిక, స్వాతంత్ర్య దినోత్సవ ప్రత్యేక సంచికలు విడుదలయ్యాయి. ఇవన్నీ పత్రికస్థాయి పెరిగేందుకు దోహదపడ్డాయి. 1984లో ఇందిరాగాంధీ హత్య జరిగినప్పుడు ప్రజాశక్తి ప్రచురించిన పెద్ద ఫొటో హిందూ తర్వాత అత్యుత్తమంగా ఉన్నట్టు ప్రశంసించారు. ఇవన్నీ ఉన్నా న్యూస్‌ప్రింట్ వ్యయం, జీతభత్యాలు వగైరాలు పెరగడంతో పత్రిక నిర్వహణ కష్టంగా మారింది. అడ్వర్టైజ్‌మెంట్లు చాలని స్థితి. ఆ దశలో యాజమాన్యం ఆరు పేజీల పత్రికను నాలుగు పేజీలకు తగ్గించాలని నిర్ణయించింది. ఇతర పత్రికల పోటీని తట్టుకోవడమే కష్టంగా ఉన్న తరుణంలో ఉన్న పేజీలను తగ్గించడం, పత్రికల్లో వచ్చే ప్రధాన విషయాలేవీ దెబ్బతినకుండా ఉండటం వంటి అంశాలపై ముందే తగు ప్రణాళిక తయారైంది. ఏమైనా ప్రజాశక్తి రాజకీయ నిబద్ధత, పాఠకాభిమానం దాన్ని నిలబెట్టాయి. పేజీల తగ్గింపు పత్రిక సర్క్యులేషన్‌ను తీవ్ర ప్రభావితం చేయకపోవడం ఆశ్చర్యకరమైన వాస్తవం. ఒక ప్రధాన దినపత్రిక నాలుగు పేజీలతో వెలువడి నిలదొక్కుకున్న ఉదాహరణ ఆధునిక తెలుగు జర్నలిజంలో మరి కనిపించదు. అయితే అది కోరుకున్న పరిస్థితి ఏమీ కాదు. వీలు చిక్కగానే ప్రజాశక్తి తిరిగి ఆరు పేజీలకు పెరిగింది. ఈ కాలమంతటా సాంకేతికంగానూ, సిబ్బంది దృష్ట్యాను ప్రజాశక్తి హంగులు సమకూర్చుకుంటూనే వచ్చింది. అన్నిటికన్నా ముఖ్యంగా రాజకీయ నైశిత్యాన్ని నిలబెట్టడంలో విశేషకృషి చేసింది. రాష్ట్రంలోని రాజకీయ సీనియర్ నాయకుల్లో ఒకరుగా, కమ్యూనిస్టు వ్యాఖ్యాతలలో అగ్రగణ్యుడుగా పేరెన్నికగన్న మోటూరు హనుమంతరావు సంపాదకీయం దానికి పెద్ద పెట్టుబడి కాగా, ఉత్సాహం, అంకితభావం గల సంపాదకవర్గం, యాజమాన్యం, సిబ్బంది దాన్ని ముందుకు నడిపే సైన్యంగా పనిచేశారు. అప్పటికే రంగంలో ఉన్న పత్రికలతో ధీటుగా అది ముందుకు సాగింది. కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా వామపక్ష లౌకిక శక్తుల ఐక్యతను పెంచడం దాని ప్రధాన నినాదమైంది. అప్పట్లో అధికారంలో ఉన్న తెలుగుదేశం పార్టీకి మద్దతునిస్తూనే విధానపరమైన అంశాల్లో నిక్కచ్చిగా విమర్శలు చేసేది.

1984 ఎన్నికల పోరాటంలో ప్రజాశక్తి ఇచ్చిన సమాచారం, ప్రత్యేక ఫీచరింగ్ నినాదాలు వంటివి అందరినీ ఆకర్షించాయి. 1985లో కారంచేడులో దళితులపై హత్యాకాండ జరిగింది. ఆ వార్తను ముందుగా ఇచ్చిన వాటిలో ప్రజాశక్తి ఒకటి. తర్వాత కూడా ఆ వివరాలను ప్రత్యేక ప్రాధాన్యతతో ఇస్తూ వచ్చింది. లౌకిక పార్టీల ఆధ్వర్యంలో సాగిన ఉద్యమాలకు ఎప్పుడూ ప్రజాశక్తి వాణిలా పనిచేస్తూ వచ్చింది. దానితో పాటు పలు శీర్షికల ద్వారా రాజకీయ, సైద్ధాంతిక చైతన్యం పంచిపెట్టింది.

1988 డిసెంబర్‌లో వంగవీటి మోహనరంగా హత్యానంతరం అల్లర్లు తీవ్ర ఉద్రిక్తతలకు దారితీశాయి. సంయమనంతో సమతుల్యతతో వ్యవహరించి వాస్తవాలను వెలికితీసి ప్రచురించింది. 1987 తర్వాత రాజీవ్‌గాంధీ బోఫోర్స్ కుంభకోణం దేశాన్ని కుదిపేసింది. ఆ సమాచారాన్ని తేవడంతో ప్రజాశక్తి ప్రముఖ పాత్ర వహించింది. హిందూ సహ సంపాదకునిగా ఉన్న ఎన్.రామ్ భోఫోర్సు కుంభకోణం తాలూకా కీలక పత్రాలను తమ పత్రికలో ప్రచురించడానికి అప్పటి సంపాదకులు అంగీకరించనందున ఇతర పత్రికల ద్వారా విడుదల చేశారు. తెలుగులో ఆయన ప్రజాశక్తిని ఎంచుకున్నారు. భోఫోర్స్ వార్తల ఫీచరింగ్‌తో వచ్చిన ప్రజాశక్తి సాయంత్రం మార్కెట్లో పెద్ద సంచలనమైంది. ఆ నేపథ్యంలో 1989లో కేంద్రంలో నేషనల్ ఫ్రంట్ ప్రభుత్వం వచ్చింది. రాష్ట్రంలోని తెలుగుదేశం ఓడిపోయి, కాంగ్రెస్ అధికారం చేపట్టడంతో ప్రజాశక్తి రాజకీయ బాధ్యత పెరిగింది.

1990 ప్రజాశక్తికి మరోమలుపు. అందులో ఒకటి కంప్యూటర్ల ప్రవేశం. మరొకటి రంగురంగుల ప్రత్యేక సంచికల ప్రారం భం. అప్పటికే వివిధ దినపత్రికలు కంప్యూటర్లను ప్రవేశపెట్టాయి. కాస్త ఆలస్యమైనా సమగ్రంగా ప్రజాశక్తి కంప్యూటరీకరణను చేపట్టింది. ఉద్యమ శ్రేయోభిలాషి కొండయ్య అందుకు దోహదపడ్డారు. 1999 మే 19 నుంచి కంప్యూటర్ మీద తేవాలనుకున్నది.. సిబ్బంది ఉత్సాహం వల్ల మే 1 నుంచే తేగలిగారు. ఇతర పత్రికలు మ్యాటర్ వరకు కంప్యూటర్‌పై చేసి, లేఅవుట్, పేస్టింగ్ చేసేవి. కానీ ప్రజాశక్తి ఒకేసారి పేజీనేషన్ చేయడం విశేషం. కంప్యూటర్ వ్యవస్థను లోతుగా అధ్యయనం చేసిన సిబ్బంది, బాధ్యులు అనేక నూతన ప్రక్రియలను అన్వేషించారు. ఆ విధంగా పత్రిక కొత్త ఆకర్షణ సంతరించుకోవడానికి దోహదపడ్డారు. 1990లో గోదావరి గైడ్ పేరిట పుష్కరాల ప్రత్యేక సంచిక వచ్చింది. ప్రజాశక్తి ప్రత్యేక సంచికలు ప్రతిష్టాత్మకంగా రావడానికి అది నాంది పలికింది.

1991లో దశమ వార్షికోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎన్.రామ్ ప్రజాశక్తి సాంకేతిక పద్ధతులను చూసి ఆనందాశ్చర్యాలు వెలిబుచ్చారు. చేతి కంపోజు నుంచి ఒకేసారి పేజినేషన్‌కు వెళ్లారంటే బూర్జువా దశను దాటి సోషలిస్టు దశలోకి ప్రవేశించారన్న మాట అని చమత్కరించారు. సుందరయ్య రాజకీయాలతో పాటు సాంకేతిక అభివృద్ధి గురించి తనతోతరచూ చర్చించేవారని, ప్రజాశక్తిని చూస్తుంటే ఆయన కలలు నిజమైనట్లు అనిపిస్తోందని రామ్ కరతాళధ్వనుల మధ్య అన్నారు. పదో వార్షికోత్సవానికి సోదర పత్రికల సంపాదకులందరూ హాజరై అభినందించారు. దశమ వార్షికోత్సవం వాస్తవానికి రాజకీయంగా, పత్రికాపరంగా కొత్త దశకు సూచన. తర్వాతకాలంలో పత్రిక అభివృద్ధి వేగం పుంజుకుంది. 1991లో సోవియట్ ..6లో

కొత్త కనకరత్నమాలకు డాక్టరేట్


డాక్టరేట్ అందుకుంటున్న కొత్త కనకరత్నమాల

ప్రజాశక్తి - ఆచంట

మండలంలోని భీమలాపురం గ్రామానికి చెందిన శ్రీదేవి ఆర్యవైశ్య మహిళా సేవ మండల అధ్యక్షురాలు డాక్టర్ కొత్త కనకరత్నమాల వెంకటేశ్వర్లకు రెండు డాక్టరేట్లు వరించాయి. ఈ సందర్భంగా ఆమె ప్రజాశక్తితో మాట్లాడుతూ 1983వ సంవత్సరం నుంచి 2024 సంవత్సరం వరకు సుమారు 41 సంవత్సరాల పాటు అనేక రంగాల్లో కుల, మత, లింగ బేధాలు లేకుండా ప్రజలకు విశిష్ట సేవలు అందించినందుకు గాను తమిళనాడు యూనివర్సిటీ ద్వారా డాక్టరేట్ అందుకున్నట్లు ఆమె తెలిపారు. అలాగే గోబుల్ అకాడమీ కౌన్సిలర్ జర్మనీ యూనివర్సిటీ సామాజిక సేవ సోషల్ సర్వీస్‌లో భాగంగా రెండవ డాక్టరేట్‌ను ఆమె పొందారు. స్త్రీ, శిశుఅభివృద్ధి, గ్రామాభివృద్ధికి పాటుపడుతూ, వారిలో సోషల్ అవేర్నెస్ కలిగిస్తూ సుమారు ఐదువేల మందికి రాష్ట్రస్థాయిలో ఉచితంగా వృత్తి శిక్షణా కోర్సులు నేర్పించి, వారిలో అనేక మందికి ఉచితంగా కుట్టుమిషన్లు, మగ్గాలు, గ్రైండర్‌లు, మిక్సీలు ఇప్పించడం జరిగిందని ఆమె తెలిపారు. మరో వెయ్యి మందికి కుట్టుమిషన్లు సబ్సిడీపై ఇప్పించి, మహిళలు కాలు మీద ఆర్థికంగా నిలబడేలా చేసి, ఆయా కుటుంబాలకు చేయూత నిచ్చేలా సేవలందించినట్లు ఆమె వివరించారు. గ్రామీణాభివృద్ధికి రోడ్లు వేయించడం, వంతెనలు కట్టించడం, ఆసుపత్రి, సబ్ సెంటర్లకు ఇద్దరు నర్సులు, కాంపౌండర్లను రప్పించుట, స్రవంతి మహిళా మండలి బిల్డింగు కట్టించుట, లైబ్రరీ తీసుకురావడం జరిగిందన్నారు. జీర్ణ దేవాలయాలు పునరుద్ధరణ, కొత్త దేవాలయాలు ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. జిల్లాలో 100 డ్వాక్రా గ్రూపులు ఏర్పాటు, పర్యావరణ పరిరక్షణ, ఆరోగ్య శిబిరాలు ఏర్పాటుకు తన వంతు కృషి చేసినట్లు ఆమె వివరించారు. వికలాంగులకు చక్రాల కుర్చీలు, వాకర్లు కళ్లజోళ్లు ఉచితంగా ఇప్పించడం జరిగిందన్నారు. ముఖ్యంగా ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా పనిచేసినట్లు తెలిపారు. కోట్లాది రూపాయలతో ప్రభుత్వ బ్యాంకులు, సొసైటీల ద్వారా లోన్లు ఇప్పించడం జరిగిందని వివరించారు. ఆకాశవాణి, దూరదర్శన్ ప్రోగ్రాంలో తన వంతు పాలు పంచుకున్నట్లు ఆమె వివరించారు. గత 41 సంవత్సరాలుగా ప్రజలకు సేవ చేసి, గ్రామస్థాయి నుంచి ఇంటర్నేషనల్ స్థాయి వరకు సుమారు 100 అవార్డులు, 500 సన్మానాలు పొందుతూ ప్రస్తుతం ఎపి వరల్డ్ ఆర్యవైశ్య మహాసభ సీనియర్ సిటిజన్ ఫోరం నార్త్ విభాగానికి అధ్యక్షురాలుగా, ఇంటర్నేషనల్ వాకర్స్ క్లబ్ 201 డిప్యూటీ స్పీకర్‌గా, నరసాపురం బిజిబిఎస్ ఉమెన్స్ కాలేజ్ మేనేజింగ్ డైరెక్టర్‌గా కొత్త కనక రత్నమాల వెంకటేశ్వర్లు చారిటబుల్ ట్రస్ట్ ఎండి గాను మరో 10 సంస్థలు అనేక పదవులు నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. అన్ని రంగాల్లోనూ అడుగు పెట్టి ఈ విజయాలు సాధించినందుకు గాను ఈ అవార్డులు అందుకున్నట్లు ఆమె తెలిపారు. ఈ విజయాల వెనుక తన భర్త కొత్త వెంకటేశ్వర్లు, కుమారులు కె.నాగభూషణం హరిప్రసాద్, కె.వెంకట రామకృష్ణ, కోడలు, మనమల్లు, తల్లిదండ్రులు కొల్లేపర రామారావు, మహాలక్ష్మి, బంధువులు, స్నేహితులు, గ్రామస్తుల సహకారంతో తన జీవితం చివరి వరకు సేవకి అంకితమని ఆమె వివరించారు.

ఆహ్లాదకరంగా మేడపాడు క్రిస్టియన్ హాస్టల్

(మూడో పేజీ నుంచి)

పెద్ద ఆసుపత్రులలో కూడా వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. వారు పూర్తిగా కోలుకొనే వరకు బాధ్యత తీసుకుంటారు.

క్రాచ్ ద్వారా డే కేర్ విద్యార్థులకు ట్యూషన్

హోమ్‌లో ఉండే విద్యార్థులతోపాటు మేడపాడు పరిసర గ్రామాలకు చెందిన విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించి, క్రిస్టియన్ మిషన్ సర్వీస్ ద్వారా వారికి సహాయం పొందే విధంగా బాధ్యత వహిస్తూ మొత్తం 140 మంది పిల్లలు ఈ హాస్టల్ ద్వారా విద్యాబుద్ధులు నేర్చుకుంటున్నారు. ఎంతోమంది ఉన్నత విద్యార్థులుగా తీర్చిదిద్దుతున్నారు.

విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దడమే మా కర్తవ్యం

హాస్టల్ వార్డెన్ పడాల జ్ఞానప్రకాష్



అనాథలను అక్కున చేర్చుకుంటూ ప్రతి విద్యార్థికీ జీవించే హక్కు, రక్షణ పొందే హక్కు, ఎదిగే హక్కు, పాల్గొనే హక్కు కలిగి ఉన్నారని, దానికి అనుగుణంగా విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దడానికి తమ సంస్థ అనేక ఏళ్లుగా కృషి చేస్తూ ఉంది. తమ హాస్టల్‌లో తల్లిదండ్రులు లేని పిల్లలు గాని లేదా సమాజంలో వివిధ అఘాయిత్యాలకు, దాడులకు గురైన వారిని చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ఏలూరు వారి ద్వారా ప్లేస్‌మెంట్ ఆర్డర్ పొంది, తమ హాస్టల్‌లో జాయిన్ అయ్యే అవకాశం ఉందని, దీన్ని తల్లిదండ్రులు లేని పిల్లలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

రాచరిక వైభవానికి ప్రతీక లక్కమేడ



మొగల్తూరులో నిర్మించిన లక్కమేడ


ప్రజాశక్తి - మొగల్తూరు

మొగల్తూరు పేరు చెబితే గత కాలం నాటి రాచరిక వైభవం గుర్తుకొస్తుంది. అందుకు సాక్ష్యమే 18వ శతాబ్దంలో నిర్మించిన కోట, అందులోని లక్కమేడ. కలిదిండి వంశీయులు ఇక్కడ పాటిమట్టితో నిర్మించిన కోట అప్పటి పనితనానికి నిదర్శనంగా చెప్పుకోవచ్చు. సుమారు 15 కిలోమీటర్ల దూరంలోని పాలకొల్లు మండలం లంకలకోడేరు నుంచి ఇక్కడ వరకూ మనుషులు వరుసలో నిలబడి చేతులతో పాటిమట్టిని అందుకున్నారని చరిత్రకారులు చెబుతున్నారు. కాలక్రమంలో పాటిమట్టితో నిర్మించిన కోట గురుజులు శిథిలమయ్యాయి. లోపల నిర్మించిన లక్కమేడ నేటికీ అలానే ఉంది.

అద్భుత పనితీరు..

లక్కమేడ నిర్మాణానికి అప్పటి కార్మికులు అద్భుత పనితీరు కనబర్చారు. గోడలను గానుగ సున్నం, కోడిగుడ్ల సొనతో నిర్మించారు. టేకు చెక్కతో లోపల నిర్మాణం చేశారు. ఆ చెక్కపై చెక్కిన వివిధ ఆకృతులకు లక్కపూత పూశారు. ఈ నిర్మాణం నేటికీ చూపరులను విశేషంగా ఆకట్టుకుంటుండటం విశేషం.

ఆరుబయటే.. బండి ముత్యాలమ్మ



బండి ముత్యాలమ్మ అమ్మవారు

ప్రజాశక్తి - మొగల్తూరు

యాత్రికుల పాలిట కొంగుబంగారం బండిముత్యాలమ్మ, మద్రాసు నుంచి ఇక్కడకు వచ్చిన అమ్మవారికి ఆరుబయటే నివాసం. సుమారు వందేళ్లకిందట ఉమ్మడి మద్రాసు రాష్ట్రంగా ఉండగా, ముత్యాలపల్లి ప్రాంతంలో ప్రజల నుంచి వసూలు పన్ను, నగదు, లెన్నాప్రగడ వంశానికి చెందిన కరణం, దాసరి వారి వంశానికి చెందిన మునసబులు ఆ శిస్తు సొమ్ము చెల్లించడానికి పడవలపై మద్రాసు వెళ్లారు. ఆ సమయంలో అక్కడ తీరంలో బసచేసిన మునసబు, కరణాల వద్ద నగదు లెక్క చాలలేదు. దిగులుగా నిద్రించిన వారిరువురికీ బండిముత్యాలమ్మ కలలో దర్శనమిచ్చి ఆ సమస్య తీరుస్తానని అభయమిచ్చారు. వారు విశ్రాంతి తీసుకున్న సమీపంలోనే రాళ్ల రూపంలో ఉన్న తనను వెంట తీసుకువెళ్లమని అమ్మవారు సూచించారు. నిద్రనుంచి మేల్కొని వారివద్దనున్న నగదు లెక్క చూసేసరికి సరిపోవడంతో సంతోషంగా పన్నుల నగదు బ్రిటీషు ప్రభుత్వ ప్రతినిధికి చెల్లించారు. రాళ్ల రూపంలో ఉన్న అమ్మవారిని వారివెంట తీసుకువచ్చారు. అమ్మవారి సూచనలమేరకు ఆ రాళ్లను ముత్యాలపల్లిలోని తాటిచెట్టుకింద ప్రతిష్ఠించారు. అప్పటి నుంచి సముద్రతీర ప్రాంత గ్రామాల ప్రజలు అమ్మవారిని వారి ఇంట ఆడబడుచుగా కొలుస్తున్నారు. అమ్మవారి దర్శన భాగ్యంతోనే తమ కష్టాలు తీరతాయని భక్తుల విశ్వాసం. ప్రతి మూడేళ్లకు ఒక పర్యాయం నిర్వహించే అమ్మవారి జాతరకు ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి లక్షలాది మంది భక్తులు తరలివస్తుంటారు.

ప్రత్యామ్నాయ జర్నలిజానికి ప్రతీక ప్రజాశక్తి

(4వ పేజీ నుంచి)

విచ్ఛిన్నం, 1992లో బాబ్రీ మసీదు విధ్వంసం వంటి సందర్భాల్లో ప్రజాశక్తి నిర్వహించిన పాత్ర దాన్ని ప్రగతిశీల లౌకిక శక్తులకు మరింత దగ్గర చేసింది.

మరిన్ని ఎడిషన్లు

1994లో హైదరాబాదు ఎడిషన్ ప్రారంభమైంది. ఇది తెలుగులో వామపక్ష పత్రికల చరిత్రలో కొత్త అధ్యాయం. తర్వాత కాలంలో ప్రత్యేక సంచికలు మరింత ఎక్కువగా వచ్చాయి. పత్రిక ఎనిమి ది పేజీలైంది. శీర్షికలు పెరిగాయి. కంప్యూటర్ కేంద్రాలు పెరిగాయి. 1997లో విశాఖపట్నంలో మూడో ఎడిషన్ మొదలైంది. 1999లో పత్రిక కేంద్ర కార్యాలయం విజయవాడ నుంచి హైదరాబాద్‌కు మారింది.

కొత్త పుంతలు

2000లో నాటి చంద్రబాబు ప్రభుత్వం పెంచిన విద్యుత్ ఛార్జీలకు వ్యతిరేకంగా సాగిన ఉద్యమంతో ప్రపంచీకరణ వ్యతిరేక పోరాటాలతో ప్రజాశక్తి పూర్తిగా మమేకమైంది. యంత్రాంగం విస్తరించింది. చిరకాలంగా ఉన్న లోగో సహా అనేక మార్పులు జరిగాయి. 2001లో 20వ వార్షికోత్సవంలో తిరుపతి ఎడిషన్ మొదలైంది. ఇక ఆ తర్వాత చకచకా ఎడిషన్లు పెరిగాయి. ఖమ్మం, కర్నూలు, రాజమండ్రి, కరీంనగర్, ఒంగోలు, రాష్ట్ర విభజన అనంతరం శ్రీకాకుళం, అనంతపురం ఎడిషన్లు వచ్చాయి. 2004 నుంచి జిల్లాల టాబ్లాయిడ్స్ కూడా మొదలయ్యాయి. సిబ్బంది పెరిగారు. పెరిగిన యంత్రాంగం, పునాది, మారిన దృక్పథం ఇవన్నీ ప్రజాశక్తిని తెలుగు పత్రికా లోకంలో ఒక విలక్షణ ప్రగతిశీల పత్రికను చేశాయి.

కరోనా కష్టకాలం

కరోనా కష్టకాలంలో పత్రిక తీవ్ర ఒడిదుడుకులకు లోనైంది. అనివార్యంగా ఇతర పత్రికలతో పాటు టాబ్లాయిడ్ నిలిపివేసి మెయిన్‌లోనే రెండు బ్రాడ్ పేజీలు జిల్లా వార్తలకు కేటాయించి నడిపింది. సిబ్బంది కరోనా బారిన పడినా.. ఆర్థిక ఇబ్బందులు ముసురుకున్నా వెరవకుండా సిబ్బంది అకుంఠిత దీక్షతో ప్రజల సహకారంతో పత్రికను నిర్విరామంగా తీసుకొచ్చారు. సాధారణ పరిస్థితులు ఏర్పడ్డాక మళ్లీ టాబ్లాయిడ్ పునరుద్ధరణకు ప్రయత్నాలు చేస్తోంది. దానిలో భాగంగా ఇప్పటికే విజయవాడ, గుంటూరు, ఒంగోలు, విశాఖపట్నం ఉమ్మడి జిల్లాల్లో టాబ్లాయిడ్ తీసుకొస్తున్నారు. కొత్త జిల్లాల ఏర్పాటు తర్వాత ఆర్థిక భారమైనా వెరవకుండా కొత్త జిల్లాల ప్రాతిపదికనే పేజీలు తీసుకొస్తున్నారు. ఎన్ని ఆటంకాలు.. ప్రతిబంధకాలు ఎదురైనా, ఆర్థిక సమస్యలు చుట్టుముట్టినా ప్రజల అండదండలే శ్వాసగా ప్రజాశక్తి 'ప్రతి అక్షరం.. ప్రజల పక్షం' నినాదానికి కట్టుబడి పురోగమిస్తుంది.

ఓ వైపు సేవలు... మరో వైపు ఉద్యోగం

భవిష్యత్తులో మరెన్నో సేవా కార్యక్రమాలు చేస్తా : కొవ్వలి యతిరాజా రామ్మోహన్‌నాయుడు

ప్రజాశక్తి - నరసాపురం

ఆయన వయసు చిన్నదే కానీ ఆయన ఆశయం పెద్దది... సాయం అని అడిగిన ప్రతి వ్యక్తికీ ఆయన సహాయం అందిస్తారు. ఆయనకంటూ నరసాపురంలో ఒక సైన్యం కూడా ఏర్పాటు చేసుకున్నారు. ఒక పక్క విదేశాల్లో ఉద్యోగం... మరో పక్క జన్మభూమి పైనా మమకారం... నరసాపురం తీర ప్రాంతంలో అభివృద్ధి ధ్యేయంగా పెట్టుకున్నారు కొవ్వలి ఫౌండేషన్ ఛైర్మన్, టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి కొవ్వలి యతిరాజా రామ్మోహన్‌నాయుడు.


యువగళం పాదయాత్రలో నారా లోకేష్‌తో కొవ్వలి

నరసాపురం పట్టణానికి చెందిన కొవ్వలి అయ్యన్ననాయుడు, కృష్ణవేణి దంపతుల కుమారుడు కొవ్వలి రామ్మోహన్‌నాయుడు. నరసాపురం వైఎన్ కళాశాలలో ఇంటర్ చదివి ఆ తర్వాత చెన్నై యూనివర్సిటీలో ఏరోనాటికల్ ఇంజినీరింగ్ పూర్తి చేశారు. ఆయన వృత్తిరీత్యా ఐటీ రంగాల్లో స్థిరపడి అమెరికాలో ఉంటారు. ఆయన విదేశాల్లో ఉంటూనే స్థానిక రాజకీయల్లో, సేవా కార్యకలాపాల్లో తన వంతుగా సహాయం అందిస్తున్నారు.

2014 నరసాపురం మున్సిపాలిటీ ఎన్నికల్లో టిడిపి తరపున ఎవరూ పోటీకి ముందుకు రాని సమయంలో కొవ్వలి రామ్మోహన్‌నాయుడు సోదరి పసుపులేటి రత్నమాలను నిలబెట్టి గెలిపించుకున్నారు. ఆ సమయం నుంచి నాయుడు పార్టీలో క్రియాశీలకంగా వ్యవహారించారు. 2022 ఆగస్టు 2న తన కుమార్తె శ్రేయ పుట్టిన రోజున కొవ్వలి ఫౌండేషన్ ఏర్పాటు చేశారు. తొలిసారిగా ఫౌండేషన్ ఏర్పాటు చేసిన తర్వాత గుండె ఆపరేషన్ నిమిత్తం రూ.నాలుగు లక్షల చెక్కును అందించారు. ఏడాదిలో ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తూ జనం మది గెలిచి రామ్మోహన్‌నాయుడు ప్రజల మధ్యలో నిలిచారు. చదువుకునే విద్యార్థులకు నోటు పుస్తకాలు, ఉన్నతి చదువులు చదివే విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, ప్రతిభ చూపించే విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందిస్తున్నారు. చదువు పూర్తయిన విద్యార్థులకు పలు ప్రయివేట్ కంపెనీలో ఉపాధికి సైతం నాయుడు సిఫార్సు చేస్తున్నారు. 2022 గోదావరికి వరదలు వచ్చిన సమయంలో బాధితులకు నిత్యావసర సరుకులు, కాయగూరలు అందించారు. ప్రతినెలా పేద కుటుంబాలకు నిత్యావసర సరుకులు అందిస్తున్నారు. వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతూ మందులు వాడుతున్న కుటుంబాలకు ప్రతినెలా మందులు అందిస్తున్నారు. నరసాపురం పట్టణంలో వ్యాపారం చేసుకుంటూ ఎండ బారిన పడుతున్న చిరు వ్యాపారులకు గొడుగులు సైతం కొవ్వలి ఫౌండేషన్ అందించింది. వికలాంగులకు మూడు చక్రాల సైకిల్ కమోడ్స్ బ్యాటరీ వెహికలు అందించారు. నియోజకవర్గంలోని వికలాంగులకు కృత్రిమ అవయవాలు అందించి అండగా నిలిచారు. అగ్ని ప్రమాదంలో ఇల్లు కోల్పోయిన బాధితులకు అతి స్వల్ప సమయంలో అత్యవసరంగా ఇల్లులు సైతం నిర్మించారు. ప్రతినెలా ఒకరు చొప్పున ఫౌండేషన్ ప్రారంభించినప్పటి నుంచి ఇప్పటివరకు 25 పైగా ఆపరేషన్లు ట్రస్ట్ తరపున చేయించి జనం మదిలో నిలిచారు. ట్రస్ట్ తరపున కంటి, గుండె, లివర్ వంటి ఆపరేషన్లు చేయించారు. ట్రస్ట్ ద్వారా ఆపరేషన్ చేయించుకుంటున్న పేషెంట్ల పట్ల ట్రస్ట్ తరపున నాయుడు సోదరి ట్రస్ట్ ట్రెజరరీ జయలక్ష్మి ప్రత్యేక శ్రద్ధ తీసుకుని వారి ఆరోగ్య పరిస్థితిని డాక్టర్, నర్సులు ఆసుపత్రి సిబ్బంది ద్వారా ఎప్పటికప్పుడు తెలుసుకుంటారు. నరసాపురం నియోజకవర్గంలో పలు ప్రాంతాల్లో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసి, మందులు సైతం అందించారు. వ్యాపారాలు చేసుకునే పేదలకు అండగా కొవ్వలి తరపున బడ్డీలు సైతం అందించారు.

నరసాపురం పట్టణం మెయిన్ రోడ్డులో రామాలయం పున:ప్రతిష్టకు తన తరపున రూ.75 లక్షలు అందించారు. నరసాపురంలోని కాపు కళ్యాణ మండపానికి రూ.రెండు కోట్ల విరాళం అందించి కల్యాణ మండపాన్ని ఆధునీకరించారు. ఇలా కొవ్వలి నాయుడు ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తూ వచ్చారు. ఒకపక్క సేవా కార్యక్రమాలు చేసుకుంటూ మరోపక్క రాజకీయాల్లో రామ్మోహన్‌నాయుడు ముందుకు సాగిపోతున్నారు. టిడిపి నిర్వహించిన మహానాడు కార్యక్రమానికి రెండుసార్లు రూ.10.20 లక్షలు అందించారు. 40 ఏళ్ల నరసాపురం టిడిపి రాజకీయాల్లో పార్టీ కార్యాలయం లేదని గ్రహించి నాయుడు సొంత ఖర్చుతో ఆఫీసును ఏర్పాటు చేశారు. 2021 మున్సిపల్ ..8లో


వ్యాధి గ్రస్తులకు మందులు అందిస్తున్న రామ్మోహన్ నాయుడు


కొవ్వలి యతిరాజా రామ్మోహన్‌నాయుడు రక్తదానం

శాస్త్రీయ ఆలోచన నేటి అవసరం

మనిషి నిస్సహాయ స్థితిలో ఉన్నప్పుడు మొదట ప్రకృతిని ఆరాధించడం మొదలుపెట్టాడు. ఈ ఆరాధన భక్తి, మతం ఆవిర్భావానికి బాటలు వేసింది. మతం విజ్ఞానానికి బదులు అజ్ఞానాన్ని ప్రజల్లో నింపింది. మూఢనమ్మకాలు, చేతబడులు, క్షుద్ర పూజలు, మంత్ర తంత్రాలు మొదలైనవి మతం సృష్టించిన అజ్ఞానంలో నుంచి పుట్టినవే. ఇప్పటికీ మారుమూల గ్రామాల్లో, ప్రాంతాల్లో ఈ మూఢనమ్మకాలను పాటిస్తున్నారు. కొన్ని సందర్భాలలో అవి హత్యలకు కూడా దారి తీస్తున్నాయి. శాస్త్ర సాంకేతిక రంగం అభివృద్ధి చెందుతున్న నేటి సమాజంలో మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా సైంటిఫిక్ టెంపర్ (శాస్త్రీయ దృక్పథం)పై ప్రజల్లో అవగాహన కల్పించాలి. భారతదేశ మొదటి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ మొదటిసారిగా సైంటిఫిక్ టెంపర్ అనే పదాన్ని "ద డిస్కవరీ ఆఫ్ ఇండియాలో" ప్రస్తావించారు. హేతువాది, రచయిత డా॥నరేంద్ర దభోల్కర్ మూఢనమ్మకాలు, చేతబడి పద్ధతులను నిర్మూలించడానికి సైంటిఫిక్ టెంపర్‌ను ప్రచారం చేయడానికి గొప్ప కృషి చేశారు. మంత్రాల ద్వారా వ్యాధులు నిర్మూలిస్తామని చెప్పుకునే స్వామీజీలకు, తాంత్రికులకు వ్యతిరేకంగా ప్రచారం చేయడమే కాకుండా "మూఢనమ్మకాలు, చేతబడి వ్యతిరేక ఆర్డినెన్స్"ను రూపొందించడంలో కీలక పాత్ర పోషించారు. మతం అజ్ఞానాన్ని ప్రచారం చేస్తే సైన్స్ విజ్ఞానాన్ని ప్రచారం చేస్తుంది. ఈ రెండూ ఒకదానికొకటి పూర్తిగా వ్యతిరేకం. సైన్సును ప్రచారం చేస్తున్నాడని నరేంద్ర దభోల్కర్‌ను 2013 ఆగస్టు 20న సనాతన్ అనే సంస్థ ఆయనను హత్య చేసింది. ఆయన హత్యకు గురయిన రోజును "నేషనల్ సైంటిఫిక్ టెంపర్ డే"గా పాటించాలని "ఆలిండియా పీపుల్స్ సైన్స్ నెట్‌వర్క్" పిలుపునిచ్చింది.

ఇప్పటికే మన దేశంలో అనేక మూఢనమ్మకాలు పాటిస్తున్నవారు అధిక సంఖ్యలో ఉన్నారు. బోలే బాబా పాద 'ధూళి' (స్థానిక పరిభాషలో రాజ్) సేకరించి, దానిని వంటికి రాసుకుంటే శరీరంలో ఉన్న రోగాలన్నీ నయం అవుతాయని ప్రజలను నమ్మించారు. అలా ఆ ధూళిని సేకరించడానికి వెళ్లి 121 మంది ప్రాణాలు కోల్పోయారు. ఒక కుటుంబంలో ఏదైనా కష్టం వస్తే ఎవరైనా చనిపోతే దానికి కారణం ఇంటి నిర్మాణం వాస్తు ప్రకారం జరగలేదని ఎవరో చెప్తే ఎందుకు? ఏమిటి? అని ఆలోచించకుండా లక్షలు పెట్టి కట్టుకున్న ఇంటిని కూల్చి కొత్త ఇల్లు కడుతున్నారు. అంతెందుకు? గతంలో తెలంగాణ ముఖ్యమంత్రి కూడా వాస్తు బాగోలేదని నూతన సెక్రటేరియట్ భవనాన్ని ఏర్పాటు చేశారు. చేతి రేఖలను బట్టి భవిష్యత్తు చెప్తామంటారు. అసలు చేతులే లేనివాళ్ళు ఎందరో ఉన్నారు. వారికి అసలు భవిష్యత్తు ఉండదా! నికోలాస్ జేమ్స్ విజిసిక్ లాంటి వాళ్ళు ఎందరో చేతులు లేనప్పటికీ గొప్ప గొప్ప విజయాలు సాధించారు. కాబట్టి చేతి రేఖలు భవిష్యత్తును తెలపవు. మానసికంగా అనారోగ్యానికి గురైన వారు వింతగా ప్రవర్తిస్తుంటారు. వీరికి చేతబడి జరిగిందంటూ, దెయ్యం పట్టిందంటూ నిర్ణయించేసి వారిని కట్టి పడేయడం, చిత్రహింసలకు గురి చేయడం చూస్తున్నాం. మానసికంగా స్థిరంగా లేని వారిని మరింతగా మానసికంగా, శారీరకంగా హింసించి పిచ్చివారిని చేస్తుంటారు. జ్వరం వస్తే చర్చి ఫాదర్ దగ్గరకు వెళ్తారు. ఆయన కొంచెం రొట్టె, జూస్ ఇచ్చి ప్రార్థన చేసి 'తగ్గిపోతుందిలే' అంటే నమ్మేస్తారు. కాని అదే ఫాదర్‌కి జ్వరం వస్తే హాస్పిటల్‌కి వెళ్లి వైద్యం చేయించుకుంటారు. బలిస్తే స్వర్గానికి వెళ్తామని, ఐశ్వర్యం కలుగుతుందనే మూఢనమ్మకంతో నరబలులు ఇస్తుంటారు. ఆర్థిక శ్రేయస్సు కలుగుతుందని నరబలి ఇవ్వాలని మాంత్రికుడు చెప్తే మంత్ర విద్యలో భాగంగా ఇద్దరు మహిళలను కిడ్నాప్ చేసి తలలు నరికి గుంతలో పూడ్చి పెట్టారొక చోట. ఇంకొక దగ్గర స్వర్గానికి వెళ్తారంటే కన్న బిడ్డలనే చంపుకున్న మూర్ఖులున్నారు ఈ దేశంలో. ఫ్యాన్సీ నెంబర్ ఉంటే లక్ష్మీదేవి ప్రాప్తిస్తుందంటూ లక్షలు పెట్టి ఫ్యాన్సీ మొబైల్ నెంబర్లు కొనుక్కునే తంతు ఇప్పుడు నడుస్తున్నది. మొబైల్ నెంబర్లే కాదు. వాహనాలకు ఫ్యాన్సీ నెంబర్ కోసం వేలకు వేలు ఖర్చు పెడుతున్నారు. ఇలా ఒకటి కాదు. చెప్పుకుంటూ పోతే కోకొల్లలు.

భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 51 ఏ సబ్ సెక్షన్ 11 ప్రకారం ప్రతి పౌరుడు శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకోవాలి. కానీ ఇది ఆచరణలో అమలు కావడం లేదు. సాధారణ ప్రజలే కాదు. శాస్త్రవేత్తలు, ప్రభుత్వం కూడా ఈ భావనలను విస్మరిస్తున్నది. శాస్త్ర, సాంకేతికతను ఉపయోగించి శాస్త్రవేత్తలు రాకెట్లను తయారు చేస్తున్నారు. కాని ముందుగా దేవాలయంలో పూజలు చేసిన అనంతరం దీన్ని ప్రయోగిస్తున్నారు. ప్రయోగం సక్సెస్ అయితే వీరి ఖాతాలో వేసుకుంటున్నారు. ఫెయిల్ అయితే దేవుడి ఖాతాలో వేసేస్తున్నారు. బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత శాస్త్రీయ భావాలకు బదులు అశాస్త్రీయ భావాలను ఎక్కువగా విస్తరింప చేస్తున్నది. సాక్షాత్తు ప్రధానమంత్రి నేషనల్ సైన్స్ కాంగ్రెస్‌లో మాట్లాడుతూ కౌరవులు కుండలో పుట్టారని, అదే టెస్ట్ ట్యూబ్ బేబీ అని చెప్పారు. విమానాన్ని రైట్ సోదరులు కనిపెట్టక ముందే పుష్పక విమానం ఉండేదని అందులో ఎంతమంది ఎక్కినా ఇంకొకరికి చోటు ఉంటుందని అన్నారు. ఉంటే ఆ విమానం ఏమైనట్టు? ఎక్కడికి ఎగిరిపోయినట్టు? శివుడు వినాయకునికి ఏనుగు తల పెట్టాడని, అదే ప్లాస్టిక్ సర్జరీ అని ప్రస్తావించారు. వాస్తవానికి మనిషికి జంతువు తలను పెట్టి సర్జరీ చేయడం సాధ్యమా? కరోనా పోవాలంటే ఆవు మూత్రాన్ని తాగాలని ఆర్‌ఎస్‌ఎస్ ప్రచారం చేసింది. ఇప్పుడు బిజెపి ఆవు మాత్రం, పేడలో ఆక్సిజన్ ఉంటుందని పరిశోధనలు చేయమంటున్నది. జ్యోతిష్యాన్ని, వాస్తు శాస్త్రాలను యూనివర్సిటీలో బోధించాలంటోంది. ఇది మూఢనమ్మకాలను నిర్మూలించడం కాకుండా మరింతగా వాటి వైపు ప్రేరేపించేలా చేస్తున్నది. ప్రపంచం మొత్తం సైన్స్‌ను నమ్ముకుని పరిశోధన చేస్తుంటే...భారతదేశం మాత్రం వేదాలు, ఆవు పేడ, జ్యోతిష్యం, వాస్తు వంటి మూఢనమ్మకాలపై పరిశోధనలు చేసి ఏం సాధించాలనుకుంటున్నది? బిజెపి నేరుగా అశాస్త్రీయ భావాలను ప్రజల మెదళ్లలో ఎందుకు నింపాలనుకుంటున్నది? అనే విషయానికి వస్తే సైన్స్ ప్రజలను విజ్ఞానవంతులను చేస్తుంది. మత విశ్వాసాలకు, మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా మరో కోపర్నికస్ గాని, బ్రూనో గాని తయారవుతారు. అటువంటి వారు మతం నుండి పుట్టిన విశ్వాసాలను ప్రశ్నిస్తారు. భావాజాల ప్రచారంలో మతోన్మాదం, మత భావాలు సైన్స్‌కు పూర్తి వ్యతిరేకంగా ఉంటాయి. కావున ఈ రెండింటి మధ్య నిరంతరం ఘర్షణ జరుగుతూ ఉంటుంది. నేడు శాస్త్రీయ దృక్పథాన్ని ప్రజల్లో విస్తరింపచేసేందుకుగాను విద్యార్థులు, యువత, మేధావులు జన విజ్ఞాన వేదిక వంటి సంస్థలతో కలిసి పనిచేయాల్సిన అవసరం ఎంతైనా వుంది.

ఓ వైపు సేవలు... మరో వైపు ఉద్యోగం

(ఏడో పేజీ నుంచి)

ఎన్నికల్లో ఆయన తనవంతుగా పార్టీ గెలుపు కోసం ఎంతో కృషి చేశారు. 2024 ఎన్నికల ముందు మూడేళ్ల నుంచి ఇండియాలో ఉంటూ నరసాపురం రాజకీయాల్లో క్రియాశీలకంగా పని చేశారు. 2024 సాధారణ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించుకుని టిడిపి జాతీయ అధ్యక్షుడు, సిఎం చంద్రబాబునాయుడు, మంత్రి లోకేష్ దృష్టిలో ఉన్నారు. ఇటీవల ఎన్నికల అనంతరం కొవ్వలి యతిరాజా రామ్మోహన్‌నాయుడుకు టిడిపి రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి పదవి అందించారు. మరికొన్ని రోజుల్లో ఇటీవల చేసిన కృషి తగ్గట్టుగా నామినేట్ పోస్ట్ తగిన గుర్తింపు ఇవ్వనున్నట్లు సమాచారం. ప్రజాసేవ చేయాలనే సంకల్పంతో నాయుడు ట్రస్ట్ ఏర్పాటు చేసి ఎన్నో సేవా కార్యక్రమాలు చేశారు. భవిష్యత్తులో మరెన్నో సేవా కార్యక్రమాలు చేపడతానని రామ్మోహన్ నాయుడు చెప్పారు.



కొవ్వలి ట్రస్ట్ తరుపున నిర్మించిన ఇల్లు వద్ద నాయుడు

ఉద్యమాల మార్గదర్శి, అక్షరాల రూపశిల్పి ఎంహెచ్



మోటూరు హనుమంతరావు.. ఎం.హెచ్ గా సుపరిచితులైన మోటూరు ఒక నిస్వార్థ ప్రజా నాయకుడు. కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత. సమర్థుడైన సంపాదకుడుగా, శక్తివంతమైన రచయితగా, ఉగ్రూతలూపే ఉపన్యాసకుడుగా బహుముఖ ప్రజ్ఞాశాలి. సమిష్టి తత్వాన్ని అమలు జరిపిన క్రమశిక్షణా శీలి. అవగాహనలో, అనుభవంలో ఆరితేరినా తరాల అంతరం లేకుండా అందరితో ఆప్యాయంగా అభిమానంగా మెలిగిన అనురాగమూర్తి. సహచరులనూ, కార్యకర్తలనూ సామాన్య ప్రజలనూ సదా ఆదరిస్తూ సార్థక జీవితం గడిపిన సంయమనశీలి. రాజకీయ వ్యక్తిగత హుందాతనానికి అర్థం చెప్పిన సంస్కారి. ఆటుపోట్లకు, అవరోధాలకు తల వంచని ధీశాలి. తెలుగు నాట ఎందరో రాజకీయ నేతలూ, పాత్రికేయ ప్రముఖులూ ప్రసిద్ధులూ వున్నా ఇన్ని ప్రత్యేకతల కలబోత గనకే ఎం.హెచ్ అందరి గౌరవం పొందగలిగారు. ప్రగతిశీల కళాసాహిత్య ఉద్యమాలపై ఆయనది ప్రత్యేక ముద్ర. గుంటూరు (ప్రస్తుతం బాపట్ల) జిల్లా వెల్లటూరులో 1917లో పుట్టిన మోటూరు బాల్యంలోనే స్వాతంత్ర్య పోరాటం సామ్యవాద ఆశయాల వైపు ఆకర్షితులై ఆఖరి శ్వాస వరకూ అచంచలంగా కొనసాగారు. ఎం.హెచ్. వ్యాసాలు రాయడం, అనువాదాలు చేయడం 1941-42 రహస్య కాలంలో ప్రారంభించారు. తొలి ప్రజాశక్తి 1948లో పాలక వర్గాల నిషేధానికి గురైన తర్వాత ఉద్యమావసరాల కోసం జనత అనే పత్రిక తీసుకువచ్చే ప్రయత్నం జరిగినప్పుడు దాని తొలి సంపాదకీయం రాశారు గానీ ఇంతలోనే అరెస్టయ్యారు. బొమ్మారెడ్డి, ప్రసిద్ధ రచయిత గంగినేని వెంకటేశ్వరరావు దాన్ని నిర్వహిం చారు. ఈ సంగతి కూడా చాలా దశాబ్దాలు గడిచాక అనుకోకుండా జనత తొలి పలుకు చదివి ఇది మీ శైలిలా వుందని అడిగితే ఆయ నకు ఇదంతా గుర్తుకు వచ్చింది. 1952 ఏప్రి ల్‌లో ప్రజాశక్తి స్థానంలో విశాలాంధ్ర ఏర్పడింది. అదే 1952లో మంత్రి కల్లూరి చంద్రమౌళిని ఓడించి రేపల్లె నుంచి తొలిసారి శాసనసభకు ఎన్నికైన ఎం.హెచ్ ఏడాదిలోనే విశాలాంధ్ర సంపాదకుడయ్యారు. సాహిత్య పత్రికా విషయాల్లో పేరెన్నిక గన్న అప్పటి సంపాదకుడు మద్దుకూరి చంద్రశేఖరరావు (చంద్రం) ఉమ్మడి పార్టీ రాష్ట్ర కార్యదర్శి కావడంతో ఎం.హెచ్ సంపాదక బాధ్యత స్వీకరించారు. తర్వాత దాదాపు అర్థ శతాబ్ది పాటు ఆయన వివిధ రూపాల్లో ఉద్యమ పత్రికల నిర్వహణ, రూపకల్పన, రచనల్లో కీలక పాత్ర వహించారు. 2001లో కన్ను మూసిన ఎం.హెచ్ జీవిత విశేషాలను జూన్ 18న వర్ధంతి సందర్భంగా ప్రజాశక్తి గుర్తు చేసింది. ఈ అవార్డు ప్రదానం సందర్భంగా పత్రికా రంగానికి సంబంధించిన కోణాలు చెప్పుకుందాం.

కలమే కరవాలంగా....

1953-55 తన సంపాదకత్వం మూడు పువ్వులూ ఆరు కాయలుగా సాగిందని ఎం.హెచ్ అనేవారు. తన చెణు కులూ వ్యాఖ్యలూ విమర్శలూ పదునుగా నడిచేవి. తెలుగు నుడికారంలో సహజ సిద్ధమైన పట్టు గల ఎం.హెచ్ కలాన్ని చాలా వాడిగా వాడేవారు. దాదాపు అధికారంలోకి వచ్చేంత బలంతో కమ్యూనిస్టు పార్టీ కాంగ్రెస్‌ను హోరాహోరీ సవాలు చేస్తున్న నిత్య రాజకీయ పోరాటం. తీవ్ర సంఘర్షణ. అలాంటి దశలో ఎం.హెచ్ సంపాదకీయా లతో పాటు కంచు కాగడా శీర్షిక, పలుకులూ ములుకులూ వంటి శీర్షికలు నిర్వహిం చేవారు. నార్ల వెంకటేశ్వరరావు నాటి ఆంధ్రప్రభతో సహా కమ్యూనిస్టులపై చేసే దాడిని ఎదుర్కోవలసిన దశ. ఇప్పటి వివాదాల కంటే సూటిగా కమ్యూనిస్టులను ఓడించమంటూ పిలుపునిచ్చేవారు. ఇతర కారణాలకు తోడు ఈ దుష్ప్రచారాలూ పని చేసి 1955 ఎన్నికలలో కమ్యూనిస్టులు అధికారంలోకి రాకపోయినా 35 శాతం ఓట్లు తెచ్చుకోగలి గారు. కొందరిలో ఆ నిరుత్సాహం, సైద్ధాంతిక విభేదాల మధ్య ఎం.హెచ్ సంపాదక బాధ్యతల నుంచి తప్పుకోవడం, ఉద్యమం కోసం మళ్లీ బాధ్యతలు తీసుకోవడం చేస్తూ వచ్చారు. ఏమైనా ఆయన రచనల పదును ఇంకా నిశితమవుతూ వచ్చింది. ఆ సమయంలోనే విశాలాంధ్ర నిర్వహణలో డివి సుబ్బారావు, గోళ్ల రాధాకృష్ణమూర్తి, ఎల్. జోగారావు వంటి వారు ముఖ్య పాత్ర వహించారు. భారత్ చైనా సరిహద్దు వివాదం, కమ్యూనిస్టు ఉద్యమ అంతర్గత పరిణామాల నేపథ్యంలో ప్రభుత్వం ఎం.హెచ్ తో సహా నాయకులను నిర్బంధించింది. ఈ ఒడుదు డుకుల మధ్య డివి సుబ్బారావు కీలక కృషి తో ఎబికె ప్రసాద్ సంపాదకుడుగా జనశక్తి వారపత్రిక ప్రారంభమైంది. కొద్ది కాలంలోనే డివిఎస్, ఎబికె కూడా అరెస్టవడంతో బయట వున్న నండూరి ప్రసాదరావు, బొమ్మారెడ్డి తదితరుల సాయంతో దాన్ని నిర్వహించారు. తీవ్ర క్యాన్సర్‌కు గురైన డివిఎస్‌ను ఎంతో ఒత్తిడి తర్వాత విడుదల చేసినా...1966లో డిటెన్యూగానే కన్నుమూసిన త్యాగజీవి డివిఎస్‌ను ఎం.హెచ్ ఎప్పుడూ గుర్తు చేసేవారు.

మళ్లీ ప్రజాశక్తికి స్వాగతం!

1967 ఎన్నికల నాటికి జనశక్తిని దినపత్రికగా నడపాలని ఎం.హెచ్, జోగారా వు రాజ్‌కోట వెళ్లి ముద్రణ యంత్రాన్ని కొనుక్కొచ్చారు. ఈ లోగా ఉద్యమంలో మరోసారి వచ్చిన విభేదాలతో జనశక్తి యాజమాన్యం మారడంతో సిపిఎం ఆధ్వర్యంలో 1968 జనవరి 27 ప్రజాశక్తి వారపత్రికగా పున:ప్రారంభమైంది. 1966 నుంచి 1982 వరకూ సిపిఎం రాష్ట్ర కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించిన ఎం.హెచ్ ఈ సమయంలోనూ కీలకమైన రచనలు చేశారు. బొమ్మారెడ్డి సంపాదకుడుగా వెలువడిన ప్రజాశక్తి వారపత్రికలో తొలుత పాటూరు రామయ్య వుండగా కొంత కాలం వాసిరెడ్డి సత్యనారాయణ పనిచేశారు. తుమ్మల వెంకట సుబ్బయ్య మేనేజరుగా వుండేవారు. 1975లో ఎమర్జన్సీ సమయంలో ఆయన రవి, అంజి వంటి తన పాత కలం పేర్లతో చేసిన రచనలు ఎంతో ప్రభావ శీలంగా వుండేవి. వాటిలో రాజు వెడలె... అంటూ సంజయ్ గాంధీపై చేసిన వ్యంగ్య రచన వంటివి నాటి పాఠకులు మర్చిపోలేరు. 1977 తర్వాత నేనూ వారపత్రికలో చేరాను. అప్పటికి ఎం.హెచ్, బొమ్మారెడ్డి అరవైలలో వుంటే నేను అప్పుడే ఇరవై దాటుతున్న స్థితి. అయినా ఎంతగానో ఆదరించి ప్రోత్సహించారు. కాలమంతటా ఎడాపెడా సైద్ధాంతిక పెడ ధోరణులపై ఆయన గొప్ప పోరాటం చేశారు. 1981 ఆగష్టు 1న ప్రజాశక్తి దినపత్రికగా ..14లో

శాస్త్రీయ ఆలోచన నేటి అవసరం

మనిషి నిస్సహాయ స్థితిలో ఉన్నప్పుడు మొదట ప్రకృతిని ఆరాధించడం మొదలుపెట్టాడు. ఈ ఆరాధన భక్తి, మతం ఆవిర్భావానికి బాటలు వేసింది. మతం విజ్ఞానానికి బదులు అజ్ఞానాన్ని ప్రజల్లో నింపింది. మూఢనమ్మకాలు, చేతబడులు, క్షుద్ర పూజలు, మంత్ర తంత్రాలు మొదలైనవి మతం సృష్టించిన అజ్ఞానంలో నుంచి పుట్టినవే. ఇప్పటికీ మారుమూల గ్రామాల్లో, ప్రాంతాల్లో ఈ మూఢనమ్మకాలను పాటిస్తున్నారు. కొన్ని సందర్భాలలో అవి హత్యలకు కూడా దారి తీస్తున్నాయి. శాస్త్ర సాంకేతిక రంగం అభివృద్ధి చెందుతున్న నేటి సమాజంలో మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా సైంటిఫిక్ టెంపర్ (శాస్త్రీయ దృక్పథం)పై ప్రజల్లో అవగాహన కల్పించాలి. భారతదేశ మొదటి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ మొదటిసారిగా సైంటిఫిక్ టెంపర్ అనే పదాన్ని "ద డిస్కవరీ ఆఫ్ ఇండియాలో" ప్రస్తావించారు. హేతువాది, రచయిత డా॥నరేంద్ర దభోల్కర్ మూఢనమ్మకాలు, చేతబడి పద్ధతులను నిర్మూలించడానికి సైంటిఫిక్ టెంపర్‌ను ప్రచారం చేయడానికి గొప్ప కృషి చేశారు. మంత్రాల ద్వారా వ్యాధులు నిర్మూలిస్తామని చెప్పుకునే స్వామీజీలకు, తాంత్రికులకు వ్యతిరేకంగా ప్రచారం చేయడమే కాకుండా "మూఢనమ్మకాలు, చేతబడి వ్యతిరేక ఆర్డినెన్స్"ను రూపొందించడంలో కీలక పాత్ర పోషించారు. మతం అజ్ఞానాన్ని ప్రచారం చేస్తే సైన్స్ విజ్ఞానాన్ని ప్రచారం చేస్తుంది. ఈ రెండూ ఒకదానికొకటి పూర్తిగా వ్యతిరేకం. సైన్సును ప్రచారం చేస్తున్నాడని నరేంద్ర దభోల్కర్‌ను 2013 ఆగస్టు 20న సనాతన్ అనే సంస్థ ఆయనను హత్య చేసింది. ఆయన హత్యకు గురయిన రోజును "నేషనల్ సైంటిఫిక్ టెంపర్ డే"గా పాటించాలని "ఆలిండియా పీపుల్స్ సైన్స్ నెట్‌వర్క్" పిలుపునిచ్చింది.

ఇప్పటికే మన దేశంలో అనేక మూఢనమ్మకాలు పాటిస్తున్నవారు అధిక సంఖ్యలో ఉన్నారు. బోలే బాబా పాద 'ధూళి' (స్థానిక పరిభాషలో రాజ్) సేకరించి, దానిని వంటికి రాసుకుంటే శరీరంలో ఉన్న రోగాలన్నీ నయం అవుతాయని ప్రజలను నమ్మించారు. అలా ఆ ధూళిని సేకరించడానికి వెళ్లి 121 మంది ప్రాణాలు కోల్పోయారు. ఒక కుటుంబంలో ఏదైనా కష్టం వస్తే ఎవరైనా చనిపోతే దానికి కారణం ఇంటి నిర్మాణం వాస్తు ప్రకారం జరగలేదని ఎవరో చెప్తే ఎందుకు? ఏమిటి? అని ఆలోచించకుండా లక్షలు పెట్టి కట్టుకున్న ఇంటిని కూల్చి కొత్త ఇల్లు కడుతున్నారు. అంతెందుకు? గతంలో తెలంగాణ ముఖ్యమంత్రి కూడా వాస్తు బాగోలేదని నూతన సెక్రటేరియట్ భవనాన్ని ఏర్పాటు చేశారు. చేతి రేఖలను బట్టి భవిష్యత్తు చెప్తామంటారు. అసలు చేతులే లేనివాళ్ళు ఎందరో ఉన్నారు. వారికి అసలు భవిష్యత్తు ఉండదా! నికోలాస్ జేమ్స్ విజిసిక్ లాంటి వాళ్ళు ఎందరో చేతులు లేనప్పటికీ గొప్ప గొప్ప విజయాలు సాధించారు. కాబట్టి చేతి రేఖలు భవిష్యత్తును తెలపవు. మానసికంగా అనారోగ్యానికి గురైన వారు వింతగా ప్రవర్తిస్తుంటారు. వీరికి చేతబడి జరిగిందంటూ, దెయ్యం పట్టిందంటూ నిర్ణయించేసి వారిని కట్టి పడేయడం, చిత్రహింసలకు గురి చేయడం చూస్తున్నాం. మానసికంగా స్థిరంగా లేని వారిని మరింతగా మానసికంగా, శారీరకంగా హింసించి పిచ్చివారిని చేస్తుంటారు. జ్వరం వస్తే చర్చి ఫాదర్ దగ్గరకు వెళ్తారు. ఆయన కొంచెం రొట్టె, జూస్ ఇచ్చి ప్రార్థన చేసి 'తగ్గిపోతుందిలే' అంటే నమ్మేస్తారు. కాని అదే ఫాదర్‌కి జ్వరం వస్తే హాస్పిటల్‌కి వెళ్లి వైద్యం చేయించుకుంటారు. బలిస్తే స్వర్గానికి వెళ్తామని, ఐశ్వర్యం కలుగుతుందనే మూఢనమ్మకంతో నరబలులు ఇస్తుంటారు. ఆర్థిక శ్రేయస్సు కలుగుతుందని నరబలి ఇవ్వాలని మాంత్రికుడు చెప్తే మంత్ర విద్యలో భాగంగా ఇద్దరు మహిళలను కిడ్నాప్ చేసి తలలు నరికి గుంతలో పూడ్చి పెట్టారొక చోట. ఇంకొక దగ్గర స్వర్గానికి వెళ్తారంటే కన్న బిడ్డలనే చంపుకున్న మూర్ఖులున్నారు ఈ దేశంలో. ఫ్యాన్సీ నెంబర్ ఉంటే లక్ష్మీదేవి ప్రాప్తిస్తుందంటూ లక్షలు పెట్టి ఫ్యాన్సీ మొబైల్ నెంబర్లు కొనుక్కునే తంతు ఇప్పుడు నడుస్తున్నది. మొబైల్ నెంబర్లే కాదు. వాహనాలకు ఫ్యాన్సీ నెంబర్ కోసం వేలకు వేలు ఖర్చు పెడుతున్నారు. ఇలా ఒకటి కాదు. చెప్పుకుంటూ పోతే కోకొల్లలు.

భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 51 ఏ సబ్ సెక్షన్ 11 ప్రకారం ప్రతి పౌరుడు శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకోవాలి. కానీ ఇది ఆచరణలో అమలు కావడం లేదు. సాధారణ ప్రజలే కాదు. శాస్త్రవేత్తలు, ప్రభుత్వం కూడా ఈ భావనలను విస్మరిస్తున్నది. శాస్త్ర, సాంకేతికతను ఉపయోగించి శాస్త్రవేత్తలు రాకెట్లను తయారు చేస్తున్నారు. కాని ముందుగా దేవాలయంలో పూజలు చేసిన అనంతరం దీన్ని ప్రయోగిస్తున్నారు. ప్రయోగం సక్సెస్ అయితే వీరి ఖాతాలో వేసుకుంటున్నారు. ఫెయిల్ అయితే దేవుడి ఖాతాలో వేసేస్తున్నారు. బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత శాస్త్రీయ భావాలకు బదులు అశాస్త్రీయ భావాలను ఎక్కువగా విస్తరింప చేస్తున్నది. సాక్షాత్తు ప్రధానమంత్రి నేషనల్ సైన్స్ కాంగ్రెస్‌లో మాట్లాడుతూ కౌరవులు కుండలో పుట్టారని, అదే టెస్ట్ ట్యూబ్ బేబీ అని చెప్పారు. విమానాన్ని రైట్ సోదరులు కనిపెట్టక ముందే పుష్పక విమానం ఉండేదని అందులో ఎంతమంది ఎక్కినా ఇంకొకరికి చోటు ఉంటుందని అన్నారు. ఉంటే ఆ విమానం ఏమైనట్టు? ఎక్కడికి ఎగిరిపోయినట్టు? శివుడు వినాయకునికి ఏనుగు తల పెట్టాడని, అదే ప్లాస్టిక్ సర్జరీ అని ప్రస్తావించారు. వాస్తవానికి మనిషికి జంతువు తలను పెట్టి సర్జరీ చేయడం సాధ్యమా? కరోనా పోవాలంటే ఆవు మూత్రాన్ని తాగాలని ఆర్‌ఎస్‌ఎస్ ప్రచారం చేసింది. ఇప్పుడు బిజెపి ఆవు మూత్రం, పేడలో ఆక్సిజన్ ఉంటుందని పరిశోధనలు చేయమంటున్నది. జ్యోతిష్యాన్ని, వాస్తు శాస్త్రాలను యూనివర్సిటీలో బోధించాలంటోంది. ఇది మూఢనమ్మకాలను నిర్మూలించడం కాకుండా మరింతగా వాటి వైపు ప్రేరేపించేలా చేస్తున్నది. ప్రపంచం మొత్తం సైన్స్‌ను నమ్ముకుని పరిశోధన చేస్తుంటే...భారతదేశం మాత్రం వేదాలు, ఆవు పేడ, జ్యోతిష్యం, వాస్తు వంటి మూఢనమ్మకాలపై పరిశోధనలు చేసి ఏం సాధించాలనుకుంటున్నది? బిజెపి నేరుగా అశాస్త్రీయ భావాలను ప్రజల మెదళ్లలో ఎందుకు నింపాలనుకుంటున్నది? అనే విషయానికి వస్తే సైన్స్ ప్రజలను విజ్ఞానవంతులను చేస్తుంది. మత విశ్వాసాలకు, మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా మరో కోపర్నికస్ గాని, బ్రూనో గాని తయారవుతారు. అటువంటి వారు మతం నుండి పుట్టిన విశ్వాసాలను ప్రశ్నిస్తారు. భావాజాల ప్రచారంలో మతోన్మాదం, మత భావాలు సైన్స్‌కు పూర్తి వ్యతిరేకంగా ఉంటాయి. కావున ఈ రెండింటి మధ్య నిరంతరం ఘర్షణ జరుగుతూ ఉంటుంది. నేడు శాస్త్రీయ దృక్పథాన్ని ప్రజల్లో విస్తరింపచేసేందుకుగాను విద్యార్థులు, యువత, మేధావులు జన విజ్ఞాన వేదిక వంటి సంస్థలతో కలిసి పనిచేయాల్సిన అవసరం ఎంతైనా వుంది.

ఓ వైపు సేవలు... మరో వైపు ఉద్యోగం

(ఏడో పేజీ నుంచి)

ఎన్నికల్లో ఆయన తనవంతుగా పార్టీ గెలుపు కోసం ఎంతో కృషి చేశారు. 2024 ఎన్నికల ముందు మూడేళ్ల నుంచి ఇండియాలో ఉంటూ నరసాపురం రాజకీయాల్లో క్రియాశీలకంగా పని చేశారు. 2024 సాధారణ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించుకుని టిడిపి జాతీయ అధ్యక్షుడు, సిఎం చంద్రబాబునాయుడు, మంత్రి లోకేష్ దృష్టిలో ఉన్నారు. ఇటీవల ఎన్నికల అనంతరం కొవ్వలి యతిరాజా రామ్మోహన్‌నాయుడుకు టిడిపి రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి పదవి అందించారు. మరికొన్ని రోజుల్లో ఇటీవల చేసిన కృషి తగ్గట్టుగా నామినేట్ పోస్ట్ తగిన గుర్తింపు ఇవ్వనున్నట్లు సమాచారం. ప్రజాసేవ చేయాలనే సంకల్పంతో నాయుడు ట్రస్ట్ ఏర్పాటు చేసి ఎన్నో సేవా కార్యక్రమాలు చేశారు. భవిష్యత్తులో మరెన్నో సేవా కార్యక్రమాలు చేపడతానని రామ్మోహన్ నాయుడు చెప్పారు.


కొవ్వలి ట్రస్ట్ తరుపున నిర్మించిన ఇల్లు వద్ద నాయుడు



అక్షరాల పూదోట..

పెన్మెత్స రంగరాజ జెడ్‌పి ఉన్నత పాఠశాల

ఎందరో విద్యావంతులను తీర్చిదిద్దిన ఘనత

ప్రజాశక్తి - మొగల్తూరు

దాతృత్వంతో వికసిస్తున్న అక్షరాల పూదోట మొగల్తూరులోని పెన్మెత్స రంగరాజ జెడ్‌పి ఉన్నత పాఠశాల. భీమవరం గ్రామీణ మండలం వెంప గ్రామానికి చెందిన పెన్మెత్స రంగరాజ సుమారు 70 ఏళ్ల కిందట మొగల్తూరులో స్థిరపడ్డారు. ఆయన స్థానికులను సమన్వయం చేసి ఉన్నత పాఠశాల ఏర్పాటుకు కృషి చేశారు. సుమారు ఆరు ఎకరాల స్థలం విరాళంగా అందించి పాఠశాలను నెలకొల్పారు.

ఎందరో ప్రతిభావంతులు వెలుగులోకి..

మొగల్తూరులోని పెన్మెత్స రంగరాజ జెడ్‌పి ఉన్నత పాఠశాలలో చదువుకున్న వందలాది మంది విద్యార్థులు దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషించారు. జన్మభూమికి, బంగారు భవితకు బాటలు వేసిన పాఠశాలకు ఘనకీర్తిని తీసుకు వచ్చారు. షార్(సతీష్ ధావన్ స్పేస్ సెంటర్) డైరెక్టర్‌గా పనిచేసిన ఎంవైఎస్.ప్రసాద్, చలనచిత్ర రంగంలో స్టార్‌గా వెలుగొందిన కీర్తిశేషులు, కేంద్రమంత్రి, రెబల్ స్టార్ ఉప్పలపాటి వెంకటకృష్ణంరాజు, సినీ స్టార్ మెగాస్టార్, పద్మశ్రీ కొణిదల చిరంజీవి, రక్షణ, ఇతర రంగాల్లో రాణించిన పలువురు ఈ పాఠశాల ముద్దు బిడ్డలే.

ఇదే పాఠశాలలో చదువుకున్నాను

వర్ధమాని రవిశంకర్ సర్కార్, ప్రధానోపాధ్యాయులు, పెన్మెత్స రంగరాజ జెడ్‌పి ఉన్నత పాఠశాల, మొగల్తూరు



మొగల్తూరులో ఉన్నత పాఠశాల ఏర్పాటు చేయడంతో వందలాది మంది చదువుకునేందుకు అవకాశం దక్కింది. నేను కూడా ఇదే పాఠశాలలో చదువుకుని ఉపాధ్యాయ వృత్తిలో ప్రవేశించి, ఇదే పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నాను. నాలాగే ఎంతోమంది వైద్యులు, శాస్త్రవేత్తలు, ఇంజనీర్లు, పలు రంగాలకు చెందిన ప్రముఖులు ఈ పాఠశాలలోనే చదువుకున్నారు. పూర్వ విద్యార్థుల కమిటీ ఏర్పాటు చేసి పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తున్నారు. దీనిలో భాగంగానే మరమ్మతులు, ఆట స్థలం కూడిక, తదితర వాటిని విద్యార్థులకు కావలసిన సౌకర్యాలు కల్పిస్తున్నాం.

ముందు చూపుతో పాఠశాల ఏర్పాటు

పువ్వాడ రాజా, పాఠశాల పూర్వ విద్యార్థి



విద్యతోనే అభివృద్ధి సాధ్యమని ముందే గుర్తించిన రంగరాజ గ్రామంలో పాఠశాల ఏర్పాటు చేశారు. స్థానికులను సమన్వయం చేసుకొని, ఆయన దాతృత్వంతో పాఠశాలను నెలకొల్పారు. ఈ పాఠశాలలో ఆనాటి నుంచి నేటి వరకు వేలాది మంది చదువుకుని జీవితంలో స్థిరపడ్డారు.

మేము ఈ పాఠశాలలోనే చదువుకున్నాం

ఎంవైఎస్.పసాద్, విశ్రాంత డైరెక్టర్



మా తండ్రిగారు మలపాక రామ సూర్యనారాయణమూర్తి(ఎంఆర్‌ఎస్ మూర్తి) ఇదే పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేసేవారు. నేను, మా అన్నదమ్ములు, కుటుంబ సభ్యులు ఇదే పాఠశాలలో చదువుకున్నాము. ఉన్నత స్థాయికి ఎదిగాము. ఆనాడు గురువులు, శిష్యుల మధ్య మంచి సంబంధం ఉండేది. అహర్నిశలు విద్యార్థుల అభ్యున్నతి కోసమే ఉపాధ్యాయులు కృషి చేసేవారు. ఈ పాఠశాల పూర్వ విద్యార్థిగా చెప్పుకోవడం నాకు చాలా ఆనందంగా ఉంది.



పచ్చళ్లకు పెరుగుతున్న ఆదరణ



మన్నా సల్వా పికిల్ సెంటర్

అందుబాటులో శాఖాహార, మాంసాహార పచ్చళ్లు - తణుకు నుంచి విదేశాలకూ ఎగుమతి

ప్రజాశక్తి - తణుకు

ఒకప్పుడు ఉమ్మడి కుటుంబాల వారు సంవత్సరానికి సరిపడా ఊరగాయ పచ్చళ్లు పట్టేవారు. కాని మారుతున్న కాలంతో పాటు ఆహారపు అలవాట్లలో కూడా మార్పులు వచ్చాయి. ఇంట్లో భోజనం చేసేటప్పుడు, వివాహది శుభకార్యాల్లో ఎదురుగా పంచభక్ష పరమాన్నాలు ఉన్నా... పచ్చడి లేనిదే ముద్ద దిగని వారూ చాలామంది ఉంటారు. అలాంటి వారి కోసం కొందరు ప్రత్యేకంగా పచ్చళ్లు తయారు చేసి అమ్ముతున్నారు. శాఖాహార పచ్చళ్లతో పాటు మాంసాహార పచ్చళ్లనూ అందుబాటులో ఉంచుతున్నారు. తణుకు పట్టణంలో ఇలాంటి దుకాణాలు సుమారు పది ఉన్నాయి.



ఒకప్పుడు పచ్చళ్లు కేవలం గ్రామీణ ప్రాంతాల్లోనే తయారయ్యేవి. ఊరగాయ అంటే శాఖాహార పచ్చళ్లే ఎక్కువగా పట్టేవారు. ఇప్పుడు పట్టణ ప్రాంతాల్లోనూ శాఖాహార, మాంసాహార పచ్చళ్లు అందరిచేత లొట్టలేయిస్తున్నాయి. ఊరగాయ పచ్చడి పట్టాలంటే ఒకప్పుడు మహిళలు ఎంతో శ్రమ పడేవారు. ఇప్పుడు ప్యాకెట్లలో ఎక్కువ కాలం నిల్వ ఉండే పచ్చళ్లను విక్రయించే దుకాణాలు వెలిశాయి.

తణుకు నుంచి విదేశాలకు..

తణుకు పట్టణంలో తయారయ్యే ఊరగాయ పచ్చళ్లు విదేశాలకు ఎగుమతి అవుతున్నాయి. పట్టణంలో పచ్చళ్లు విక్రయించే దుకాణాలు పది వరకు ఉన్నాయి. వాటిలో 15వ వార్డు వీరభద్రపురంలోని మన్నా సల్వా నాన్‌వెజ్ పికిల్ హోమ్ ప్రత్యేక గుర్తింపు పొందింది. ఈ దుకాణం నుంచి విదేశాలకు ఎక్కువ శాతం పచ్చళ్లు ఎగుమతి అవుతున్నాయి. మన ప్రాంతానికి చెందిన వారు అమెరికా, కువైట్, దుబాయ్ నుంచి వచ్చిన వారు తిరుగు ప్రయాణంలో పచ్చళ్లను తీసుకెళుతున్నారు. అక్కడి వారికి రుచి చూపించడంతో విదేశీయులు మళ్లీమళ్లీ వీటిని కావాలని అడుగుతున్నట్లు కొనుగొలుదారులతో పాటు నిర్వాహకులు చెబుతున్నారు.

స్థానికంగా ఆదరణ

తణుకు పట్టణంతో పాటు జిల్లాలోని పలు పట్టణాలు ఏలూరు, తాడేపల్లిగూడెం, భీమవరం, నరసాపురం, పాలకొల్లు, నిడదవోలు నుంచి కూడా ఇక్కడి పచ్చళ్లను తీసుకెళ్తున్నారు. ఇతర ప్రాంతాల నుంచి ఉద్యోగ, వ్యాపార, విద్య కోసం ఎక్కువ మంది వస్తుంటారు. ఈ పచ్చళ్లపై ఎక్కువగా మక్కువ చూపిస్తున్నారు.



ఎన్నో వెరైటీల పచ్చళ్లు

ఒకప్పుడు పచ్చడి అంటే ఆవకాయ, మాగాయ, ఉసిరికాయ, పండుమిరపకాయ ఉండేవి. మారుతున్న భోజన ప్రియుల అభిరుచి మేరకు ఎన్నో రకాల పచ్చళ్లు అందుబాటులోకి వచ్చాయి. మాంసాహార ప్రియుల కోసం నాటుకోడి, కోడి, మటన్, రొయ్య, చేప, పీత, కొరమేను పచ్చళ్లు, రొయ్య కారప్పొడి వంటివి విక్రయ దుకాణాల్లో దొరుకుతున్నాయి. వీటితో పాటు శాఖాహారుల కోసం వివిధ కాయగూరల పచ్చళ్లతో పాటు కాకరకాయ కారప్పొడి, ఇడ్లీ కారప్పొడి, కందిపొడి, శొంఠి పొడి , కరివేపాకు పొడి లభిస్తున్నాయి.





ప్రత్యేక ప్యాకింగ్‌లలో...

పచ్చళ్లు ఎక్కువ కాలం నిల్వ ఉండేలా నాణ్యతతో కూడిన సామగ్రి వాడుతున్నట్లు విక్రయ నిర్వాహకులు చెబుతున్నారు. మాంసాహార పచ్చళ్లు రెండు నెలలు, శాఖాహార పచ్చళ్లు సంవత్సరం పాటు నిల్వ ఉంటాయని తెలిపారు. ప్రత్యేక ప్యాకింగ్‌లలో ఈ పచ్చళ్లు లభ్యమవుతున్నాయి.

ఆదరణ పెరగడంతో బ్రాంచిలను ఏర్పాటు చేశాం

హోమ్ యాజమాని, ప్రొపరయిటర్ ఎమ్‌డి. అబ్దుల్ రహమాన్

రుచి, శుచి బాగుండటంతో పచ్చళ్లకు ఆదరణ పెరిగింది. పశ్చిమగోదావరి జిల్లాతో పాటు తూర్పుగోదావరి జిల్లా నుంచి కొనుగోలుదారులు వస్తున్నారు. ఇటీవలి కాలంలో విదేశాలకు వెళ్లేవారు వీటిని ఎక్కువగా తీసుకెళుతున్నారు. వీరభద్రపురంలోని షాపుతో పాటు, ప్రయాణికులకు అందుబాటులో ఉండే విధంగా తణుకు రైల్వే స్టేషన్ రోడ్డులో, తేతలి వై-జంక్షన్ వద్ద, తణుకు ఉండ్రాజవరం రోడ్డు వద్ద బ్రాంచిలను ఏర్పాటు చేశాము.













ఒపిఎస్ మాత్రమే న్యాయబద్ధం

కేంద్ర ప్రభుత్వం యు.పి.ఎస్ పథకం గురించిన వివరాలను కొద్దికొద్దిగా బయట పెడుతోంది. మొత్తం పథకం వివరాలు ప్రకటించినప్పుడు మాత్రమే అందులోని కుట్రను బహిర్గతం చేయగలం.యు.పి.ఎస్ పథకం 31.3.2025 తేదీన, ఆ తరువాత పదవీ విరమణ చేసే ఉద్యోగులకు వర్తిస్తుంది. 1.4.2025 నుండీ అమలు చేస్తారు. ఎన్.పి.ఎస్ పథకంలో సిబ్బంది వేతనం నుండీ 10 శాతం రికవరీ చేస్తారు. పెన్షన్ ఫండ్‌కు ప్రభుత్వం 14 శాతం చెల్లిస్తుంది. ఈ మొత్తం పెన్షన్ ఫండ్ షేర్ మార్కెట్‌లో మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడి పెడతారు. అందులో వచ్చే లాభాలు కూడా పెన్షన్ ఫండ్‌కు జమ చేస్తారు. పదవీ విరమణ చేసే సమయంలో ఈ ఫండ్ నుండి ఉద్యోగి 60 శాతం తీసుకోవచ్చు. మిగిలిన 40 శాతం మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడి పెట్టి అందులో వచ్చే లాభాల్లో నుంచి పెన్షన్ ఇస్తారు. పెన్షనర్, జీవిత భాగస్వామి ఇద్దరూ మరణించిన తరువాత 40 శాతం పైకం వారసులకు చెల్లిస్తారు.









యు.పి.ఎస్ పథకంలో వేతనం నుండి 10 శాతం రికవరీ కొనసాగుతుంది. ప్రభుత్వం 18.5 శాతం చెల్లిస్తుంది. అంటే మొత్తం 28.5 శాతం పైకం పెన్షన్ ఫండ్‌కు జమ చేయాలి కదా. కానీ 10 ప్లస్ 10, 20 శాతం మాత్రమే ఫండ్‌కు జమ చేస్తారట. మిగిలిన 8.5 శాతంతో ప్రభుత్వం ప్రత్యేక ఖాతా ఏర్పాటు చేస్తుందట. మార్కెట్ పెట్టుబడుల్లో లాభాలు తగ్గితే అందులోంచి బదిలీ చేస్తారట. ఉద్యోగి పెన్షన్ ఫండ్ అకౌంట్‌లో ఉన్న మొత్తం పైకం ప్రభుత్వం తీసుకుని, పెన్షనర్‌కు గ్యారెంటీ పెన్షన్, అనంతరం జీవిత భాగస్వామికి గ్యారంటీ ఫ్యామిలీ పెన్షన్ అమలు చేస్తారట. ఇరువురి మరణం తరువాత మిగిలిన 40 శాతం వారసులకు ఇవ్వరట. ప్రభుత్వ ఖాతా లోకి వెళ్లిపోతుంది. ఉద్యోగికి 25 సంవత్సరాల సర్వీస్ వుంటే అతని పెన్షన్ ఫండ్‌లో వుండే మొత్తం సొమ్ము ప్రభుత్వం తీసుకోవడానికి అతడు అంగీకరిస్తే, అతడి పదవీ విరమణకు ముందు చివరి 12 నెలల సరాసరి బేసిక్ వేతనంలో 50 శాతం గ్యారెంటీ పెన్షన్ ఇస్తారు. ఓ.పి.ఎస్ పథకంలో 10 సంవత్సరాల సర్వీస్ వుంటే చాలు. సర్వీస్ చివరి నెల మూల వేతనంలో 50 శాతం గ్యారెంటీ పెన్షన్ అమలులో వుంది.

ఎన్.పి.ఎస్ పథకంలో రికవరీ చేసే 24 శాతంలో 60 శాతం పదవీ విరమణ సమయంలో తీసుకునే వెసులుబాటు ఉంది కదా. యు.పి.ఎస్ పథకంలో 20 శాతంలో మాత్రమే 60 శాతం పొందే వీలు వుంటుంది. అంటే ఫండ్ నుండి 60 శాతం తీసేసుకుంటే 40 శాతం మాత్రమే పెన్షన్ లభిస్తుంది. ఎన్.పి.ఎస్ పథకంలో 50 శాతం పెన్షన్ వుండదు. గ్యారెంటీ లేదు.

పాతిక సంవత్సరాల సర్వీస్ వుంటే 50 శాతం పెన్షన్ లభిస్తుంది. ఇరవై సంవత్సరాల సర్వీస్ వుంటే ఆ మేరకు పెన్షన్ తగ్గిస్తారు. అంటే 40 శాతం మాత్రమే పెన్షన్ వుంటుంది. పది సంవత్సరాల సర్వీస్ వుంటే మూల వేతనంలో 20 శాతం మాత్రమే పెన్షన్ వస్తుంది. కనీస పెన్షన్ 10 వేలు వుంటుంది. ఓ.పి.ఎస్ పథకంలో కనీస పెన్షన్ రూ.9000.

కుటుంబ పెన్షన్

యు.పి.ఎస్, ఎన్.పి.ఎస్ పథకంలో ఫ్యామిలీ పెన్షన్ జీవిత భాగస్వామి వరకే పరిమితం. పెన్షన్ పైకంలో 60 శాతం పెన్షన్ ఫ్యామిలీ పెన్షన్ కింద చెల్లిస్తారు. పెన్షన్ రూ.50,000 అయితే ఫ్యామిలీ పెన్షన్ రూ.50,000లో 60 శాతం రూ.30,000. పెన్షన్ రూ.10,000 అయితే కుటుంబ పెన్షన్ రూ.60 శాతం అంటే రూ.6000. కనీస పెన్షన్ రూ.10,000 కుటుంబ పెన్షన్‌కు వర్తించదు.

ఓ.పి.ఎస్ పథకంలో పెన్షనర్ మరణిస్తే పదవీ విరమణ చేసిన 7 సంవత్సరాలు లేక ఉద్యోగికి 67 సంవత్సరాలు వచ్చే వరకు, ఏది ముందయితే ఆ తేదీ వరకు, చివరి నెల వేతనంలో 50 శాతం పెన్షన్ చెల్లిస్తారు. ఆ తరువాత 30 శాతం కుటుంబ పెన్షన్ చెల్లించాలి.

కనీస కుటుంబ పెన్షన్ రూ.9000. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల కరువు భత్యం లెక్కలు తీసుకుంటే 1.4.2025 నాటికి 57 శాతం కరువు భత్యం కలుపుకుంటే రూ.14,130 ఇవ్వవలసి వుంటుంది. పెన్షనర్, జీవిత భాగస్వామి కూడా మరణించిన పక్షంలో వారిపై ఆధారపడిన వితంతువు కుమార్తె, విడాకులు పొందిన కుమార్తె, వికలాంగుడైన కుమారుడు, వీరిలో ఒకరికి జీవితాంతం, కుమార్తె పునర్వివాహం వరకు కుటుంబ పెన్షన్ చెల్లిస్తారు. యు.పి.ఎస్, ఎన్.పి.ఎస్ పథకాల్లో ఈ ప్రస్తావనే లేదు. భార్య, భర్తకే పరిమితం.

కరువు భత్యం

ఓ.పి.ఎస్ పథకంలో వుంది. ఎన్.పి.ఎస్ లో లేదు. యు.పి.ఎస్ పథకంలో చేర్చారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు 2016 నుండి ప్రస్తుత కరువు భత్యం లెక్కిస్తున్నారు. 1.4.2025 నాటికి 57 శాతం కరువు భత్యం పెన్షన్‌తో కలిపి ఇస్తారా అన్నది పెద్ద సందేహం. 1.4.2025 నాటికి డి.ఎ లెక్కలు తీయడానికి మరో కొత్త ప్రాతిపదిక తయారు చేసి జీరో నుండి డి.ఎ లెక్కలు ప్రారంభించే అపాయం పొంచి వుంది. లేకుంటే కనీస పెన్షన్ 9000 నుండి యు.పి.ఎస్ లో రూ.10,000 చేసే ప్రతిపాదన ఎలా వచ్చినట్టు? సోమనాథన్ కమిటీ కనికట్టు కాదు కదా! ఇదే జరిగితే 1.4.2025 నుండి అమలయ్యే యు.పి.ఎస్ పథకంలో కరువు భత్యం గురించిన ప్రస్తావన వుండకపోవచ్చు. పెన్షన్ మాత్రమే చెల్లించవచ్చు. మనం ఎదురు చూస్తున్న 57 శాతం కరువు భత్యం ఎండమావి అవుతుందా? కుటుంబ పెన్షన్ రూ.6000 మాత్రమే ఇస్తారా? అందుకనే యు.పి.ఎస్ వద్దు, ఎన్.పి.ఎస్ వద్దు. ఓ.పి.ఎస్ మాత్రమే కావాలి అంటున్నాం.

గ్రాట్యుటీ...

ఐదు సంవత్సరాల సర్వీస్ వున్న ప్రతి ఉద్యోగికి, ప్రతి ఏడాది సర్వీస్‌కు అర్ధ నెల మూల వేతనం, కరువు భత్యం కలిపి గ్రాట్యుటీ కింద ఇస్తారు. అత్యధికంగా 16.5 నెలల వేతనం ఇలా గ్రాట్యుటీ కింద ఇస్తారు. ఓ.పి.ఎస్ లో వున్న ఈ పథకం యు.పి.ఎస్ లో లేదు.

కమ్యుటేషన్

ఓ.పి.ఎస్ పథకంలో నెలసరి పెన్షన్‌లో 40 శాతం చొప్పున 12 సంవత్సరాలకు లెక్కించి మొత్తం పైకం పెన్షనర్‌కు పదవీ విరమణ చేసే సమయంలో ముందస్తుగా చెల్లిస్తారు. 15 సంవత్సరాల తరువాత ఆ 40 శాతం తిరిగి పెన్షన్లో కలిపి ఇస్తారు. ఈ 15 సంవత్సరాలకు కూడా మొత్తం పెన్షన్‌కు కరువు భత్యం వుంటుంది. అంటే ముందుగా తీసుకున్న 40 శాతానికి కూడా. ఈ సదుపాయం ఎన్.పి.ఎస్, యు.పి.ఎస్ పథకాల్లో లేదు.

అదనపు పెన్షన్

ఓ.పి.ఎస్ పథకంలో వయస్సును బట్టి అదనపు పెన్షన్ అందుతుంది. వయస్సు 80 దాటితే 20 శాతం అదనపు పెన్షన్ 85 దాటితే 30 శాతం, 90 దాటితే 40 శాతం, 95 దాటితే 50 శాతం, 100 దాటితే 100 శాతం అదనపు పెన్షన్ అమలులో వుంది. ఈ అదనపు పెన్షన్‌కు కరువు భత్యం వుంటుంది. ఎన్.పి.ఎస్, యు.పి.ఎస్ పథకాల్లో ఈ సదుపాయం లేదు.

పే కమిషన్

ఓ.పి.ఎస్ పథకంలో ప్రతి పే కమిషన్ సిఫార్సులు అమలు చేసే సమయంలో ..14లో

ఉద్యమాల మార్గదర్శి, అక్షరాల రూపశిల్పి ఎంహెచ్



మోటూరు హనుమంతరావు.. ఎం.హెచ్‌గా సుపరిచితులైన మోటూరు ఒక నిస్వార్థ ప్రజా నాయకుడు. కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత. సమర్థుడైన సంపాదకుడుగా, శక్తివంతమైన రచయితగా, ఉర్రూతలూపే ఉపన్యాసకుడుగా బహుముఖ ప్రజ్ఞాశాలి. సమిష్టి తత్వాన్ని అమలు జరిపిన క్రమశిక్షణా శీలి. అవగాహనలో, అనుభవంలో ఆరితేరినా తరాల అంతరం లేకుండా అందరితో ఆప్యాయంగా అభిమానంగా మెలిగిన అనురాగమూర్తి. సహచరులనూ, కార్యకర్తలనూ సామాన్య ప్రజలనూ సదా ఆదరిస్తూ సార్థక జీవితం గడిపిన సంయమనశీలి. రాజకీయ వ్యక్తిగత హుందాతనానికి అర్థం చెప్పిన సంస్కారి. ఆటుపోట్లకు, అవరోధాలకు తల వంచని ధీశాలి. తెలుగు నాట ఎందరో రాజకీయ నేతలూ, పాత్రికేయ ప్రముఖులూ ప్రసిద్ధులూ వున్నా ఇన్ని ప్రత్యేకతల కలబోత గనకే ఎం.హెచ్ అందరి గౌరవం పొందగలిగారు. ప్రగతిశీల కళాసాహిత్య ఉద్యమాలపై ఆయనది ప్రత్యేక ముద్ర. గుంటూరు (ప్రస్తుతం బాపట్ల) జిల్లా వెల్లటూరులో 1917లో పుట్టిన మోటూరు బాల్యంలోనే స్వాతంత్ర్య పోరాటం సామ్యవాద ఆశయాల వైపు ఆకర్షితులై ఆఖరి శ్వాస వరకూ అచంచలంగా కొనసాగారు. ఎం.హెచ్. వ్యాసాలు రాయడం, అనువాదాలు చేయడం 1941-42 రహస్య కాలంలో ప్రారంభించారు. తొలి ప్రజాశక్తి 1948లో పాలక వర్గాల నిషేధానికి గురైన తర్వాత ఉద్యమావసరాల కోసం జనత అనే పత్రిక తీసుకువచ్చే ప్రయత్నం జరిగినప్పుడు దాని తొలి సంపాదకీయం రాశారు గానీ ఇంతలోనే అరెస్టయ్యారు. బొమ్మారెడ్డి, ప్రసిద్ధ రచయిత గంగినేని వెంకటేశ్వరరావు దాన్ని నిర్వహించారు. ఈ సంగతి కూడా చాలా దశాబ్దాలు గడిచాక అనుకోకుండా జనత తొలి పలుకు చదివి ఇది మీ శైలిలా వుందని అడిగితే ఆయనకు ఇదంతా గుర్తుకు వచ్చింది. 1952 ఏప్రిల్‌లో ప్రజాశక్తి స్థానంలో విశాలాంధ్ర ఏర్పడింది. అదే 1952లో మంత్రి కల్లూరి చంద్రమౌళిని ఓడించి రేపల్లె నుంచి తొలిసారి శాసనసభకు ఎన్నికైన ఎం.హెచ్ ఏడాదిలోనే విశాలాంధ్ర సంపాదకుడయ్యారు. సాహిత్య పత్రికా విషయాల్లో పేరెన్నిక గన్న అప్పటి సంపాదకుడు మద్దుకూరి చంద్రశేఖరరావు (చంద్రం) ఉమ్మడి పార్టీ రాష్ట్ర కార్యదర్శి కావడంతో ఎం.హెచ్ సంపాదక బాధ్యత స్వీకరించారు. తర్వాత దాదాపు అర్థ శతాబ్ది పాటు ఆయన వివిధ రూపాల్లో ఉద్యమ పత్రికల నిర్వహణ, రూపకల్పన, రచనల్లో కీలక పాత్ర వహించారు. 2001లో కన్ను మూసిన ఎం.హెచ్ జీవిత విశేషాలను జూన్ 18న వర్ధంతి సందర్భంగా ప్రజాశక్తి గుర్తు చేసింది. ఈ అవార్డు ప్రదానం సందర్భంగా పత్రికా రంగానికి సంబంధించిన కోణాలు చెప్పుకుందాం.

కలమే కరవాలంగా....

1953-55 తన సంపాదకత్వం మూడు పువ్వులూ ఆరు కాయలుగా సాగిందని ఎం.హెచ్ అనేవారు. తన చెణుకులూ వ్యాఖ్యలూ విమర్శలూ పదునుగా నడిచేవి. తెలుగు నుడికారంలో సహజ సిద్ధమైన పట్టు గల ఎం.హెచ్ కలాన్ని చాలా వాడిగా వాడేవారు. దాదాపు అధికారంలోకి వచ్చేంత బలంతో కమ్యూనిస్టు పార్టీ కాంగ్రెస్‌ను హోరాహోరీ సవాలు చేస్తున్న నిత్య రాజకీయ పోరాటం. తీవ్ర సంఘర్షణ. అలాంటి దశలో ఎం.హెచ్ సంపాదకీయాలతో పాటు కంచు కాగడా శీర్షిక, పలుకులూ ములుకులూ వంటి శీర్షికలు నిర్వహించేవారు. నార్ల వెంకటేశ్వరరావు నాటి ఆంధ్రప్రభతో సహా కమ్యూనిస్టులపై చేసే దాడిని ఎదుర్కోవలసిన దశ. ఇప్పటి వివాదాల కంటే సూటిగా కమ్యూనిస్టులను ఓడించమంటూ పిలుపునిచ్చేవారు. ఇతర కారణాలకు తోడు ఈ దుష్ప్రచారాలూ పని చేసి 1955 ఎన్నికలలో కమ్యూనిస్టులు అధికారంలోకి రాకపోయినా 35 శాతం ఓట్లు తెచ్చుకోగలిగారు. కొందరిలో ఆ నిరుత్సాహం, సైద్ధాంతిక విభేదాల మధ్య ఎం.హెచ్ సంపాదక బాధ్యతల నుంచి తప్పుకోవడం, ఉద్యమం కోసం మళ్లీ బాధ్యతలు తీసుకోవడం చేస్తూ వచ్చారు. ఏమైనా ఆయన రచనల పదును ఇంకా నిశితమవుతూ వచ్చింది. ఆ సమయంలోనే విశాలాంధ్ర నిర్వహణలో డివి సుబ్బారావు, గోళ్ల రాధాకృష్ణమూర్తి, ఎల్. జోగారావు వంటి వారు ముఖ్య పాత్ర వహించారు. భారత్ చైనా సరిహద్దు వివాదం, కమ్యూనిస్టు ఉద్యమ అంతర్గత పరిణామాల నేపథ్యంలో ప్రభుత్వం ఎం.హెచ్ తో సహా నాయకులను నిర్బంధించింది. ఈ ఒడుదుడుకుల మధ్య డివి సుబ్బారావు కీలక కృషి తో ఎబికె ప్రసాద్ సంపాదకుడుగా జనశక్తి వారపత్రిక ప్రారంభమైంది. కొద్ది కాలంలోనే డివిఎస్, ఎబికె కూడా అరెస్టవడంతో బయట వున్న నండూరి ప్రసాదరావు, బొమ్మారెడ్డి తదితరుల సాయంతో దాన్ని నిర్వహించారు. తీవ్ర క్యాన్సర్‌కు గురైన డివిఎస్‌ను ఎంతో ఒత్తిడి తర్వాత విడుదల చేసినా...1966లో డిటెన్యూగానే కన్నుమూసిన త్యాగజీవి డివిఎస్‌ను ఎం.హెచ్ ఎప్పుడూ గుర్తు చేసేవారు.

మళ్లీ ప్రజాశక్తికి స్వాగతం!

1967 ఎన్నికల నాటికి జనశక్తిని దినపత్రికగా నడపాలని ఎం.హెచ్, జోగారావు రాజ్‌కోట వెళ్లి ముద్రణ యంత్రాన్ని కొనుక్కొచ్చారు. ఈ లోగా ఉద్యమంలో మరోసారి వచ్చిన విభేదాలతో జనశక్తి యాజమాన్యం మారడంతో సిపిఎం ఆధ్వర్యంలో 1968 జనవరి 27 ప్రజాశక్తి వారపత్రికగా పున:ప్రారంభమైంది. 1966 నుంచి 1982 వరకూ సిపిఎం రాష్ట్ర కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించిన ఎం.హెచ్ ఈ సమయంలోనూ కీలకమైన రచనలు చేశారు. బొమ్మారెడ్డి సంపాదకుడుగా వెలువడిన ప్రజాశక్తి వారపత్రికలో తొలుత పాటూరు రామయ్య వుండగా కొంత కాలం వాసిరెడ్డి సత్యనారాయణ పనిచేశారు. తుమ్మల వెంకట సుబ్బయ్య మేనేజరుగా వుండేవారు. 1975లో ఎమర్జన్సీ సమయంలో ఆయన రవి, అంజి వంటి తన పాత కలం పేర్లతో చేసిన రచనలు ఎంతో ప్రభావ శీలంగా వుండేవి. వాటిలో రాజు వెడలె... అంటూ సంజయ్ గాంధీపై చేసిన వ్యంగ్య రచన వంటివి నాటి పాఠకులు మర్చిపోలేరు. 1977 తర్వాత నేనూ వారపత్రికలో చేరాను. అప్పటికి ఎం.హెచ్, బొమ్మారెడ్డి అరవైలలో వుంటే నేను అప్పుడే ఇరవై దాటుతున్న స్థితి. అయినా ఎంతగానో ఆదరించి ప్రోత్సహించారు. కాలమంతటా ఎడాపెడా సైద్ధాంతిక పెడ ధోరణులపై ఆయన గొప్ప పోరాటం చేశారు. 1981 ఆగష్టు 1న ప్రజాశక్తి దినపత్రికగా ..14లో

కమ్యూనిస్టు పత్రికల పితామహుడు
మద్దుకూరి చంద్రం

కృష్ణాజిల్లా వెంట్రప్రగడలో 1907లో జన్మించిన మద్దుకూరి చంద్రశేఖరరావు స్వాతంత్రోద్యమ సందర్భంగా అనేకసార్లు జైలుశిక్ష అనుభవించారు. ఆ తరువాత అంచెలంచెలుగా కాంగ్రెస్ పార్టీలో ఎదిగి 1935-36లో కృష్ణాజిల్లా కార్యదర్శిగా ఎన్నికయ్యారు. ఆ తర్వాత కొంతకాలం కాంగ్రెస్‌లోనే వామపక్షవాదిగా ఉండి కాంగ్రెస్ సోషలిస్టు పార్టీలో చేరారు. అనంతరం కమ్యూనిస్టు పార్టీలో చేరి నాయకత్వ స్థాయికి ఎదిగారు. కాంగ్రెస్ సోషలిస్టుపార్టీ నాయకత్వంలో 1973లో రాజమండ్రిలో నెలకొల్పిన నవశక్తి వారపత్రికకు మద్దుకూరి చంద్రశేఖరరావు సంపాదకులుగా వ్యవహరించారు. నిర్బంధ కాలంలో రహస్యంగా నిర్వహించిన స్వతంత్ర భారత్‌కు ఆయన సంపాదకుడిగా ఉన్నారు. కమ్యూనిస్టు పార్టీకి బహిరంగంగా పనిచేయడానికి అవకాశాలు ఏర్పడిన తరువాత పార్టీ అధికార పత్రికగా ప్రారంభించబడిన ప్రజాశక్తి వారపత్రికకు 1942 నుండి 45 వరకూ సంపాదకులుగా ఆయన పని చేశారు. 1952లో విశాలాంధ్ర దినపత్రికగా మారినప్పుడు దాని సంపాదకత్వ బాధ్యతలను ఆయన నిర్వహించారు. ప్రారంభంలో ప్రచురించబడిన నవశక్తి, ప్రజాశక్తి, విశాలాంధ్ర పత్రికలకు సంపాదకత్వాన్ని నెరపిన కారణంగా ఆయనను కమ్యూనిస్టు పత్రికల పితామహునిగా పేర్కొన్నారు. పత్రిక సంపాదకుడుగా ఉంటూనే తన వ్యాసాల ద్వారా ఆయన అభ్యుదయ సాహిత్య ఉద్యమానికి ప్రజానాట్యమండలి కృషికి ఎంతగానో తోడ్పడి తెలుగు ప్రజల సాంస్కృతిక పునరుజ్జీవనానికి సహాయపడ్డారు.

ఒపిఎస్ మాత్రమే న్యాయబద్ధం

(12వ పేజీ నుంచి)

పెన్షన్, కనీస పెన్షన్ పెరుగుతుంది. యు.పి.ఎస్, ఎన్.పి.ఎస్ పథకంలో ఈ గ్యారెంటీ లేదు.ఎన్.పి.ఎస్, యు.పి.ఎస్ పథకాల్లో మన పెన్షన్ ఫండ్ పైకం షేర్ మార్కెట్‌లో పెట్టుబడులు పెడతారు. పెట్టుబడులు పతనమైనా కనీస గ్యారెంటీ పెన్షన్ వుంటుందన్న ఊరట మాత్రమే యు.పి.ఎస్ లో వుంది. అనేక ఉద్యమాలు, పోరాటాల ఫలితంగా సాధించిన సదుపాయాలను యు.పి.ఎస్ పథకం అమలైతే మనం కోల్పోవడం తథ్యం. ఓ.పి.ఎస్ మాత్రమే న్యాయమైనది. ఇది ఉద్యోగుల అవసరాలు తీర్చగలిగింది. కరువు భత్యంతో లింక్ చేయబడింది. కుటుంబ పెన్షన్ వుంటుంది. వారసులకు సైతం వర్తిస్తుంది. కనీస పెన్షన్ గ్యారెంటీ కూడా వుంది. కమ్యుటేషన్ సౌకర్యం వుంది. వయసుతో పాటు పెన్షన్ పెరుగుతుంది. ముదిమి వయసులో ఆర్థిక ఆలంబన కల్పిస్తుంది. ప్రస్తుతం 99 లక్షల మంది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులపై యు.పి.ఎస్ పడగ నీడ పడే ప్రమాదముంది.

షేర్ మార్కెట్ పెట్టుబడులు

ఈ 99 లక్షల మంది ఉద్యోగుల పెన్షన్ సొమ్ము రూ.10.50 లక్షల కోట్లు షేర్ మార్కెట్‌లో పెట్టుబడులుగా మారనున్నాయి. ఈ పెట్టుబడులు కార్పొరేట్ పెట్టుబడిదారులకు వరం, అవసరం. వారి సంపద పెంపు కోసం ఉద్యోగుల పొదుపు పైకం తరలించడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. పెన్షన్ గ్యారెంటీ అన్నది ఉద్యోగులను నమ్మించి నట్టేట ముంచే యత్నం. కార్మికుల పైకం మొత్తం తీసేసుకుని, పెన్షన్ ఇస్తారట. ఈ అమౌంట్ బ్యాంక్‌లో పెడితే వడ్డీ ఇస్తారుగా. ఈ నేపథ్యంలో ఓ.పి.ఎస్ పథకం పరిరక్షణ కోసం దేశ వ్యాప్త ఉద్యమం అవసరం. పంజాబ్, హర్యానా ఉద్యోగులు రంగంలోకి ఇప్పటికే వచ్చేశారు. కొన్ని రాష్ట్రాలు ఓ.పి.ఎస్ పథకం కొనసాగిస్తామని ప్రకటించాయి. తమిళనాడు, కేరళ లాంటి రాష్ట్రాల్లో త్వరలో ప్రకటించే సూచనలు కనిపిస్తున్నాయి. పోరాడితే సాధించలేనిది ఏదీ లేదు. యు.పి.ఎస్ వరకు వచ్చిన ప్రభుత్వాన్ని ఓ.పి.ఎస్ వరకు తీసుకు వెళ్ళడం అసాధ్యమేమీ కాదు. సంఘటిత శక్తి ముందు తల వంచాల్సిందే.

ఆర్థిక లోటు

ప్రభుత్వం ఓ.పి.ఎస్ ను అమలు చేయలేని పరిస్థితిలో వుందని కొందరు కుహనా మేధావులు వాదిస్తున్నారు. ఆర్థిక లోటు 3 శాతం మించకూడదని నిర్ణయించినప్పుడు 5.9 శాతానికి పెంచింది ఎందుకు? ఎలా? కేంద్రం కార్పొరేట్ పన్నులు 30 శాతం నుండి 22 శాతానికి తగ్గించింది. కొత్త పెట్టుబడిదారులకు 15 శాతానికి తగ్గించింది. ఏడాదికి 1.50 లక్షల కోట్లు ఆదాయం కోల్పోయింది. కార్పొరేట్ బకాయిలు రూ.17 లక్షల కోట్లు మాఫీ చేసింది. కార్పొరేట్ పెట్టుబడి దారులకు ఇన్సెంటివ్ రూపేణా రూ.2 లక్షల కోట్లు ఇచ్చింది. డబ్బు లేదు అనేది సమస్య కాదు. ఇది వర్గ సమస్య. కార్మికుల సొమ్ములు దోచి పెట్టుబడిదారులను సంతృప్తి పరచడం. మన హక్కుల కొనసాగింపు కోసం ఉద్యమం నిర్మించాల్సిన అవస రం ఆసన్నమైంది. ఉద్యమిస్తే విజయం మనదే.

- ఆర్. ఇలాంగోవన్, దక్షిణ రైల్వే ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) నేత







ఉద్యమాల మార్గదర్శి, అక్షరాల రూపశిల్పి ఎంహెచ్

(13వ పేజీ నుంచి)

మారింది. "వారపత్రికగా సెలవు, దినపత్రికగా మీ సేవకు సిద్ధం. సెలవివ్వవలసిన వారు మీరు, స్వాగతం పలకాల్సిన వారూ మీరే" అని ఎం.హెచ్ రాశారు. ఇందులోనే తన శైలీ విన్యాసం మనం చూడొచ్చు. ఈ కాలంలో శాసనమండలికీ రాజ్యసభకూ కూడా ఎన్నికై సవ్యసాచిగా బాధ్యతలు నిర్వహించారు. "అవి వారపత్రికలయినా, దినపత్రికలయినా, నా పేరిటే అవి నడిచినా నడవకపోయినా నేను జైలులో వున్నా రహస్యంగా వున్నా శాసనసభ్యుడుగా వున్నా పార్టీ కార్యదర్శిగా వున్నా విశాలాంధ్రకూ జనశక్తికీ, ప్రజాశక్తికీ నా రచనలూ సంపాదకీయాలూ అందుబాటులో వుంటూ వచ్చాయి" అని తన జ్ఞాపకాల్లో రాశారు.

ఆయన చూపిన బాటలో..

ప్రజాశక్తి దినపత్రికగా పున:ప్రారం భమైనప్పుడు నడపడం కష్టమని చాలా మంది వ్యాఖ్యానించారుగానీ ఎం.హెచ్ అనుభవం, నాయకత్వ సహకారం దాన్ని విజయవంతంగా విస్తరిం చేందుకు బాట వేశాయి. రాజకీయంగానూ లౌకిక ప్రజాస్వా మ్య పరిరక్షణలో అది ముందు నిలిచింది. మారిన పరిస్థితుల్లో అనేక నూతన ప్రయో గాలు, చొరవల వల్లనే ఇది సాధ్యమైంది. ఉద్యమ పితామహుడైన సుందరయ్య గారు, లావు బాలగంగాధర రావు, కొరటాల సత్యనారాయణ, రాఘవు లు వంటి నాటి కార్యదర్శులు ఈ కృషికి తోడు నిలిచారు. యాజమాన్యంలో మళ్లీ, గోళ్ల రాధాకృష్ణ మూర్తి, తర్వాత వి.కృష్ణయ్య ఆ యా దశల్లో జనరల్ మేనేజర్లుగా ముఖ్య పాత్ర వహించారు. ఇలా ఎందరో సీనియర్లు, యువత, కొత్త వారు పాలుపం చుకున్నారు. గనకే ప్రజాశక్తి నిలదొక్కుకో గలిగింది. ఎన్నో పత్రికలు మూతపడ్డాయి గాని ప్రజాశక్తి నిర్విఘ్నంగా కొనసాగిందంటే ఇదే పునాది. 1990లలో ప్రజాశక్తి పురోగమనం వేగం పుంజుకుంది. ఉద్యమ కుటుంబం నుంచి వచ్చాను గనక చిన్నప్పటి నుంచి ఒక స్ఫూర్తిగా భావిస్తున్న ఎం.హెచ్ వంటి దిగ్గజంతో రెండు దశాబ్దాలు సన్నిహితంగా మెలగడం, కొన్నేళ్లు సహ సంపాదకుడుగా వుండటం నాకు లభించిన గొప్ప అవకాశం. ఆఫీసుకు రాగానే ఆయన గదికి వెళ్లగానే కాఫీ తాగి రాజకీయాలు, సాహిత్యం, చరిత్ర విషయాలు, అనుభవాలు తెలుసుకోవడం మరచిపోలేని అనుభవం. క్లిష్ట పరిస్థితులను, సమస్యలను సమన్వయం చేయగల వాస్తవికత ఆయన స్వంతం. తర్వాత కాలంలో నేను బుక్‌హౌస్ బాధ్యతలకు వెళ్లగా వి.శ్రీనివాసరావు మొదట ఎగ్జిక్యూటివ్ ఎడిటర్‌గా, 2001 తర్వాత పూర్తి స్థాయి సంపాదకుడుగా ప్రజాశక్తి బాధ్యతలు చేపట్టారు. శ్రీనివాసరావు ఢిల్లీ వెళ్లాక ఎస్.వినయ కుమార్ సంపాదకుడుగా పనిచేశారు. 2013లో మళ్లీ నేను పత్రిక సంపాదక బాధ్యతల్లో వుండగా రాష్ట్ర విభజనతో పాటూరు రామయ్య ఎడిటర్‌గా ఎస్.వెంకట్రావు ఎగ్జిక్యూటివ్ ఎడిటర్‌గా ప్రజాశక్తి విజయవాడకు మారింది. 2018 నుంచి ఎం.వి.ఎస్.శర్మ, ప్రస్తుతం తులసీదాస్ సంపాదకులుగా ఎం.హెచ్ ఒరవడిని కొనసాగిస్తూ వస్తున్నారు. మా అందరికీ ప్రేరణ ఎం.హెచ్ అన్నది నిజం. ఆయన కుటుంబం మొత్తం అదే బాటలో కొనసాగించడం మరింత విశేషం.

రాజకీయంగా రాజీ పడని సైద్ధాంతిక స్పష్టత పాటిస్తూనే భిన్నాభిప్రాయాలను గౌరవించడం, ప్రజాస్వామిక ప్రమా ణాలను అనుసరించడం ఇందుకు కారణమైంది. మీడియా విస్తరణ తర్వాత నిట్టనిలువునా చీలిపోయి అసత్యాలు అసభ్యతలు తాండవిస్తున్న నేటి తరుణంలో ఎం.హెచ్ పెట్టిన వరవడి ప్రజాశక్తిని విభిన్నంగా నిలబెట్టగలిగింది. అంతర్జా తీయంగా సోషలిస్టు శక్తులకు ఎదురుదెబ్బ తగిలినప్పుడు, జాతీయంగా మతతత్వ రాజకీయాల ముప్పు ఎదుర్కొనవలసి వచ్చినప్పుడు ఇదే దీక్షా పటిమ ప్రత్యామ్నా యం చూపగలిగింది. రాజకీయంగా విభేదించేవారు కూడా ప్రజాశక్తి విశ్వసనీయతను ప్రశంసిస్తారు. పాలక వర్గాల పాచికలనూ ప్రపంచీకరణ తాకిడిని, మత మార్కెట్ తత్వాల సవాళ్లనూ ఎదుర్కొంటూ ప్రతి అక్షరం ప్రజల పక్షంగా ముందుకు సాగుదాం.

- తె.ర



అమ్మ పాలు.. అమృతం

చనుబాలు పట్టకపోవడమే ఫ్యాషన్‌గా భావిస్తున్న నేటితరం తల్లులు

పోత పాలు పేరిట తల్లి చనుబాలుకు బిడ్డ దూరం

అవగాహన కల్పించడంలో వైద్య ఆరోగ్య శాఖ విఫలం

ప్రజాశక్తి - ఆచంట

బిడ్డను నవ మాసాలు మోసిన కన్నతల్లి బాధ్యత ఆ పసికందు భూమి మీద పడినప్పుడే మొదలవుతుంది. చక్కటి పాపాయి పుట్టిందన్న ఆనందం ఒకవైపు, బిడ్డను ఆరోగ్యంగా పెంచాలన్న ఆందోళన మరోవైపు ఉంటుంది. బిడ్డ ఆరోగ్యంగా పెరగాలంటే మాత్రం తల్లిపాలు తప్పనిసరి. తల్లిపాలు ప్రకృతి ప్రసాదం, దివ్య ఔషధం. పురుడు వచ్చే సమయానికి తల్లికి పాలు ఉత్పత్తి అవుతుంది. అప్పుడే పుట్టిన బిడ్డకి ఏమి తెలియదు కానీ, పాలు తాగే విద్య మాత్రం తెలవడం సృష్టి ధర్మం. కానీ ఇప్పుడా సృష్టి ధర్మానికి విరుద్ధంగా జరుగుతుంది. నేటితరం తల్లులు కొందరు తమ అందం పాడవుతుందనే అపోహతో తమ బిడ్డలకు పాలు ఇవ్వడం లేదు. ఒక దశలో తల్లులు తమ పాలకంటే డబ్బా పాలే బిడ్డకు మంచిదని వాదిస్తున్నారు. పాలు ఇవ్వకపోవడం ఫ్యాషన్‌గా భావిస్తున్నారు. దీంతో నేటితరం బిడ్డలు తల్లిపాలకు దూరం కావడం, డబ్బా పాలకు దగ్గరై ఆరోగ్య సమస్యలతో సతమతమవుతున్నారు. పాల సముద్రాన్ని మదించి దేవతలు అమృతాన్ని పొంది, చిరంజీవులయ్యారని పురాణాలు చెబుతున్నాయి. తల్లి మొదటిసారిగా బిడ్డకు ఇచ్చే పాలలో భగవంతుడు అలాంటి అమృతాన్ని చిన్నారుల కోసం పున : సృష్టించాడని వైద్యులు చెబుతుంటారు. జన్మనిచ్చిన మహిళ తన బిడ్డకు గంటలోపు పట్టించే ముర్రిపాలతో మరణాన్ని దూరం చేసే రోగ నిరోధక శక్తి ఉందని శాస్త్రీయ పరిశోధనలు చెబుతున్నాయి. తల్లి మొదటిసారిగా నిర్ణీత సమయంలో ఇచ్చే పాల ద్వారా శిశువులకు అనేక వ్యాధులను తట్టుకునే శక్తి వస్తుందని పరిశోధనలో వెల్లడైంది. అటువంటి తల్లిపాలను పుట్టే ప్రతి చిన్నారికి తల్లులు అందివ్వడం ద్వారా శిశు మరణాలను తగ్గించడంతో పాటు ఆరోగ్యవంతమైన భావి భారత పౌరులను తీర్చిదిద్దవచ్చనే లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తల్లిపాలపై ప్రసారం చేస్తున్నాయి. అయినా ఇంకా పూర్తిస్థాయిలో మార్పు రావడం లేదనేది స్పష్టమవుతుంది.



ప్రపంచ ఆరోగ్య సంస్థ అంచనాల ప్రకారం అంతరించిపోతున్న తల్లిపాల సంస్కృతి వల్ల యేటా వివిధ రోగాలతో దాదాపు 10 లక్షల మంది చిన్నారులు చనిపోతున్నారని అంచనా. పారిశ్రామికీకరణం ఆరంభైన దశలో పాలపొడులు, డబ్బా పాల ఉత్పత్తి ఎక్కువగా పెరగడం వల్ల చాలామంది తల్లులు డబ్బా పాలపై ఆధారపడి తల్లిపాలు ఇవ్వడం తగ్గించేశారు. దీనివల్ల పిల్లలు నుమోనియా, విరోచనాలు లాంటి వ్యాధులకు గురికావడం సాధారణమైంది. ఈ సమస్యను గుర్తించిన కొన్ని సంస్థలు చిన్న పిల్లల రక్షణ కోసం అనేక ఉద్యమాలు నిర్వహించాయి. అలా మొదలైన ఆ ఉద్యమాల ప్రభావం వల్ల 1990 నాటికి అంతర్జాతీయ పాలపొడుల ఉత్పత్తిదారుల సమైక్య ఆసుపత్రులకు ఉచితంగా పాలపొడులను అందించడం, సబ్సిడీలతో పాలపొడులు అమ్మడం స్వచ్ఛందంగా విరమించడానికి అంగీకరించింది. ఇటలీలోని ఫ్లోరెన్స్ నగరంలో ఇన్నోసెంట్ సెంటర్‌లో 1990లో జులై 30 నుంచి ఆగస్టు ఒకటి వరకు తల్లిపాలపై ఒక అంతర్జాతీయ సమావేశం నిర్వహించారు. ఆ సమావేశంలో ఒక ప్రకటన విడుదల చేశారు. ఆ ప్రకటనను ఇన్నోసెంట్ ప్రకటన అంటారు. ఈ ప్రకటనను పురస్కరించుకొని ప్రపంచవ్యాప్తంగా ఆగస్టు నెల మొదటి వారం రోజుల పాటు తల్లిపాల వారోత్సవాలు యూనిసెఫ్, డబ్ల్యూహెచ్ఒ, బిపిఎన్ఐ వంటి అంతర్జాతీయ, జాతీయ సంస్థల అనుబంధంగా జరుపుకుంటున్నారు. ఆ వారం మినహా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు మిగిలిన రోజుల్లో తల్లిపాలపై ఎటువంటి అవగాహనా కార్యక్రమాలు నిర్వహించడం లేదన్న విమర్శలూ ఉన్నాయి.

తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన..

తల్లిపాల ప్రాముఖ్యతను, విశిష్టతను తెలియజేయడంలో మనము ఇంకా వెనుకబడి ఉన్నట్లు శిశు మరణాల ద్వారా తెలుస్తుంది. ప్రసవించిన గంటలోపు శిశువుకు తల్లిపాలు ఇవ్వాలి. ఇందులో కొలెస్ట్రామ్ ఉంటుంది. కనీసం ఆరు నెలల వరకు బిడ్డలకు తల్లిపాలు పట్టించాలి. పోషకాలలో ప్రధానంగా ఇనుప దాతు లోపం ఎక్కువగా ఉంటుంది. దీనివల్ల రక్తహీనత వస్తున్నట్లు తెలుస్తుంది. అయోడిన్ విటమిన్ ఎ లోపాలు వస్తున్నాయి. శిశువులు తక్కువ బరువుతో పుట్టడానికి ప్రధాన కారణం పోషకాహార లోపమే. గర్భిణులలో రక్తహీనత కారణంగా శిశువులు తక్కువ బరువుతో పుడుతున్నారు. తల్లులకు బిడ్డలకు కావలసినన్ని పాలు రావడం లేదు. బిడ్డలకు పాలిచ్చే తల్లులు తప్పనిసరిగా ఆహారం ఎక్కువగా తీసుకోవాలి. పచ్చని ఆకుకూరలు, కాయ ధాన్యాలు, ఎండబెట్టిన పళ్ళు, మాంసం, చేపలు, కోడిగుడ్లు, తదితర ఆహార పదార్థాల నుంచి శరీరానికి అవసరమైన ఇనుమును పొందవచ్చు.

లాభాలు..

పుట్టిన వెంటనే బిడ్డకు తల్లిపాలు పట్టడం వల్ల బిడ్డకు రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. 25 శాతం ప్రాణాంతక వ్యాధులు, రుగ్మతలను దూరం చేయవచ్చునని నిపుణులు చెబుతున్నారు. నిమోనియా, అతిసారం వంటి వ్యాధులు దగ్గరకు చేరవు. సాధ్యమైనంత ఎక్కువ నెలలు తల్లిపాలు ఇవ్వడం వల్ల రొమ్ము కేన్సర్ వంటి వ్యాధులు వచ్చే అవకాశాలు చాలా తక్కువగా ఉంటాయి.

ముర్రుపాలపై అపోహ వద్దు..

శిశువు పుట్టిన అరగంటలోపే తల్లిపాలు పడితే పిల్లలు జీవితాంతం ఆరోగ్యంగా ఉంటారు. బిడ్డ ఆరోగ్యానికి సీసాపాలు శత్రువు. ఏటా 5 లక్షల మంది పిల్లలు వీటివల్ల చనిపోతున్నట్లు అంచనా. ఆరు నెలలు దాటిన పిల్లలకు కొందరు కేవలం ఆవు, గేదె పాలు ..16లో

ప్రజాశక్తిని మరువకోయి..

ప్రజాశక్తిని చాటేది
ప్రజలను మేలుకొలిపేది
పెద్దోళ్లను పొగడనిది
పేదోళ్లని మరువనిది
ప్రజాశక్తి పత్రికని మరువకోయి
నిరుపేదల కన్నీళ్లను అక్షరాలలో నింపి
తానున్నది నీకొరకని
చాటి చాటి చెప్పనది
ప్రజాశక్తి పత్రికని
మరవకోయి, మరువకోయి
ప్రజా సమస్యలెక్కడున్నా
అక్కడే నేనున్నానని
దశాబ్దాల తరబడి
చాటిచాటి చెబుతున్నది
ప్రజాశక్తి పత్రికని
మరువకోయి, మరువకోయి
కాలానికి అనుగుణంగా
తనను తాను మార్చు కుంటూ
ప్రజలచేతి ఆయుధమై
పరుగులు తీస్తున్నది
ప్రజాశక్తి పత్రికని
మరువకోయి, మరువకోయి
ప్రతి అక్షరం ప్రజల పక్షం
ప్రజాబలమే తన బలముగా
జనులను జాగృతి చేయగా అహర్నిశలు కృషి చేస్తున్నది
ప్రజాశక్తి పత్రికని మరువకోయి,
మరువకోయి
నీదేరా ప్రజాశక్తి.. నీవేరా ప్రజాశక్తి..

ధన్యజీవి.. ఎస్ఆర్ పోలిశెట్టి



ఎస్ఆర్ పోలిశెట్టిగా పిలవబడే త్యాగజీవి పూర్తి పేరు పోలిశెట్టి సీతారామయ్య. ఆయన నరసాపురం తాలుకా కొప్పర్రు గ్రామంలో జన్మించారు. ఎస్ఎస్ఎల్‌సి వరకూ చదువుకున్నారు. తదుపరి సెకండరీ గ్రేడ్ టీచర్ ట్రెయినింగ్ అడవిపాలెం ప్రభుత్వ శిక్షణా సంస్థలో పూర్తి చేశారు. విద్యార్థి దశ నుంచి సమస్యలపై విద్యార్థి ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొనేవారు. స్వాతంత్ర సమరయోధుల కుటుంబంలో జన్మించడం, అందులోనూ కమ్యూనిస్టు కుటుంబం కావడంతో మొదటి నుంచి అనేక ఉద్యమాలతో ఎస్ఆర్ పోలిశెట్టి జీవితం పెనవేసుకుంది. ఉపాధ్యాయ శిక్షణా కాలంలోనే అతి తక్కువగా ఉన్న స్టయిఫండ్ రూ.19ను రూ.35కు పెంచేందుకు అమరజీవి లక్ష్మయ్య ప్రోత్సాహంతో పోరాటం నడిపి విజయం సాధించారు. ఉపాధ్యాయునిగా మొగల్తూరు సమితిలో ప్రవేశించిన తర్వాత ఆ సమితి ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తిస్తూ వలవల శ్రీరామ్మూర్తి, పొదిల కృష్ణమూర్తి తదితరుల సహచరులతో కలిసి అనేక పోరాటాలు సాగించారు. ఉపాధ్యాయ ఉద్యమాన్ని బలోపేతం చేశారు. మొగల్తూరు అంటే ఉపాధ్యాయ ఉద్యమాల కేంద్రంగా మారింది. అక్కడకు బిడిఒ, ఇఒ (ఎడ్యుకేషన్)గా రావాలంటే చాలామంది అధికారులు భయపడేవారు. ఫలితంగా 14 సంవత్సరాలపాటు ఎస్ఆర్ పోలిశెట్టి సర్వీసు రెగ్యులర్ కాలేదు. నాటి పాలకులు కక్షగట్టి పోలీసుల నుంచి రిపోర్టు రాకుండా అడ్డుకోవడమే కాకుండా కమ్యూనిస్టుగా ముద్రవేసి ఉద్యోగం నుంచి తొలగించాలని శతవిధాలా ప్రయత్నించారు. అయితే ఓ పోలీసు అధికారి పోలిశెట్టిని నరసాపురం పిలిపించి అన్ని విషయాలు సమగ్రంగా చర్చించి ఆయనకు క్లియరెన్స్ సర్టిఫికెట్ ఇచ్చారు. ఏనాడూ పాలకుల నియంతృత్వానికిగాని, అధికారుల నిరంకుశత్వానికిగాని జంకకుండా నిరంతరం పోరాటాలు సాగించారు.

యుటిఎఫ్ ప్రారంభానికి తొలిరోజుల్లో జిల్లా అంతటా పర్యటించి ఉపాధ్యాయ లోకాన్ని చైతన్యపర్చారు. ఆనాటి ఉమ్మడి సంఘ నాయకత్వం విచ్ఛిన్నకర పోకడలు అనుసరించి ఎస్ఆర్ పోలిశెట్టిని, ఆయన నాయకత్వం వహిస్తున్న మొగల్తూరు సమితి శాఖను రద్దు చేసింది. ఈ విషయాన్ని అందరికీ వివరించి ఉపాధ్యాయులను సమీకరించి యుటిఎఫ్ స్థాపించారు. 1974 ఆగస్టు 10న యుటిఎఫ్ ఆవిర్భవించిన తర్వాత జిల్లా శాఖ అధ్యక్ష కార్యదర్శులుగా పూరేటి జోసఫ్, ఎస్ఆర్ పోలిశెట్టి ఎన్నికయ్యారు. అనంతరం అక్టోబర్ 20, 21 తేదీల్లో రాజమండ్రిలో జరిగిన ప్రథమ మహాసభలో సంఘ పాలసీ స్టేట్‌మెంట్ ప్రవేశ పెట్టిన ఘనత ఎస్ఆర్.పోలిశెట్టిదే. అదే మహాసభలో రాష్ట్ర కార్యదిర్శిగా ఎన్నికై రెండు దశాబ్దాలకుపైగా ఆ బాధ్యతల్లో కొనసాగారు. జిల్లా ప్రధాన బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి జిల్లాఅంతటా విస్తృతంగా పర్యటించి సంఘ నిర్మాణానికి నిర్విరామ కృషి చేశారు. ప్రభుత్వ ఉత్తర్వులు క్షుణ్ణంగా అధ్యయనం చేసి వాటికి అనుగుణమైన ప్రాతినిధ్యాలు, రాయబారాలు నడిపారు. 1979లో ఏలూరులో అద్దె భవనంలో జిల్లా కార్యాలయం ఏర్పాటు చేశారు. దాని నిర్వహణ, జిల్లా ఉద్యమ విస్తృతికి ఆరు సంవత్సరాలు జీతం రాని సెలవుపై ఉండి పని చేశారు. ఆ కాలంలో సంఘం ఇచ్చే కొద్దిపాటి భృతితో నిరాడంబర జీవనం గడిపిన త్యాగశీలి. ఆయన భార్య విజయలక్ష్మి సైతం పోలిశెట్టికి అండగా నిలవడం అభినందనీయం.

అమ్మ పాలు.. అమృతం

(15వ పేజీ నుంచి)

ఎక్కువగా ఇస్తుంటారు. ఈ పాలలో ఇనుము మోతాదు తక్కువ. పిల్లలు రక్తహీనతకు లోనవుతారు. పిల్లలు ఒకటి, రెండు సార్లు మోషన్స్ కి వెళ్తే చాలామంది తల్లిపాలు ఆపేస్తున్నారు. ఇది అపోహ మాత్రమే, దీంతో పిల్లల్లో పోషకాలు లోపిస్తాయి. వ్యాధి మరింతగా బాధిస్తుంది. ఫలానా పొడిని పాలలో కలిపి తాగితే శక్తిమాన్ అయిపోతాడు, కొడితే బంతి సిక్స్ ఖాయం, బిల్డింగులు మీద నుంచి దూకవచ్చు ఇలాంటి అశాస్త్రీయ ప్రసారాలను ఏమాత్రం నమ్మకూడదు. బక్కగా పోషకాహార లోపంతో ఉన్న తల్లులు, రొమ్ములు చిన్నగా ఉన్న తల్లులు పిల్లలకు తగినంత పాలు ఇవ్వలేరన్నది మరో అపోహ. సిజేరియన్ ఆపరేషన్ చేసిన తొలి గంటలో బిడ్డకు తల్లిపాలు పట్టవచ్చు. బిడ్డ ఏడిస్తేనే పాలు ఇవ్వాలనేదేమీ లేదు. ఏడవడం అనేది పాలకోసం పసిబిడ్డలు చేసే ప్రయత్నాల్లో ఆఖరిది. కొందరు తల్లులు పాలు రాకపోతే మధ్యలో ఆపేసాం అంటుంటారు. వీళ్ల కూడా ఇవ్వటం ఆరంభిస్తే మళ్లీ పాలు వస్తాయి. దీన్నే రిలాక్టేషన్ అంటారు. బిడ్డ ఎదుగుదల బాగుండి, హాయిగా నిద్రపోతూ, రోజుకు ఆరుసార్లు మూత్రం పోస్తుంటే పాలు సరిపోతున్నాయని అర్థం.

పోత పాలతో ప్రమాదం..

తల్లికి పాలు పడకపోయినా, బిడ్డకు పాలు చాలకపోయినా, పోత పాలే దిక్కు! కానీ ఇవి బిడ్డకు సురక్షితం కాదంటున్నారు నిపుణులు. కల్తీ పాల వల్ల పిల్లలు తరచూ ఇన్ఫెక్షన్ల బారిన పడుతున్నారు. బిడ్డకు పాలిస్తే అందం తగ్గిపోతుంది, అనారోగ్యం పాలవుతాం, బాడీ అన్ ఫిట్ అవుతుంది అనే అపోహలకు బానిసలై, డబ్బా పాలకు పిల్లల్ని అలవాటు చేస్తున్నారు. పోత పాలు వల్ల పిల్లలకు కడుపునొప్పి రావచ్చు, వాంతులు, దద్దుర్లు కూడా వచ్చే ప్రమాదం ఉంది. చర్మం కందిపోయినట్లుగా, ఒంట్లో ఆ సహజమైన వాపు వచ్చినట్లు అనిపిస్తుంది. పిల్లలు డల్‌గా అవుతారు. రక్త విరోచనాలు అవుతాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

తల్లికి లాభమే..

తల్లి ప్రసవానంతరం బిడ్డకు పాలిస్తే ఆ సమయంలో తల్లి బరువు తగ్గడానికి దోహదపడుతుంది. మానసిక ఒత్తిడిని తగ్గించి, బాలింత దశలో రక్త స్రావాన్ని తగ్గిస్తుంది. ప్రసవ సమయంలో స్థిరత్వం కోల్పోయిన గర్భసంచి పూర్వ స్థితికి వచ్చి అధిక రక్తస్రావం తగ్గుతుంది. రొమ్ము, అండాశయ కేన్సర్ లాంటివి రాకుండా తల్లిని కాపాడుతుంది. రొమ్ము వాపు తగ్గడానికి ఉపయోగపడుతుంది. తల్లి బిడ్డకు పాలు ఇవ్వడం వల్ల మొదటి ఆరునెలల్లోపు అండం విడుదల కాదు. తల్లికి జ్వరం వస్తే తల్లి జ్వరం పిల్లకు వస్తుంది పాలు ఇవ్వకూడదు అనేవారు ఉన్నారు. ఇది పూర్తిగా అపోహ. తల్లికి జబ్బు ఉన్నా పాలు ఇవ్వవచ్చు. మెంటల్ డిసీజ్, కామెర్లు ఉన్న తల్లులు పాలు ఇవ్వకూడదు. సన్నగా ఉన్నవారి నుంచి కూడా బిడ్డకు తగిన పాలు అందుతాయని గమనించాలి. ఖరీదైన పాలపొడులు తల్లిపాల పోషకాలను భర్తీ చేస్తాయి అనుకోవడం పొరపాటు అని పలువురు వైద్యాధికారులు చెబుతున్నారు.



మొగల్తూరు మామిడికి యమ క్రేజ్



ప్రజాశక్తి - మొగల్తూరు

మొగల్తూరు మామిడికి ఉభయ తెలుగు రాష్ట్రాల్లో మంచి డిమండ్ ఉంది. ఈ ప్రాంతంలోని పండ్లు రుచికరంగా ఉంటాయి. దీంతోపాటు మిగిలిన అన్ని ప్రాంతాల్లోనూ కాయలు దిగుబడి పూర్తయిన తర్వాత ఇక్కడ ప్రారంభం అవుతాయి. నరసాపురం, మొగల్తూరు మండలాల్లోని సుమారు 600 ఎకరాల పైబడి మామిడితోటలు ఉన్నాయి. ఈ ప్రాంతంలో బంగినపల్లి, పంచదార కల్తీలు, పండూరి మామిడి, కలెక్టర్, చెరుకు రసాలు తదితర రకాల కాయలను తినేందుకు ఇష్టపడతారు. ఈ ప్రాంత బంగినపల్లి కాయలకు విశేష ఆదరణ ఉంది. కొన్ని సందర్భాల్లో కాయ రూ.50 నుంచి రూ.100 ధర పలుకుతుంది.

ఆవకాయ ప్రత్యేకం

ఈ ప్రాంతంలోని మామిడికాయలు ఆవకాయ పచ్చడికు ప్రత్యేకం. ఎక్కడెక్కడ నుంచో వచ్చి ఇక్కడి కాయలు కొనుగోలు చేసి తీసుకెళ్లి ఆవకాయ పచ్చడి పట్టుకుంటూ ఉంటారు. విదేశాల్లో ఉన్న ఇక్కడి వారి బంధువులు ఈ ప్రాంతం నుంచి పచ్చళ్లు తీసుకెళ్తూ ఉంటారు. ముఖ్యంగా కొత్తపల్లి కొబ్బరి, పెద్ద రసాలు తదితర రకాల కాయలను పచ్చళ్లకు ఉపయోగిస్తారు.

మొగల్తూరు మండల పరిషత్ కార్యాలయానికి..

ఆరు దశాబ్దాల చరిత్ర



మొగల్తూరు మండల పరిషత్ కార్యాలయం

ప్రజాశక్తి - మొగల్తూరు

మొగల్తూరు మండల పరిషత్ కార్యాలయానికి సుమారు ఆరు దశాబ్దాల చరిత్ర ఉంది. 1963లో సమితికి కార్యాలయ భవనం నిర్మించారు. ప్రస్తుతం నర్సాపురం, పాలకొల్లు నియోజకవర్గాల పరిధిలోని సర్పంచులు ఈ సమితిలోనే సభ్యులుగా ఉండేవారు. గతంలో ఈ సమితిలో సభ్యులుగా ఉన్న సర్పంచులు జిల్లా రాజకీయాల్లో ఒక వెలుగు వెలిగారు. పాలకొల్లు నియోజకవర్గంలోని దొడ్డిపట్ల సర్పంచిగా పని చేసిన చేగొండి హరిరామజోగయ్య ఈ సమితి సభ్యులే. ఆయన జెడ్‌పి ఛైర్మన్, ఎంఎల్ఎ, ఎంపీగా సేవలందించారు. మండల వ్యవస్థ అమల్లోకి వచ్చిన తరువాత ఈ సమితి కార్యాలయాన్ని మండల ప్రజా పరిషత్ కార్యాలయంగా వినియోగంలోకి తీసుకొచ్చారు. అప్పట్లో నిర్మించిన భవనాన్ని పూర్తిస్థాయిలో ఆధునీకరించలేదు. దీంతో ఇక్కడ పనిచేస్తున్న సిబ్బందికి ఇబ్బందులు తప్పడం లేదు. నూతన ప్రభుత్వంలో భవన నిర్మాణాన్ని చేయాల్సి ఉంది.

ఆక్వా సాగుకు అనువుగా ఆ భూములు



ప్రజాశక్తి - మొగల్తూరు

నరసాపురం నియోజకవర్గం సముద్ర తీరానికి దగ్గరలో ఉంది. గతంలో ఈ భూములన్నీ కూడా చెవుడు వారి ఉండేవి. నీలి విప్లవ ప్రభావంతో ఈ ప్రాంతం రూపురేఖలే మారిపోయాయి. ఈ ప్రాంత భూములన్నీ కూడా ఆక్వా సాగుకు అనువైనవి. ఉప్పు నీరు, చేప నీటి మత్స్య ఉత్పత్తులు పెంచేందుకు అణువుగా ఉంటాయి. నియోజకవర్గంలోని నరసాపురం, మొగల్తూరు మండలాల్లో సుమారు రెండు వేల ఎకరాల పైబడి ఆక్వా చెరువులు ఉన్నాయి.

ఇవీ రకాలు..

ఈ ప్రాంతంలో శీలావతి, రాహు, గడ్డి చేప, పండుకప్ప తదితర స్వదేశీ చేపలతో పాటు రూప్‌చంద్, ఫంగస్ వంటి విదేశీ రకాల చేపలను కూడా ఇక్కడ రైతులు సాగు చేస్తున్నారు. గతంలో ఇక్కడ టైగర్ రొయ్యలు సాగు చేసేవారు. ప్రస్తుతం వనామి సాగు విరివిగా సాగుతుంది.

ఆక్వా ప్రాసెసింగ్ యూనిట్లు

నరసాపురం, మొగల్తూరు మండలాల్లో సుమారు నాలుగు వరకు ఆక్వా ప్రాసెసింగ్ యూనిట్లు ఉన్నాయి. వీటి ద్వారా వందలాదిమంది ఉపాధి పొందుతున్నారు. చిన్నచిన్న ఆక్వా పరిశ్రమలు కూడా ఉన్నాయి.

ఆగని విద్యుత్ బాదుడు - మారని విధానాలు



ప్రభుత్వం ప్రపంచ బ్యాంకు షరతులకు లొంగి, విద్యుత్ భారాలు వేయవద్దని కోరుతూ 2000 సంవత్సరంలో సిపిఎం, వామపక్షాలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఉమ్మడి రాష్ట్రంలో విద్యుత్ మహోద్యమం ఉవ్వెత్తున సాగింది. ఆగస్టు 28వ తేదీన హైదరాబాద్, బషీర్‌బాగ్‌లో ఆనాటి తెలుగుదేశం ప్రభుత్వం ఉద్యమకారులపై పాశవికంగా కాల్పులు జరిపి రామకృష్ణ, విష్ణువర్ధన్ రెడ్డి, బాలస్వామిలను బలికొన్నది.

ఆ ఉద్యమ ఫలితంగా కొద్ది సంవత్సరాల పాటు ప్రభుత్వాలు విద్యుత్ చార్జీల జోలికి వెళ్లలేదు. ప్రపంచ బ్యాంకు సంస్కరణల వేగం తాత్కాలికంగా తగ్గింది. ఈ 24 ఏళ్ల కాలంలో కేంద్రం, రాష్ట్రంలోని వివిధ పార్టీల ప్రభుత్వాలు చాప కింద నీరు లాగా విద్యుత్ రంగంలో ప్రమాదకర విధానాలను అమలు చేశాయి.

ఈ సంస్కరణలతో ప్రజలకు చౌకైన, నాణ్యమైన, నిరంతరాయమైన విద్యుత్తు అందుతుందని పాలకులు నమ్మబలికారు. కానీ ఈ కాలంలో విద్యుత్ భారాలు మరింత పెరిగాయి. ప్రమాదాలు ఆగలేదు. కోతలు పూర్తిగా తొలగలేదు. వ్యవసాయ విద్యుత్ ఒడిదుడుకులతోనే సాగుతోంది. మొత్తంగా పాలకుల మాటలు అబద్ధాలు అని రుజువయ్యాయి. సంస్కరణలు విఫల మయ్యాయి. ప్రజలకు కష్టాలు తప్పలేదు. విద్యుత్ కార్పొరేట్ల చేతిలో బందీగా మారింది.

ఈ పది సంవత్సరాల్లో కేంద్రంలో బిజెపి విద్యుత్ రంగంలో దోపిడీని తీవ్రతరం చేసింది. కేంద్ర విద్యుత్ రంగం చట్టానికి సవరణలు చేయడానికి శత విధాల ప్రయత్నించింది. చట్ట రూపం దాల్చకపోయినా దొడ్డి దారిన ఆ దుష్ట విధానాలను అమలు చేసింది. విద్యుత్ రంగం మొత్తాన్ని అదానీ, టాటా వంటి బడా కార్పొరేట్లకు కట్టబెడుతున్నది.

విద్యుత్ బాదుడు లేకుండా చేస్తామని, ప్రైవేట్ కంపెనీల దోపిడీ అరికడతామని వైసిపి 2019లో అధికారంలోకి వచ్చింది. కేంద్ర ప్రభుత్వ షరతులకు లొంగి వైసిపి ఐదేళ్లలో దొడ్డిదారిన ప్రజల కళ్ళుగప్పి ముక్కలు ముక్కలుగా 32 వేల కోట్ల రూపాయల భారం మోపింది. చార్జీల పెంపు, స్లాబుల మార్పిడి, విద్యుత్ సుంకం, స్థిర చార్జీలు, కస్టమర్ చార్జీలు, అదనపు లోడు డిపాజిట్లు ఇలా పలు రూపాలలో దండుకున్నది. టిడిపి ప్రభుత్వం తెచ్చిన ట్రూ అప్, సర్దుబాటు చార్జీల విధానాన్ని వైసిపి పూర్తి స్థాయిలో అమలు చేసింది. ఏనాడో వాడిన కరెంటుకు, లోటు సాకుతో వైసిపి పాలనలో మూడు రకాల సర్దుబాటు చార్జీలను రూ. 9863 కోట్లు అదనంగా వసూలు చేయడం దుర్మార్గం. ఆ పాలనా కాలానికి సంబంధించి మరో 17,137 కోట్ల రూపాయల సర్దుబాటు చార్జీలు మోపటానికి ప్రతిపాదనలు సిద్ధంగా ఉన్నాయి. అసలు చార్జీల కంటే కొసరు చార్జీలే ఎక్కువయ్యాయి. ప్రతి నెల ఈ వసూళ్లు చేసుకోవచ్చని కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలు అగ్నికి ఆజ్యం పోశాయి. సంస్కరణలలో భాగంగా వచ్చిన ఈ సర్దుబాటు చార్జీల విధానమే ప్రమాదకరం. ప్రపంచవ్యాప్తంగా సాంకేతిక పరిజ్ఞానంలో వచ్చిన మార్పులతో సోలార్, విండ్, జల ఇతర రకాల విద్యుత్ చౌకగా మారింది. ఈ పరిస్థితుల్లో విద్యుత్ చార్జీలు తగ్గాలి. కానీ భారాలు పెరగటం పాలకుల దోపిడీకి తార్కాణం.

కార్పొరేట్ల దోపిడీ, ప్రైవేటీకరణ, అవినీతి, పాలకుల అసమర్థ, అపసవ్య విధానాలే ఈ భారాలకు కారణం. విద్యుత్ ఉత్పత్తి మొత్తం ప్రైవేట్ కంపెనీల చేతుల్లోకి వెళ్లిపోతున్నది. ఈ సంస్థలతో ప్రభుత్వాలు అధిక రేట్లకు దీర్ఘకాలిక ఒప్పందాలు చేసుకొని ప్రజలపై రుద్దుతున్నాయి. బొగ్గు గనులు, విదేశీ బొగ్గు సరఫరా, పోర్టులు, రవాణా, ఇంధనం అన్నీ అదానీ, బడా కంపెనీల పరమై విద్యుత్ వ్యయం పెంచుతున్నాయి. అత్యవసర విద్యుత్ కొనుగోలులో భారీ ఎత్తున అవినీతి చోటు చేసుకుంటున్నది. ట్రాన్స్‌ఫార్మర్లు, మెటీరియల్, అన్ని రకాల కాంట్రాక్టులలో పాలకులు బడా సంస్థలతో కలిసి వేలాది కోట్లు దోచుకుంటున్నారు. బడా సంస్థల నుండి విద్యుత్తును కొనుగోలు చేయడానికి, ప్రభుత్వ విద్యుత్ థర్మల్ కేంద్రాల్లో విద్యుత్ ఉత్పత్తి నిలిపివేసి వాటిని దెబ్బ తీస్తున్నారు. పాలకులు ఇంకా ఎన్నో పాపాలకు పాల్పడ్డారు. విద్యుత్ భారాలతో మన జేబులు ఖాళీ చేస్తున్నారు. కార్పొరేట్ల ఖజానా నింపుతున్నారు. తక్షణ ప్రమాదమే కాదు. భవిష్యత్తును కార్పొరేట్ల చక్రబంధంలో ఇరికిస్తున్నారు. వైసిపి ప్రభుత్వం వ్యవసాయ విద్యుత్ పేరుతో 7 మెగావాట్ల సోలార్ విద్యుత్ 25 సంవత్సరాలు పాటు సరఫరా చేసే ఒప్పందాన్ని అదానీ కంపెనీతో చేసుకున్నది. యూనిట్ రూ.2.49 పైసలకు రాజస్థాన్ నుండి విద్యుత్ సరఫరా చేస్తారు. 25 సంవత్సరాలలో ట్రాన్స్‌మిషన్ చార్జీల పేరుతో లక్ష కోట్ల రూపాయలకు పైగా భారం పడుతుందని అంచనా వేస్తున్నారు. బిజెపి, వైసిపి ప్రభుత్వాలు కుమ్మక్కై ఈ ఒప్పందం చేశాయి. విద్యుత్ పంపిణీ సంస్థలకు సబ్సిడీ బకాయిలను (రూ.12,681 కోట్లు) ప్రభుత్వం చెల్లించ లేదు. ప్రభుత్వ కార్యాలయాలు, సంస్థలు విద్యుత్ వాడుకొని రూ.15,157 కోట్ల బిల్లులు బకాయిలు చెల్లించలేదు. విద్యుత్ సంస్థలను అడ్డంపెట్టి వైసిపి ప్రభుత్వం అప్పులు తెచ్చి ఇతర అవసరాలకు వినియోగించుకున్నది. విద్యుత్ సంస్థలను రూ.1,12,422 కోట్ల అప్పుల ఊబిలోకి నెట్టారు. ఆ వడ్డీ భారం ప్రజలపైనే వేస్తున్నారు. ఇప్పటికే విద్యుత్ ఉత్పత్తిని ప్రైవేటీకరించారు. భవిష్యత్తులో పంపిణీ, సరఫరాను కూడా ప్రైవేట్ సంస్థలకు కట్ట పెట్టాలని కేంద్రం ఒత్తిడి చేస్తున్నది. రాష్ట్ర ప్రభుత్వాలు లొంగిపోతున్నాయి.

దేశంలోని ప్రతి ఇంటికి విద్యుత్ స్మార్ట్ మీటర్లు బిగించాలని కేంద్ర బిజెపి ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. అప్పుల కోసం కేంద్రం షరతులకు వైసిపి లొంగిపోయింది. వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లు బిగించడానికి అంగీకరించి, పలు ప్రాంతాల్లో మీటర్లు బిగించారు. ఇదే కాకుండా ప్రతి ఇంటికి స్మార్ట్ మీటర్ పెట్టడానికి అదానీ కంపెనీతో ఒప్పందాలు చేసుకున్నారు. వ్యవసాయ ఉచిత విద్యుత్‌కు క్రమంగా ఎసరు పెట్టటానికే ఈ మీటర్లు. ప్రీపెయిడ్ స్మార్ట్ మీటరతో ప్రతి ఇంటిలో ముందే బిల్లు చెల్లించి విద్యుత్ బ్యాలెన్స్ వేయించుకోవాలి. బ్యాలెన్స్ అయిపోగానే విద్యుత్ సరఫరా నిలిచిపోతుంది. గంట గంటకు రీడింగ్ చూపిస్తుంది. అధిక విద్యుత్ వినియోగించే రాత్రి సమయాలలో యూనిట్‌కు అధిక చార్జీలు వసూలు చేస్తారు. విద్యుత్ మీటర్‌కు అయ్యే ఖర్చు (10 నుండి 15 వేల రూపాయలు) వినియోగదారులే భరించాలి. దీనిని 93 నెలల పాటు వాయిదాల పద్ధతిలో వసూలు చేస్తారు. మీటర్ల కొనుగోలు ఒప్పందాలతో ప్రజల్ని పీల్చి పిప్పి చేసి అదానీ కంపెనీ వేలాది కోట్ల రూపాయలు దండుకుంటున్నది. హరిత విద్యుత్ పేరుతో బడా కంపెనీలకు వేల ఎకరాల భూములు కట్టబెడుతున్నారు. ఇది మరో రకమైన దోపిడి.

అనేక కారణాలతో పాటు విద్యుత్ బాదుడు, పన్నుల భారాలతో విసిగి ప్రజలు ఆగ్రహంతో వైసిపి ప్రభుత్వాన్ని గద్దె దించారు. తెలుగుదేశం కూటమి అధికారంలోకి వచ్చింది. విద్యుత్ బాదుడు ఆపుతామని కూటమి హామీ ఇచ్చినా నేటికీ ఆగలేదు. కనీసం సర్దుబాటు చార్జీలు కూడా రద్దు చేయలేదు. విద్యుత్ స్మార్ట్ మీటర్ల ఒప్పందం రద్దు కాలేదు. పై పెచ్చు అదానీ కంపెనీ మీటర్లు తాజాగా విద్యుత్ కార్యాలయాలకు చేరుకున్నాయి. ఇంటింటికి మీటర్లు బిగించడానికి అదానీ సిబ్బంది సిద్ధమవుతున్నారు. టిడిపి ప్రతిపక్షంలో ఉండగా మీటర్లను వ్యతిరేకించింది. హైకోర్టులో ఆ పార్టీ నేత కేసు కూడా వేశారు. వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లు పెడితే బద్దలు కొట్టాలని ఆ నేతలు పిలుపునిచ్చారు. నేడు మాట మార్చారు. వ్యవసాయ పంపుసెట్లకు సోలార్ ప్యానెళ్లు బిగిస్తామని చంద్రబాబు సన్నాయి నొక్కులు నొక్కుతున్నారు. సర్దుబాటు చార్జీల విషయం అడిగితే, నేను రద్దు చేస్తానని చెప్పానా? అని ఎదురు ప్రశ్నిస్తున్నారు. అదానీ కంపెనీతో చేసుకున్న సోలార్ ఒప్పందం రద్దు పైన నోరు మెదపడం లేదు. కేంద్రంలో కార్పొరేట్లకు దాసోహం అంటున్న బిజెపి ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వంలో కూడా భాగస్వామి అయ్యింది. నేను మారిన చంద్రబాబుని అని చెప్పుకుంటూ, మరోవైపు గతంలో తాను ప్రవేశ పెట్టిన విద్యుత్ సంస్కరణలు దేశానికి ఆదర్శమని ఇప్పుడు కూడా గొప్పలు చెప్పుకోవడం ఏమిటి? మారింది ఎక్కడా? అవే విధానాలను టిడిపి, బిజెపితో కలిసి అమలు చేయటం వాగ్దాన భంగమే కాదు, ప్రజా ద్రోహం అవుతుంది. టిడిపి కూటమి ప్రభుత్వం విడుదల చేసిన విద్యుత్ శ్వేతపత్రంలో వైసిపి ప్రభుత్వ దోపిడీ, భారాలు వివరంగా చెప్పారు. కాని కూటమి ప్రభుతం వీటన్నింటిని కొనసాగించడం వారి ద్వంద్వ వైఖరికి నిదర్శనం. షిర్డీ సాయి ఎలక్ట్రికల్స్ వైసిపి పాలనలో విద్యుత్ రంగంలో విచ్చలవిడి అవినీతికి పాల్పడిందని...జగన్, వైసిపి బినామీ సంస్థ అని... టిడిపి నేతలు పదే పదే చెప్పారు. ఆ సంస్థతో చేసుకున్న ఒప్పందాలను, భూముల కేటాయింపులను టిడిపి సర్కారు కొనసాగించడం శోచనీయం. ఎన్నికలలో ఈ షిరిడీ సాయి కంపెనీ నుంచి టిడిపి పార్టీ రూ.40 కోట్లు ఎన్నికల బాండ్ల రూపంలో (2024 జనవరి) పొందడం సిగ్గుచేటు. టిడిపి కూటమి ప్రభుత్వం 25 ఏళ్ల సంస్కరణల వైఫల్యాల అనుభవాన్ని గమనించి తమ విధానాలు మార్చుకోవాలి. విద్యుత్ భారాలు తగ్గించాలి. కార్పొరేట్ల దోపిడీ అరికట్టాలి. సర్దుబాటు చార్జీలను తక్షణమే రద్దు చేయాలి. స్మార్ట్ మీటర్లు ఆపాలి. వ్యవసాయ పంపు సెట్లకు మీటర్లు తొలగించాలి. అదానీ తదితర కంపెనీలతో తీసుకున్న అడ్డగోలు విద్యుత్ ఒప్పందాలను రద్దు చేయాలి. విద్యుత్ భారాలు, మీటర్లు, ప్రైవేటీకరణ విధానాలకు వ్యతిరేకంగా అమరవీరుల స్ఫూర్తితో మరో పోరుకు ప్రజలు సిద్ధం కావాలి.


సముద్ర స్నానాలు చేస్తున్న పర్యాటకులు

పర్యాటక కేంద్రం.. పేరుపాలెం బీచ్

ప్రజాశక్తి - మొగల్తూరు

ఉవ్వెత్తున ఎగసిపడే అలలు.. పరవశించేలా వీచే పిల్ల తమ్మరులు... ప్రకృతి అందాలు.. యువతీ యువకుల కేరింతలు. చిన్నాపెద్దల సంతోష తరంగాలు... ఇవి మొగల్తూరు మండలం కెపిపాలెంలో పేరుపాలెం బీచ్‌లో దృశ్యాలు. కెపిపాలెం పంచాయతీ పరిధిలోని బీచ్, పేరుపాలెం పంచాయతీ పరిధిలోని దుర్గమ్మ బీచ్‌లు జిల్లాలో పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చెందుతున్నాయి. నిత్యం ఇక్కడకు వందల సంఖ్యలో యాత్రికులు వస్తుంటారు. కార్తీక మాసంలో ప్రతి ఏడాది లక్షలాది మంది యాత్రికులు ఈ బీచ్‌ను సందర్శిస్తుంటారు. జిల్లాలో 19 కిలోమీటర్ల పొడవునా సముద్ర తీరప్రాంతం ఉంది. దీనిలో పేరుపాలెం పరిధిలో రెండు ప్రాంతాలు బీచ్‌లుగా అభివృద్ధి చెందాయి. సుమారు దశాబ్ద కాలం క్రితం కెపిపాలెం సముద్ర తీరంలో ఫాదర్ స్టాలిన్ కోట్లాది రూపాయలతో వేలంగిణి మాత దేవాలయం, ప్రశాంత ప్రార్థనా మందిరాలు నిర్మించారు. ముచ్చర్ల అలెగ్జాండర్ వెంకటేశ్వరస్వామి ఆలయం నిర్మించి విగ్రహాన్ని ప్రతిష్టించారు. ఈ విగ్రహం ఇదే బీచ్‌లో సముద్ర గర్భం నుంచి కొట్టుకొచ్చినట్లు చెబుతారు. దుర్గమ్మ బీచ్‌లో స్థానిక అంజనాపుత్ర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రూ.30 లక్షలతో 54 అడుగుల హనుమాన్ విగ్రహం నిర్మించారు. మత్స్యకార సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మత్స్యనారాయణుడు విగ్రహం పెట్టారు. కోట్లాది రూపాయలతో మత్స్యనారాయణ స్వామి ఆలయాన్ని నిర్మించారు.

కార్తీక మాసంలో సందడే సందడి

కాలక్రమేణా ప్రజల అభిరుచులు మారడం, ప్రభుత్వం రహదారి సౌకర్యాలు మెరుగుపరచడంతో కెపిపాలెం, పేరుపాలెం బీచ్‌లు విహార యాత్రా కేంద్రాలుగా మారాయి. కార్తీక మాసంలో అన్ని రోజుల్లోనూ వేలాది మంది యాత్రికులు వస్తుంటారు. ఇక ఆదివారాలైతే ఆ సంఖ్య లక్ష దాటుతోంది. విశాలమైన సముద్రతీరం, సరుగుడు, కొబ్బరితోటల మధ్య ఆహ్లాదంగా ఉండే ఈ ప్రాంతం సందర్శకులను అమితంగా ఆకట్టుకుంటోంది.

ప్రయాణం ఇలా

పేరుపాలెం, కెపిపాలెం బీచ్‌లకు నరసాపురం, భీమవరం నుంచి వెళ్లేందుకు రవాణా మార్గాలు ఉన్నాయి. నరసాపురం నుంచి పేరుపాలెం, కెపిపాలేనికి నిత్యం ఆర్‌టిసి బస్సులు నడుస్తున్నాయి. నరసాపురం పట్టణం నుంచి పేరుపాలెం బస్టాప్ నుంచి 15 కిలోమీటర్ల దూరం ఉంది. భీమవరం నుంచి పేరుపాలేనికి ప్రయివేటు బస్సులు ఉన్నాయి.

సముద్ర స్నానం .. జాగ్రత్త తప్పనిసరి

ఇక్కడ సముద్ర స్నానంలో జాగ్రత్తలు పాటించాలి. సముద్రంలో హద్దుమీరి లోతుకు వెళ్లడం, మద్యం తాగి సముద్రంలో దిగడం ప్రమాదకరం. కెరటాలు ఉవ్వెత్తున వచ్చేటప్పుడు వాటికి ఎదురెళ్లడం మంచిదికాదు. కెరటాలు వెనక్కి వెళ్లిపోయేటప్పుడు స్నానాలు చేసేవారి పాదాల కింద ఉండే ఇసుక కోతకు గురవుతుంది. దీంతో రెప్పపాటులో తూలిపడి ప్రాణాపాయం చోటుచేసుకునే ప్రమాదం పొంచి ఉంది. ప్రతియేటా ఈ బీచ్‌లో యాత్రికులు మృత్యువాత పడుతుండటం కలవరపరుస్తోంది.

ఆధ్యాత్మికంగా..

కపి పాలెం, పేరుపాలెం బీచ్‌లు పర్యటక కేంద్రాలుగానే కాకుండా ఆధ్యాత్మిక కేంద్రాలుగా కూడా ప్రసిద్ధి చెందాయి. కనకదుర్గ బీచ్‌లో సుమారు రూ.కోటి వెచ్చించి నిర్మించిన అష్టలక్ష్మి సమేత మత్స్యనారాయణ స్వామి ఆలయం, షిరిడి సాయిబాబా, 54 అడుగుల అభయాంజనేయ స్వామి విగ్రహాలతో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. పేరుపాలెం బీచ్‌లో వెంకటేశ్వరస్వామి ఆలయం, కెపిపాలెం బీచ్‌లో వేలంగిణి మాత ఆలయం, రుక్మిణి సత్యభామ సమేత పాండురంగ స్వామి ఆలయాలు ఉన్నాయి. ఆలయాల్లో స్వామిని దర్శించుకుని పూజలు నిర్వహించేందుకు వేలాదిమంది తరలి వస్తుంటారు.

ఏసుప్రభు శ్రమకాల దీక్ష విరమణకు..

ఏసుప్రభు శ్రమకాల దీక్షను క్రైస్తవ సోదరులు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తారు. గుడ్ ఫ్రైడే, ఈస్టర్ సందర్భంగా 40 రోజులు దీక్ష చేసిన క్రైస్తవులు ఇక్కడ ఉన్న వేళాంగిణి మాతను దర్శించుకుని దీక్ష వర్ణించేందుకు వేలాదిగా తరలివస్తూ ఉంటారు. దీంతో ఆ మూడు రోజులు ఇక్కడ పండుగ వాతావరణం నెలకొంటుంది.


మొగల్తూరులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

మొగల్తూరు పిహెచ్‌సిలో ఆధునిక వైద్య సేవలు

ప్రజాశక్తి - మొగల్తూరు

మొగల్తూరులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కోసం పెనుమత్స రంగరాజు భవనాలు నిర్మించారు. మొగల్తూరు మండలంలోని గ్రామాలు జిల్లాకు శివారున సముద్ర తీరంలో ఉన్నాయి. గతంలో ఈ ప్రాంతానికి వైద్య సేవలు అంతంత మాత్రంగానే ఉండేవి. సుమారు 50 ఏళ్ల క్రితం ప్రజల ఇబ్బందులను గుర్తించిన మానవతావాది భీమవరం గ్రామీణ మండలం వెంప గ్రామానికి చెందిన పెనుమత్స రంగరాజు తన కుటుంబ సభ్యులతో కలిసి మొగల్తూరులో నివాసం ఉండేవారు. ప్రజల అవసరాలను గుర్తించి ప్రభుత్వాసుపత్రికి గూడు కల్పించేందుకు ముందుకు వచ్చారు. గ్రామస్తుల సహకారం, సొంత సొమ్ములు సైతం వెచ్చించి ఆసుపత్రికి సుమారు ఆరు ఎకరాల్లో విశాల ప్రాంగణంలో భవన నిర్మాణాలు చేశారు. ప్రజలకు సేవలందించేందుకు ఇక్కడ పూర్తిస్థాయిలో వైద్యులు, సిబ్బందిని నియమించారు. దీంతో అప్పటి నుంచి ఇక్కడ ఆధునిక వైద్య సేవలు ప్రజలకు అందుబాటులోకి వచ్చాయి.

పెనుగొండలో తక్కువ ధరలకే..

బీరువాలు, ట్రంక్ పెట్లు

ప్రజాశక్తి - పెనుగొండ

మండలంలో ఐరన్ వస్తువులు, ఐరన్ బీరువాలు, ట్రంక్ పెట్లు, బకెట్లు, స్టీల్, బియ్యం పెట్లు, వ్యవసాయానికి అన్ని రకాల పనిముట్లు, నీళ్ల తోడే బోరింగులు, గడ్డపార, పార్లర్, విద్యుత్ మోటార్లకు, డోర్లు, పిండి వంటకు సంబంధించిన అబ్బ, ముకడి సెంట్రింగ్ అయిన ఐరన్ బాక్సులు ఎక్కువగా తయారు చేస్తుంటారు. ఇక్కడ తయారుచేసిన పనిముట్లు తక్కువ ధరకే లభిస్తుండడంతో చుట్టుప్రక్కల గ్రామాలకు కొనుగోలు చేస్తుంటారు. దాదాపు 60 సంవత్సరాల కిందట నుంచి ప్రారంభమైన బీరువాలు, ట్రంక్ పెట్లు కర్ణాటక, ఉభయ తెలుగు



రాష్ట్రాలలోని ప్రాంతాలకు ఇక్కడనుంచే ఎగుమతి అవుతాయి. ఐరన్ వస్తువుల తయారీ రంగంలో పెనుగొండ ప్రసిద్ధి. ఇక్కడ తయారైన వస్తువులు చూడముచ్చటగా ఉంటాయని ప్రజల నమ్మకం. దీనిపై ఆధారపడి కుటుంబాలు సుమారు 400 మందిపైనే జీవిస్తారని, ఐరెన్ బకెట్లకు సంబంధించిన ముడుసరుకులు విశాఖపట్నం, విజయవాడ నుంచి తీసుకొస్తారని కార్మికులు చెబుతున్నారు. ఇక్కడ తయారైన వస్తువులకు ఇతర రాష్ట్రాల్లో మంచి గిరాకీ ఉంటుంది. నిత్యం దేశంలోని పలు రాష్ట్రాల్లో ఎగుమతులు కొనసాగిస్తామని వ్యాపారస్తులు చెబుతున్నారు.

రుచికరమైన కజ్జికాయలు.. వినాయక స్వీట్స్ సొంతం

ప్రజాశక్తి - పెనుగొండ

కొబ్బరితో చేసిన కజ్జికాయలకు పెనుగొండ ప్రసిద్ధి. సుమారు 60 సంవత్సరాల నుంచి వినాయక స్వీట్ నిర్వాహకులు నాణ్యత తగ్గకుండా నేటికీ అత్యంత రుచిగా కజ్జికాయలు తయారు చేస్తుంటారు. ఆంధ్ర వంటల్లో ఇది ఓ ముఖ్యమైన వంటకం. అందుకే తెలుగువారు కజ్జికాయ ప్రత్యేకంగా తయారుచేసి, ఇతర రాష్ట్రాలలో ఉన్న వారి బంధువుల ఇంటికి తీసుకువెళ్తుంటారు. అలాగే పలు దేశాలు సింగపూర్, అమెరికా, దుబాయ్, కువైట్ ఇలా ఎక్కడ తెలుగువారు వుంటే అక్కడకు ఈ వినాయక స్వీట్‌ను తీసుకువెళ్తూ ఉంటారని చెబుతున్నారు. ఈ కజ్జికాయలు నాణ్యమైన బెల్లం, బాదంపప్పు, జీడిపప్పు, నెయ్యి, సుగంధద్రవ్యాలతో ప్రత్యేకంగా తయారు చేస్తారని, పెనుగొండ పేరు చెబితే కజ్జికాయ గుర్తొస్తుందని బంధువులు ప్రత్యేకంగా చెబుతారు. ఈ కజ్జికాయలను వినాయక స్వీట్ అధినేత వినుమర్తి కాశీ దాస్ తయారు చేసేవారిని, తదనంతరం తనయుడు వివిఎస్.లింగాలు ప్రస్తుతం తయారు చేస్తున్నారని, అప్పటికి ఇప్పటికీ నాణ్యతలో రాజీపడకుండా క్వాలిటీగా స్వీటును తయారుచేస్తూ ప్రజలు ఆదరణ పొందుతున్నారు.



వినాయక స్వీట్స్‌లో విక్రయిస్తున్న కజ్జికాయలు

